VELTHURU TELUGU DAILY

# వెలుతురు

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి, నల్గొండ : బుధవారం 10.06.2026
సంపుటి : 08 సంచిక : 01 , పేజీలు : 12 , వెల:రూ . 5/-

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRAPRADESH

www.velthuru.com



5

**పెరిగిన పెట్రోల్, గ్యాస్ ధరలను తక్షణమే తగ్గించాలి**



# మహిళలతో పెట్టుకోవద్దు: సీఎం రేవంత్ రెడ్డి

**మహిళా శక్తి సభలో సీఎం కీలక వ్యాఖ్యలు**

- స్వయం సహాయక బృందాలకు 553 ఆర్టీసీ బస్సుల పంపిణీ
- బీఆర్ఎస్‌పై మహిళా సంక్షేమం విషయంలో విమర్శలు
- ఉచిత బస్సు ప్రయాణానికి రూ.10,500 కోట్లు చెల్లించామన్న సీఎం
- మహిళల అభివృద్ధే రాష్ట్ర అభివృద్ధికి పునాది
- వ్యవసాయానికి ప్రాణవాయువు ఆడబిడ్డలేనని వ్యాఖ్య
- మహిళా సంఘాలకు రూ.వెయ్యికోట్ల విలువైన భూమి కేటాయింపు
- కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామన్న హామీ
- కాంగ్రెస్ మహిళా సాధికారతకు కట్టుబడి ఉందన్న సీఎం
- 2034 వరకు ప్రజల ఆశీర్వాదంతో పాలన కొనసాగిస్తామన్న ధీమా



**హైదరాబాద్ వెలుతురు జూన్ 09:**

సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన మహిళాశక్తి సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళల పాత్ర, వారి సాధికారత, రాష్ట్ర అభివృద్ధిలో వారి ప్రాధాన్యంపై విస్తృతంగా మాట్లాడారు. స్వయం సహాయక బృందాలకు 553 ఆర్టీసీ బస్సులను పంపిణీ చేసిన సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన పలు కీలక వ్యాఖ్యలు చేశారు.మహిళలకు గౌరవం ఇచ్చే సంస్కృతి భారతదేశానిదని, ఆడబిడ్డ పుడితే మహాలక్ష్మి ఇంటికి వచ్చినట్లుగా భావించే సంప్రదాయం మన సమాజంలో ఉందని సీఎం పేర్కొన్నారు. మహిళలతో విభేదించిన వారు రాజకీయంగా నిలబడలేరని వ్యాఖ్యానిస్తూ, మహిళల మద్దతు కోల్పోవడం వల్లే బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారాన్ని కోల్పోయిందని విమర్శించారు.

▶ మిగతా 2లో

## ఈనెల 13న బీజేపీ 'స్వచ్ఛ పాఠశాల'



- కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో బండి సంజయ్ వినూత్న కార్యక్రమం
- 11,12 తేదీల్లో అన్ని స్కూళ్లలో బీజేపీ టిఫిన్ బ్రేక్ లు
- ఈనెల 16న విద్యార్థులను స్కూళ్లో చేర్పించాలంటూ ర్యాలీలు
- ఈసారి ఒకేసారి ఒకే టైంలో వేలాది సైకిళ్ల పంపిణీకి కేంద్ర మంత్రి బండి సంజయ్ శ్రీకారం
- గిన్నిస్ బుక్ లో చోటు సంపాదించి రికార్డు సృష్టించే యోచన
- బీజేపీ జిల్లా అధ్యక్షులు, మండలాధ్యక్షులతో బండి సంజయ్ భేటీ

2

## రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: భట్టి విక్రమార్క

- పండించిన ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేస్తున్నామని వెల్లడి
- 72 లక్షల టన్నుల ధాన్యం సేకరించి రైతులకు రూ.14 వేల కోట్లు చెల్లింపు
- తడిసిన ధాన్యాన్నీ మద్దతు ధరకు కొనుగోలు చేసిన ప్రభుత్వం
- మొక్కజొన్న కొనుగోలులో కేంద్రం సహకరించాలని విజ్ఞప్తి
- రైతుల రుణభారం తగ్గించేందుకు రూ.22 వేల కోట్ల రుణమాఫీ
- 30 లక్షల పంపుసెట్లకు ఉచిత విద్యుత్ అందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం



2

- 53 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత కరెంట్
- దేవాదుల ప్రాజెక్టు పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయని ప్రకటన

## భావితరాల ఆకాంక్షలకు అనుగుణంగానే అడుగులు

- స్థిరమైన, పర్యావరణహిత పారిశ్రామికవృద్ధికి ప్రాధాన్యం
- పారిశ్రామికవేత్తలు పెట్టుబడిదారులు కాదు.. రాష్ట్ర ప్రగతిలో కీలక భాగస్వాములు
- 'ఎఫ్ టీసీసీఐ ఎక్స్ లెన్స్ అవార్డ్స్ 2026' ప్రదానోత్సవంలో మంత్రి శ్రీధర్ బాబు

**హైదరాబాద్ వెలుతురు జూన్ 09:**

భావితరాల ఆకాంక్షలకు అనుగుణంగా తెలంగాణను దేశంలోని ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్ గా తీర్చిదిద్దేలా ప్రణాళికాబద్ధంగా అడుగులు వేస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. భవిష్యత్తు కోసం ఎదురు చూడకుండా, దాన్ని నిర్మించేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామన్నారు.

▶ మిగతా 2లో



**రాష్ట్రంలోని ప్రధాన దేవాలయాల్లో భక్తులకు చేనేతతో తయారు చేసిన శాలువాలే అందించాలి**



2

**పోలీస్-మీడియా సత్సంబంధాలకు వేదికగా 'సైబరాబాద్ ప్రెస్ & పోలీస్ ఫ్రెండ్లీ క్రికెట్ లీగ్–2026' ప్రారంభం**



5

## ప్రజా నమ్మకమే ఈ ప్రభుత్వ బలం

- మీడియా సమావేశంలో తెలంగాణ రెవెన్యూ , గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

**ఖమ్మం వెలుతురు జూన్ 09:**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి ప్రజా సంక్షేమమే పరమావధిగా పనిచేస్తోందని, ప్రజల్లో ప్రభుత్వంపై ఉన్న నమ్మకం, విశ్వాసానికి పాలేరు నియోజకవర్గంలో నిర్వహించిన 'ప్రజా దర్బార్' విజయవంతం కావడమే నిదర్శనమని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం ఖమ్మంలోని ఎస్ ఆర్ కన్వెన్షన్ హాల్లో ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రఘురామ్ రెడ్డితో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం మూడో సంవత్సరంలోకి అడుగు పెట్టిన సందర్భంగా చేపట్టిన 99 రోజుల ప్రత్యేక కార్యాచరణ జూలై 12



నాటికి పూర్తి కాబోతోందని వెల్లడించారు.

**14 క్లస్టర్లలో వెల్లువెత్తిన జనసందోహం.. 24వేల పైచిలుకు దరఖాస్తులు**

పాలేరు నియోజకవర్గాన్ని 14 క్లస్టర్లుగా వర్గీకరించి, గత 25 నుండి 30 రోజులుగా 'ప్రజల వద్దకే ప్రభుత్వం' అనే నినాదంతో ప్రజా దర్బార్ నిర్వహించినట్లు మంత్రి తెలిపారు.

▶ మిగతా 3లో




**డీకేకు కొనసాగుతున్న తలనొప్పులు**

- శాఖల కేటాయింపుపై మరో మంత్రి అసంతృప్తి
- గ్రేటర్ బెంగళూరు అభివృద్ధి శాఖపై కృష్ణ బైరే గౌడ అభ్యంతరాలు
- కీలక అధికారాలను సీఎం వద్దే ఉంచుకోవడంపై ఆగ్రహం

11

## ఇరాన్‌పై దాడులకు దిగితే ఇజ్రాయెల్ ఒంటరే!

- నెతన్యాహుకు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర హెచ్చరికలు
- దూకుడుగా వెళ్తే ప్రపంచ దేశాల మద్దతు కోల్పోతారన్న ట్రంప్
- దౌత్య చర్చలకు సమయమివ్వాలని సూచన
- క్షిపణి దాడులు యుద్ధాన్ని క్లిష్టంగా మారుస్తాని వెల్లడి
- ఇజ్రాయెల్ రక్షణకు కట్టుబడి ఉన్నా.. ప్రతిస్పందన పరిమితమే
- పరిస్థితిని చక్కదిద్దేందుకు



- ఇజ్రాయెల్ ప్రధానితో మరోసారి చర్చ
- ఇరాన్ కూడా వెనక్కి తగ్గితే తాము దాడులు చేయమన్న నెతన్యాహు
- ఇరాన్ అణు ముప్పును సమర్థంగా అడ్డుకున్నాం

▶ మిగతా 2లో

# మహిళలతో పెట్టుకోవద్దు...

(మొదటి పేజీ తరువాయి)

గత ప్రభుత్వం మహిళలకు చెల్లించాల్సిన సున్నా వడ్డీ రుణాల బకాయిలను చెల్లించలేదని ఆరోపించిన ఆయన, తమ ప్రభుత్వం మహిళల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. మహిళల ఉచిత బస్సు ప్రయాణ పథకం అమలు కోసం ఆర్టీసీకి ఇప్పటికే రూ.10,500కోట్ల మేర చెల్లింపులు చేసినట్లు వెల్లడించారు.వ్యవసాయ రంగంలో మహిళల పాత్ర ఎంతో కీలకమని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను నిలబెట్టేది మహిళలేనని సీఎం అన్నారు. ప్రపంచానికి మహిళా నాయకత్వ శక్తిని చాటిచెప్పిన ఘనత మాజీ ప్రధాని ఇందిరా గాంధీదేనని పేర్కొన్నారు. అమెరికాలో మహిళలకు ఓటు హక్కు రావడానికి శతాబ్దాల సమయం పట్టిందని, కానీ భారత్‌కు స్వాతంత్ర్యం వచ్చిన వెంటనే మహిళలకు ఓటు హక్కు కల్పించిన ఘనత జవహర్‌లాల్ నెహ్రూకు దక్కుతుందని గుర్తు చేశారు.మహిళల రాజకీయ ప్రాతినిధ్యం విషయంలో కూడా కాంగ్రెస్ పార్టీ ముందంజలో ఉందని సీఎం అన్నారు. దేశానికి తొలి మహిళా రాష్ట్రపతిని అందించిన ఘనత కాంగ్రెస్‌కే దక్కిందన్నారు. అలాగే గత బీఆర్ఎస్ ప్రభుత్వ తొలి ఐదేళ్లలో ఒక్క మహిళకు కూడా మంత్రి పదవి ఇవ్వలేదని విమర్శించారు. తమ ప్రభుత్వంలో ఇద్దరు మహిళలకు మంత్రి పదవులు ఇచ్చామని తెలిపారు.మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడం వల్ల విద్యారంగంలో సానుకూల మార్పులు కనిపిస్తున్నాయని సీఎం వివరించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి విద్యార్థినులు సమీప పట్టణాలకు వెళ్లి చదువుకునే అవకాశం పెరిగిందని, దీనివల్ల బాలికల డ్రాప్‌అవుట్ రేటు తగ్గిందని చెప్పారు.రాష్ట్ర మహిళలు ఇప్పుడు కేవలం స్వయం సహాయక సంఘాలకే పరిమితం కాకుండా పెట్రోల్ బంకులు, సోలార్ విద్యుత్ ప్రాజెక్టుల నిర్వహణలో కూడా ముందుకు వస్తున్నారని సీఎం తెలిపారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ప్రత్యేకంగా మహిళా శక్తి భవనాలను నిర్మించనున్నట్లు ప్రకటించారు. హైటెక్ సిటీ సమీపంలో రూ.వెయ్యి కోట్ల విలువైన భూమిని మహిళా సంఘాలకు కేటాయించినట్లు వెల్లడించారు.రాష్ట్ర ఆర్థికాభివృద్ధి మహిళల చేతుల్లోనే ఉందని పేర్కొన్న సీఎం, కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఆ లక్ష్యం నెరవేరే వరకు తాను విశ్రమించబోనని చెప్పారు. ప్రజల ఆశీర్వాదంతో 2034 వరకు ఈ ప్రభుత్వాన్ని కొనసాగిస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు.

# ఈనెల 13న బీజేపీ...

(మొదటి పేజీ తరువాయి)

- మోదీ 12 ఏళ్ల పాలన పూర్తి నేపథ్యంలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చ

**కరీంనగర్ వెలుతురు జూన్ 09:**

కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం 12 ఏళ్ల పాలనను పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తాను ప్రాతినిధ్యం వహిస్తున్న కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ''స్వచ్ఛ పాఠశాల'' పేరుతో తన పార్లమెంట్ నియోజకవర్గంలోని 7 అసెంబ్లీ నియోజవర్గాల్లోని అన్ని గ్రామాల్లోని ప్రాథమిక, ప్రాథమికొన్నత, ఉన్నత ప్రభుత్వ పాఠశాలలన్నింటినీ పరిశుభ్రం చేయాలని నిర్ణయించారు. ''స్వచ్ఛ పాఠశాల'' పేరుతో ఈనెల 13న ఆయా పాఠశాలలన్నింటినీ పరిశుభ్రం చేయాలని పిలుపునిచ్చారు.

మంగళవారం రోజున కరీంనగర్ లోని చైతన్యపురిలో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలోని జిల్లాల అధ్యక్షులు, మండలాధ్యక్షులతో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ సమావేశమయ్యారు. మోదీ 12 ఏళ్ల పాలనను పూర్తి చేసుకున్న నేపథ్యంలో కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. ఈనెల 15నుండి పాఠశాలలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఆయా ప్రభుత్వ పాఠశాలన్నింటినీ పరిశుభ్రం చేసి సుందరంగా ముస్తాబు చేయాలని పిలుపునిచ్చారు. అందులో భాగంగా పార్లమెంట్ నియోజకవర్గంలో రేపు(10న) మండలాల వారీగా పార్టీ కార్యకర్తలంతా సమావేశమై ఒక్కో పాఠశాల వారీగా ఇంచార్జీలను నియమించాలని సూచించారు.

ఈనెల 11, 12 తేదీల్లో భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు గ్రామాలకు వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో ''టిఫిన్ బైఠక్'' పేరుతో సమావేశం నిర్వహించాలని పిలుపునిచ్చారు. ''ప్రతి స్కూల్ లోని ఎన్ని తరగతి గదులుంటాయో, ఒక్కో గదికి ఇద్దరు చొప్పున కార్యకర్తలను కేటాయించాలి. ఈనెల 13న అన్ని పాఠశాలల్లోని అన్ని తరగతి గదులను శుభ్రం చేయించాలి. అవసరమైతే చీపురు, క్లాత్ వంటి వస్తువులను తీసుకెళ్లాలి. క్లాస్ రూంలను శుభ్రం చేయడంతోపాటు ఆయా పాఠశాలలను సుందరంగా ముస్తాబు చేయాలి. స్కూల్ ను క్లీన్ చేయడం ద్వారా ఒక మంచి వాతావరణం కల్పించాలి. ఫేస్ బుక్, ట్విట్టర్, ఇన్ స్ట్రాగ్రాం వంటి సోషల్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలి'' అని కోరారు. దీంతోపాటు ఈనెల ప్రతి గ్రామంలో ''మీ పిల్లలను పాఠశాలల్లో చేర్పించండి'' అనే నినాదంతో ఊరూవాడా ర్యాలీలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. దీనిపై విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు.

ఈ ఏడాది కూడా ప్రభుత్వ పాఠశాలల్లో టెన్త్ చదివే విద్యార్థులకు మోదీ గిఫ్ట్ పేరుతో ఉచితంగా బ్రాండెడ్ సైకిల్ ను అందజేయాలని నిర్ణయించినట్లు కేంద్ర మంత్రి వెల్లడించారు. ''ఇదే విషయాన్ని ఊరూవాడా చెబుతూ ప్రభుత్వ పాఠశాలల్లో టెన్త్ చదువుకునే ప్రతి ఒక్కరికి ఉచితంగా బ్రాండెడ్ సైకిల్ అందిస్తామని చెప్పండి. గతంలో మాదిరిగా కాకుండా ఈసారి రికార్డు స్థాయిలో ఒకేసారి ఒకే టైంలో అన్ని ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులందరికీ సైకిళ్లను పంపిణీ చేద్దాం. అవసరమైతే గిన్నిస్ బుక్ రికార్డులో నమోదయ్యేలా క్రుషి చేద్దాం. తద్వారా ప్రజల్లోకి మంచి సందేశాన్ని పంపుతాం.''అని పేర్కొన్నారు.

## నేడే మహాశక్తి ఆలయంలో ప్రత్యేక పూజలు

మరోవైపు 12 ఏళ్ల మోదీ పాలనను పురస్కరించుకుని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ రేపు ఉదయం కరీంనగర్ మహాశక్తి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

# రాష్ట్రంలోని ప్రధాన దేవాలయాల్లో...

(మొదటి పేజీ తరువాయి)

**హైదరాబాద్ వెలుతురు జూన్ 09:**

రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాల్లో భక్తులకు ఆశీర్వచనంగా చేనేత రంగం ద్వారా తయారు చేసిన శాలువాలను మాత్రమే అందించాలని పద్మశ్రీ అవార్డు గ్రహీత, ప్రముఖ చేనేత కళాకారుడు గజం అంజయ్య అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖామాత్యులు శ్రీమతి కొండా సురేఖ గారిని కోరారు. ఈ మేరకు మంత్రి కొండా సురేఖ గారిని ఈ రోజు జూబ్లీహిల్స్ లోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా చేనేతకారులు స్వచ్ఛమైన నూలుతో తయారైన శాలువాతో మంత్రిగారిని సత్కరించారు.

యాదాద్రి, భద్రాచలం, బాసర, వేములవాడ తదితర ప్రధాన దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, సేవల్లో పాల్గొనే భక్తులకు అందించే శాలువాలు ప్రస్తుతం పెద్దమొత్తంలో మరమగ్గాలు, మిల్లుల్లో కృత్రిమ నూలుతో తయారవుతున్నాయని ఆయన మంత్రి సురేఖ గారికి వివరించారు. పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా దేవాలయాల్లో ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని నిషేధిస్తున్న పరిస్థితుల్లో సింథటిక్ నూలుతో తయారైన శాలువాల వినియోగాన్ని కొనసాగించడం సముచితం కాదని తన అభిప్రాయాన్ని మంత్రి సురేఖ గారికి విన్నవించారు. ఈ కార్యక్రమంలో చేనేత రంగానికి చెందిన పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. పవిత్రమైన దేవాలయాల్లో భక్తులకు అందించే శాలువాలు స్వచ్ఛమైన పత్తి లేదా పట్టు చేనేత వస్త్రాలతో తయారైతే వాటికి మరింత ఆధ్యాత్మిక, సాంస్కృతిక విలువ చేకూరుతుందని అంజయ్య మంత్రి సురేఖ గారికి తెలిపారు. అదే సమయంలో ఈ నిర్ణయం రాష్ట్రంలోని వేలాది మంది చేనేత కార్మికులకు స్థిరమైన ఉపాధి అవకాశాలను కల్పించడంతో పాటు తెలంగాణ చేనేత సంప్రదాయాల పరిరక్షణకు దోహదపడుతుందని వివరించారు. అందువల్ల రాష్ట్రంలోని అన్ని ప్రధాన దేవాలయాల్లో చేనేతతో తయారైన పవిత్ర శాలువాల వినియోగాన్ని ప్రోత్సహించేలా ప్రభుత్వం తగిన విధాన నిర్ణయం తీసుకోవాలని అంజయ్య మంత్రిగారికి విజ్ఞప్తి చేశారు. గజం అంజయ్య చేసిన సూచనలు, ప్రతిపాదనలను మంత్రి కొండా సురేఖ సానుకూలంగా స్వీకరించారు. ఈ దిశగా కృషి చేస్తున్న గజం అంజయ్యను మంత్రి సురేఖ అభినందించారు. పర్యావరణ పరిరక్షణతో పాటు భారతీయ సంప్రదాయాల సంరక్షణలో చేనేత కార్మికులు పోషిస్తున్న పాత్ర అమూల్యమైనదని ఆమె కొనియాడారు. ఆలయాల్లో చేనేత వస్త్రాల వినియోగాన్ని ప్రోత్సహించడం ద్వారా సంప్రదాయ పరిరక్షణతో పాటు చేనేత కార్మికుల జీవనోపాధికి ఊతం లభిస్తుందని అన్నారు. ఈ అంశాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, సాధ్యాసాధ్యాలను పరిశీలించి చేనేత రంగానికి మద్దతుగా తగిన చర్యలు చేపడతామని గజం అంజయ్యకు హామీ ఇచ్చారు. చేనేత రంగ పురోగతికి, చేనేత కార్మికుల సంక్షేమానికి సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు.

# భావితరాల ఆకాంక్షలకు...

(మొదటి పేజీ తరువాయి)

ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్(ఎఫ్ టీసీసీఐ) ఆధ్వర్యంలో మంగళవారం జూబ్లీహిల్స్ లోని జేఆర్సీ కన్వెన్షన్ సెంటర్ లో నిర్వహించిన 'ఎఫ్ టీసీసీఐ ఎక్స్ లెన్స్ అవార్డ్స్ 2026' ప్రదానోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... ఐటీ, లైఫ్ సైన్సెస్ నుంచి మ్యానుఫ్యాక్చరింగ్, డీప్-టెక్ వరకు తెలంగాణను దేశంలోనే అత్యంత ఆకర్షణీయమైన వృద్ధి కేంద్రంగా తీర్చిదిద్దేందుకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. పరిశ్రమ 4.0 విప్లవంలో భాగంగా దూసుకొస్తున్న ఆటోమేషన్, డీప్-టెక్ సవాళ్లను ఎదుర్కొనేలా రాష్ట్రంలో కాంప్రహెన్సివ్ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేస్తున్నామన్నారు. అదే సమయంలో... భవిష్యత్తు తరాలకు మేలు జరిగేలా స్థిరమైన, పర్యావరణహిత పారిశ్రామిక వృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో పారిశ్రామికాభివృద్ధి అనేది కేవలం భూమి, మూలధనంపైనే కాకుండా... మేధో సంపత్తి, నాలెడ్జ్ ఎకానమీ ఆధారంగానే సాధ్యమవుతుందన్నారు. అందుకు... పరిశ్రమల అవసరాలకు, విద్యాసంస్థల శిక్షణకు మధ్య ఉన్న స్కిల్ గ్యాప్ ను పూడ్చాల్సిన అవసరముందన్నారు. ఆ దిశగానే రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణను స్కిల్ క్యాపిటల్ గా మార్చాలనే సంకల్పంతో 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ'కి శ్రీకారం చుట్టిందన్నారు. రాష్ట్రానికి కొత్త పెట్టుబడులను తీసుకొచ్చి... ఇక్కడి యువతకు ఉపాధి అవకాశాలను కల్పించాలనే లక్ష్యంతోనే ముందుకెళ్తున్నామన్నారు. పారిశ్రామికాభివృద్ధిని కేవలం హైదరాబాద్ కే పరిమితం చేయకుండా... రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు విస్తరిస్తున్నామన్నారు. రాష్ట్రంలోని ఎంఎస్ఎంఈలను మరింత ప్రోత్సహించేందుకు దేశంలోనే తొలిసారిగా ప్రత్యేక 'ఎంఎస్ఎంఈ పాలసీ'ని తీసుకొచ్చామన్నారు. పారిశ్రామికవేత్తలకు 2017 నుంచి చెల్లించాల్సిన పెండింగ్ సబ్సిడీలను దశలవారీగా చెల్లిస్తున్నామన్నారు. అన్ని వర్గాల అభిప్రాయాలను పరిగణలోనికి తీసుకునే కనీస వేతనాలను నిర్ణయించామన్నారు. పారిశ్రామికవేత్తలను మేం కేవలం పెట్టుబడిదారులుగా మాత్రమే చూడటం లేదని... రాష్ట్ర ప్రగతిలో కీలక భాగస్వాములుగా భావిస్తున్నామన్నారు. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి పారిశ్రామికవేత్తలిచ్చే సలహాలు, సూచనలను స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. సరికొత్త ఆవిష్కరణలతో ముందుకొచ్చే పారిశ్రామికవేత్తలు, ఆవిష్కర్తలకు అన్ని రకాలుగా అండగా ఉంటామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో ఎఫ్ టీసీసీఐ ప్రతినిధులు రవి కుమార్, కేకే మహేశ్వరీ, శ్రీనివాస్ గరిమెల్లా, భాస్కర్ రెడ్డి, అనిల్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమమే...

(మొదటి పేజీ తరువాయి)

- ప్రజలకు ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తున్నామని స్పష్టీకరణ

**హైదరాబాద్ వెలుతురు జూన్ 09:**

రాష్ట్రంలో రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. రైతులు తమ పంటను విక్రయించేందుకు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా కొనుగోలు కేంద్రాల ద్వారా విస్తృత ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. జనగామ జిల్లా పర్యటనలో భాగంగా పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన ఆయన అనంతరం జరిగిన సభలో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై వివరాలు వెల్లడించారు.

వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని భట్టి అన్నారు. రైతుల కష్టానికి తగిన ప్రతిఫలం అందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ సీజన్‌లో ఇప్పటివరకు 72 లక్షల టన్నుల ధాన్యాన్ని సేకరించినట్లు వెల్లడించారు. రైతులు విక్రయించిన ధాన్యానికి సంబంధించి రూ.14 వేల కోట్లను నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు.

ప్రకృతి వైపరీత్యాల కారణంగా తడిసిన ధాన్యాన్ని కూడా కనీస మద్దతు ధరకు కొనుగోలు చేసిన ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమేనని భట్టి పేర్కొన్నారు. రైతుల శ్రమ వృథా కాకుండా, వారికి నష్టం కలగకుండా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందన్నారు. రైతు ప్రయోజనాల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

ధాన్యం కొనుగోలు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం భారీ బాధ్యతను భుజాన వేసుకున్నప్పటికీ కేంద్రం నుంచి ఆశించిన స్థాయిలో సహకారం లభించడం లేదని భట్టి వ్యాఖ్యానించారు. రాష్ట్ర ప్రభుత్వం సేకరించిన ధాన్యాన్ని కేంద్రం పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా రైతులు పండించిన మొక్కజొన్నను కూడా కేంద్రం కొనుగోలు చేసి రైతులకు భరోసా కల్పించాలని కోరారు.

వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు ప్రభుత్వం భారీ మొత్తాలను వెచ్చిస్తోందని భట్టి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 30 లక్షల పంపుసెట్లకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని చెప్పారు. ఇందుకోసం డిస్కమ్‌లకు ఏటా రూ.14 వేల కోట్ల వరకు ప్రభుత్వం చెల్లిస్తోందని వెల్లడించారు. రైతులు సాగు పనుల్లో ఇబ్బందులు ఎదుర్కోకుండా నిరంతర విద్యుత్ సరఫరా అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

గృహ వినియోగదారులకు కూడా ప్రభుత్వం అండగా నిలుస్తోందని చెప్పారు. రాష్ట్రంలోని 53 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను అందిస్తున్నామని తెలిపారు. ఈ పథకం అమలుకు ఏటా రూ.5 వేల కోట్లకుపైగా ఖర్చు చేస్తున్నామని వెల్లడించారు. ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతోందన్నారు.

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తున్నామని భట్టి తెలిపారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, కార్మికులు సహా అన్ని వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

రైతుల ఆర్థిక సమస్యలను తగ్గించేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుందని భట్టి పేర్కొన్నారు. రైతు రుణమాఫీ కార్యక్రమం కింద రూ.22 వేల కోట్ల రుణాలను మాఫీ చేసినట్లు తెలిపారు. ఈ నిర్ణయం వల్ల లక్షలాది మంది రైతులకు ప్రత్యక్ష ప్రయోజనం కలిగిందని చెప్పారు. రైతులు అప్పుల భారంతో ఇబ్బంది పడకుండా చేయడమే ప్రభుత్వ ఉద్దేశమన్నారు.

దేవాదుల ప్రాజెక్టు పనులపై కూడా ఆయన స్పందించారు. గత ప్రభుత్వ హయాంలో ఈ ప్రాజెక్టు నిర్లక్ష్యానికి గురైందని ఆరోపించారు. తగిన నిధులు కేటాయించకపోవడంతో పనులు మందగించాయని అన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అవసరమైన నిధులు విడుదల చేయడంతో పనులు వేగంగా సాగుతున్నాయని తెలిపారు.

దేవాదుల ప్రాజెక్టు పూర్తయితే వేలాది ఎకరాలకు సాగునీరు అందుతుందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయాలని ప్రభుత్వం సంకల్పించిందన్నారు. తెలంగాణ అభివృద్ధి, రైతుల సంక్షేమం, సంక్షేమ పథకాల సమర్థ అమలే ప్రభుత్వ ప్రాధాన్య అంశాలని స్పష్టం చేశారు.

# ఇరాన్‌పై దాడులకు దిగితే...

(మొదటి పేజీ తరువాయి)

- దేశ రక్షణలో వెనకడుగు వేసేదే లేదని స్పష్టం చేసిన 'బీబీ'
- అమెరికా-ఇజ్రాయెల్ మధ్య బహిర్గతమవుతున్న వ్యూహాత్మక విభేదాలు

**అమెరికా వెలుతురు జూన్ 09:**

ప్రపంచవ్యాప్తంగా తీవ్ర ఆందోళన కలిగిస్తూ పశ్చిమాసియా (మిడిల్ ఈస్ట్) ప్రాంతంలో మళ్లీ భారీ ఎత్తున యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్న వేళ ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అత్యంత కీలకమైన హెచ్చరికలు చేశారు. ఇరాన్ దేశంపై ఇజ్రాయెల్ గనుక మరోసారి విస్తృత స్థాయి భారీ సైనిక దాడులకు పాల్పడితే.. భవిష్యత్తులో అంతర్జాతీయ వేదికపై ఇజ్రాయెల్ పూర్తిగా ఒంటరిగా మారిపోయే ప్రమాదం ఉందని ట్రంప్ గట్టిగా హెచ్చరించారు. ఈ విషయాన్ని స్వయంగా అధ్యక్షుడు ట్రంప్ అంతర్జాతీయ మీడియాతో పంచుకున్నారు. ఇరాన్‌తో కొనసాగుతున్న ఉద్రిక్తతలను మరింత పెంచకుండా సంయమనం పాటించాలని ఆయన సూచించారు.


ఇటీవలి కాలంలో ఇజ్రాయెల్ సైన్యం పొరుగు దేశమైన లెబనాన్‌లో స్థావరాలే లక్ష్యంగా చేసుకుని హెజ్‌బొల్లా ఉగ్రవాదులపై విరుచుకుపడింది. దీనికి తీవ్ర ప్రతీకారంగా ఇరాన్ దేశం ఇజ్రాయెల్ పై వందలాది క్లిష్టమైన క్షిపణి (మిసైల్) దాడులు జరపడంతో పశ్చిమాసియాలో పరిస్థితి ఒక్కసారిగా నియంత్రణ తప్పి అత్యంత ఉద్రిక్తంగా మారింది. ఇరు దేశాలు పరస్పరం దాడులు చేసుకుంటున్న తరుణంలో.. ఇరాన్‌పై మళ్లీ ప్రతీకార దాడులకు దిగొద్దంటూ నెతన్యాహును ట్రంప్ గట్టిగా కోరారు. "బీబీ (నెతన్యాహు ముద్దుపేరు) మీరు ఈ విషయంలో చాలా జాగ్రత్తగా వ్యవహరించాలి.. లేకపోతే త్వరలోనే ప్రపంచంలో ఒంటరిగా మిగిలిపోయే దుస్థితి వస్తుంది" అని తాను నెతన్యాహు ముఖం మీదే స్పష్టంగా చెప్పినట్లు ట్రంప్ మీడియాకు వివరించారు.

ప్రస్తుత తరుణంలో ఇరాన్‌పై మరింత దూకుడుగా వ్యవహరిస్తూ యుద్ధాన్ని విస్తరిస్తే.. ఇజ్రాయెల్ కు కాలపరీక్షలో అండగా నిలిచే మిగిలిన మిత్రదేశాల మద్దతు కూడా పూర్తిగా కోల్పోయే పరిస్థితి ఏర్పడవచ్చని ట్రంప్ స్పష్టం చేశారు. ఇప్పుడున్న అంతర్జాతీయ పరిస్థితుల్లో ఇంకా దౌత్యపరమైన చర్చలకు, శాంతి స్థాపనకు తగినన్ని అవకాశాలు ఉన్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఇలాంటి కీలక సమయంలో ఇరు దేశాలు భారీ సైనిక చర్యలకు దిగితే సమస్యలు పరిష్కారం కాకపోగా మరింత క్లిష్టంగా మారుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇరాన్‌తో అంతర్జాతీయంగా కొనసాగుతున్న అంతర్గత సంప్రదింపులు త్వరలోనే సానుకూల ఫలితాలను ఇవ్వవచ్చని ట్రంప్ ఈ సందర్భంగా ఆశాభావం వ్యక్తం చేశారు.

ఇరాన్ మరియు దాని అనుబంధ సంస్థల నుండి ఇజ్రాయెల్‌కు దేశ భద్రతాపరంగా తీవ్రమైన ఆందోళనలు, ముప్పు ఉన్నాయన్న నిఖార్సైన విషయాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అంగీకరించారు. అయితే, ఇరు దేశాల మధ్య ప్రతీకార చర్యలు గనుక హద్దులు దాటితే అది మూడో ప్రపంచ యుద్ధానికి దారితీసే ప్రమాదం ఉందని అమెరికా రక్షణ వర్గాలు భావిస్తున్నాయి. ఇరాన్ దాడులను తిప్పికొట్టే పూర్తి హక్కు ఇజ్రాయెల్‌కు ఉన్నప్పటికీ.. వాటి ప్రతిస్పందన అనేది చాలా పరిమితంగా ఉండాలని ట్రంప్ కోరుకుంటున్నారు. ఈ యుద్ధం ఇరాన్ అంతటా విస్తరించకుండా అడ్డుకోవడమే ప్రస్తుతం శ్వేతసౌధం (వైట్‌హౌస్) ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది.

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బహిరంగంగానే కొన్ని అభ్యంతరాలు వ్యక్తం చేసినప్పటికీ.. తమ దేశ రక్షణ కోసం ఇరాన్ పై కొన్ని పరిమిత సైనిక చర్యలు చేపట్టాలని ఇజ్రాయెల్ పట్టుదలతో నిర్ణయించింది. ఇందులో భాగంగానే ఇటీవల ఇరాన్‌లోని కొన్ని వ్యూహాత్మక సైనిక లక్ష్యాలపై ఇజ్రాయెల్ వాయుసేన దాడులు జరపగా.. దానికి ప్రతిగా టెహ్రాన్ (ఇరాన్ రాజధాని) సైన్యం మరోసారి ఇజ్రాయెల్ పైకి క్షిపణులను ప్రయోగించింది. ఈ పరస్పర దాడుల్లో అమెరికా సైన్యం నేరుగా పాల్గొనకపోయినప్పటికీ.. ఇజ్రాయెల్‌పైకి దూసుకొచ్చిన ఇరాన్ క్షిపణులను రాడార్ల ద్వారా ముందుగానే గుర్తించడంలో, వాటిని గాల్లోనే కూల్చివేసి అడ్డుకోవడంలో అమెరికాకు చెందిన అత్యాధునిక రక్షణ వ్యవస్థలు ఇజ్రాయెల్ కు పూర్తి స్థాయిలో సహకరించినట్లు అంతర్జాతీయ రక్షణ వర్గాలు వెల్లడించాయి.

పశ్చిమాసియాలో తాజా దాడుల వల్ల శాంతిభద్రతల పరిస్థితి మరింత దిగజారుతుందనే తీవ్ర ఆందోళనతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మళ్లీ అత్యవసరంగా నెతన్యాహుతో ఫోన్ లో మాట్లాడినట్లు విశ్వసనీయ సమాచారం. ఇరాన్‌పై ఇకపైనా ఎలాంటి విస్తృత స్థాయి భారీ దాడులు చేయవద్దని, ఇక్కడితో సైనిక చర్యలను విరమించుకోవాలని ఆయన గట్టిగా కోరినట్లు తెలుస్తోంది. అమెరికా ఒత్తిడి నేపథ్యంలో ఇజ్రాయెల్ కూడా కొంత సానుకూలంగా స్పందించింది. ఒకవేళ ఇరాన్ కూడా ఇక్కడితో తమ దేశంపై దాడులను పూర్తిగా నిలిపివేస్తే.. తాము కూడా రాబోయే రోజుల్లో అదనంగా ఎలాంటి సైనిక చర్యలకు లేదా దాడులకు దిగబోమనే సానుకూల వైఖరిని



నెతన్యాహు వ్యక్తం చేసినట్లు ఇజ్రాయెల్ రక్షణ శాఖ ఉన్నతాధికారులు పేర్కొంటున్నారు.

మరోవైపు, ఇజ్రాయెల్ దేశ ప్రజలను ఉద్దేశించి ప్రధాని బెంజమిన్ నెతన్యాహు టెలివిజన్ వేదికగా ఒక కీలక ప్రసంగం చేశారు. ఇరాన్ దేశం నుండి తమకు ఎదురవుతున్న ప్రమాదకరమైన 'అణు ముప్పును' ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్ (ఐడీఎఫ్) సమర్థంగా అడ్డుకుందని ఆయన సగర్వంగా ప్రకటించారు. గత ఏడాది కాలంగా తాము సాగిస్తున్న నిరంతర సైనిక చర్యల ద్వారా ఇరాన్ తో పాటు లెబనాన్ లోని హెజ్‌బొల్లా ఉగ్రవాద సంస్థల ఆర్థిక, సైనిక సామర్థ్యాలను కోలుకోలేని విధంగా దెబ్బతీశామని స్పష్టం చేశారు. ఇరాన్ ఎట్టి పరిస్థితుల్లోనూ అణ్వాయుధాలను సంపాదించకుండా నిరోధించడమే ఇజ్రాయెల్ ప్రథమ కర్తవ్యమని, ఆ విషయంలో తాము అంతర్జాతీయంగా ఎవరితోనూ, ఎలాంటి రాజీ పడే ప్రసక్తే లేదని నెతన్యాహు తేల్చి చెప్పారు.

ఉత్తర ఇజ్రాయెల్ సరిహద్దు ప్రాంతాలపై భారీ ఎత్తున దాడులు చేసేందుకు హెజ్‌బొల్లా ఉగ్రవాద సంస్థ భయంకరమైన ప్రణాళికలు రచించిందని నెతన్యాహు ఆరోపించారు. వేలాది మంది ఆయుధ సంపన్న మిలిటెంట్లతో ఇజ్రాయెల్ భూభాగంలోకి చొరబడి దాడులు చేపట్టేందుకు ప్రయత్నించారని, అయితే ఆ కుట్రలన్నింటినీ ఇజ్రాయెల్ గూఢచార సంస్థలు, సైన్యం ముందుగానే భగ్నం చేశాయని పేర్కొన్నారు. హెజ్‌బొల్లా కీలక నాయకత్వాన్ని పూర్తిగా నిర్వీర్యం చేయడంతో పాటు దాని సైనిక మౌలిక సదుపాయాలను, దక్షిణ లెబనాన్‌లోని భూగర్భ టన్నెల్ నెట్‌వర్క్‌లను లక్ష్యంగా చేసుకుని తమ చర్యలు కొనసాగుతాయని చెప్పారు. ప్రస్తుత పరిణామాలను గమనిస్తే ఇరాన్ అంశంలో మిత్రదేశాలైన అమెరికా, ఇజ్రాయెల్‌ల మధ్య తీవ్ర వ్యూహాత్మక విభేదాలు ఉన్నట్లు స్పష్టమవుతోంది. ట్రంప్ దౌత్య చర్చల ద్వారా పరిష్కారం సాధ్యమని నమ్ముతుండగా.. నెతన్యాహు మాత్రం కఠిన సైనిక చర్యల ద్వారానే ఇజ్రాయెల్ భద్రత సాధ్యమని వాదిస్తుండటం అంతర్జాతీయ రాజకీయాల్లో పెద్ద హాట్ టాపిక్ గా మారింది.

# 30 రోజుల్లో నిజాంపేట డంపింగ్ యార్డ్ తరలింపు

- విద్యార్థులు, స్థానిక ప్రజల ఆరోగ్యానికి ముప్పుగా మారిన సమస్యకు శాశ్వత పరిష్కారం
- రూ.20 కోట్లతో ఎస్సీ హాస్టల్ నిర్మాణం.. అసాంఘిక శక్తుల ఆటకట్టింపుకు ప్రత్యేక చర్యలు
- సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**బాచుపల్లి, వెలుతురు జూన్ 9 :**

వేలాది మంది డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారులు, స్థానిక కాలనీవాసులు, భవిష్యత్తులో ఇక్కడ విద్యనభ్యసించనున్న గురుకుల విద్యార్థులకు ఇబ్బందిగా మారిన నిజాంపేట డంపింగ్ యార్డును 30 రోజుల్లోగా తరలిస్తామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు. మంగళవారం బాచుపల్లిలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ డిగ్రీ కళాశాల నూతన భవన ప్రాంగణం సమీపంలోని డంపింగ్ యార్డును జిల్లా కలెక్టర్ ఎం. మను చౌదరితో కలిసి పరిశీలించిన అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు.

డంపింగ్ యార్డు కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు ప్రత్యక్షంగా తెలుసుకున్నామని, ఈ ప్రాంతంలో కొన్ని నిమిషాలు కూడా నిలబడలేని పరిస్థితి ఉందని అన్నారు. ప్రజల ఆరోగ్యం, విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా డంపింగ్ యార్డు తరలింపు అత్యవసరమైందని మంత్రి అడ్లూరి పేర్కొన్నారు.

ఈ ప్రాంతంలో రూ.20 కోట్ల వ్యయంతో షెడ్యూల్డ్ కులాల విద్యార్థుల కోసం ఆధునిక హాస్టల్ నిర్మిస్తున్నామని తెలిపారు. త్వరలో గురుకుల విద్యార్థులు ఇక్కడికి రానున్న నేపథ్యంలో పరిశుభ్రమైన, సురక్షితమైన వాతావరణం కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు.

కాలనీవాసులు తమ సమస్యలను వివరించగా బాధ కలిగిందని, గతంలో చిన్నారిపై కుక్కల దాడి జరిగిన ఘటన ఎంతో విషాదకరమని పేర్కొన్నారు. డంపింగ్ యార్డు పరిసరాలు అసాంఘిక శక్తులకు అడ్డాగా మారుతున్నాయన్న ప్రజల ఆందోళనలను ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందన్నారు.

డీసీపీతో మాట్లాడి ప్రత్యేక పెట్రోలింగ్ వాహనం ఏర్పాటు చేయాలని సూచిస్తానని, అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు శాఖను ఆదేశిస్తామని తెలిపారు. భవిష్యత్తులో ఈ ప్రాంత ప్రజలకు ఎలాంటి సమస్య వచ్చినా పరిష్కరించేందుకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

గతంలో డంపింగ్ యార్డు తరలింపుపై కలెక్టర్‌కు పలు ఫిర్యాదులు అందాయని, ప్రత్యేక కార్పొరేషన్ల ఏర్పాటు ప్రక్రియ కారణంగా కొంత ఆలస్యమైందని చెప్పారు. అయితే ప్రస్తుతం అన్ని శాఖల సమన్వయంతో వేగంగా చర్యలు చేపట్టి నెల రోజుల్లో సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని వెల్లడించారు.

"గురుకుల విద్యార్థుల సంక్షేమం, ప్రజల ఆరోగ్యం, పరిశుభ్రమైన పరిసరాలే ప్రభుత్వ ప్రాధాన్యత" అని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పునరుద్ఘాటించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎం. మను చౌదరి మాట్లాడుతూ....సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ విద్యాసంస్థ భవన నిర్మాణం పూర్తయిందని, అయితే డంపింగ్ యార్డు ముందునుంచే ఉండటంతో విద్యార్థులు, స్థానికులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు ప్రత్యామ్నాయ స్థలాన్ని గుర్తించామని, కార్పొరేషన్ అధికారులతో సమన్వయం చేసి డంపింగ్ యార్డును త్వరితగతిన తరలిస్తామని చెప్పారు.

# సూర్యఘర్ యోజనతో ఉచిత విద్యుత్‌తో పాటు అదనపు ఆదాయం

## అర్హులందరూ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి: మంత్రి జూపల్లి కృష్ణారావు



**కొల్లాపూర్, వెలుతురు జూన్ 9:**

ప్రధాన మంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన ద్వారా గ్రామీణ కుటుంబాలు విద్యుత్ వ్యయాన్ని తగ్గించుకోవడంతో పాటు అదనపు ఆదాయం పొందే అవకాశం ఉందని పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. కొల్లాపూర్ నియోజకవర్గంలోని పెద్ద ధగడ గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో ఆయన పాల్గొని పథకం ప్రయోజనాలను గ్రామస్తులకు వివరించారు.<ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామంలో ఉన్న 630 కుటుంబాల్లో 469 కుటుంబాలను ఈ పథకానికి అర్హులుగా గుర్తించినట్లు తెలిపారు. అర్హులైన కుటుంబాలు సౌర విద్యుత్ వ్యవస్థలను ఏర్పాటు చేసుకుని ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ ప్రయోజనాలను పొందాలని సూచించారు.

సౌర విద్యుత్ ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను గృహ అవసరాలకు వినియోగించుకోవడంతో పాటు, మిగులు విద్యుత్‌ను విద్యుత్ సంస్థలకు విక్రయించి అదనపు ఆదాయం పొందవచ్చని మంత్రి తెలిపారు. ఒక్కో యూనిట్‌కు సుమారు రూ.2.50 చొప్పున చెల్లింపులు అందే అవకాశం ఉందని వివరించారు.

పర్యావరణ పరిరక్షణతో పాటు కుటుంబాల ఆర్థిక భారం తగ్గించడంలో ఈ పథకం కీలకంగా మారుతుందని మంత్రి పేర్కొన్నారు. గ్రామస్థులు ఈ అవకాశాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకుని స్వయం విద్యుత్ ఉత్పత్తిదారులుగా మారాలని ఆయన పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో రెడ్కో డీజీఎం భాస్కర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ భాస్కర్, విద్యుత్ శాఖ, ఇతర అధికారులు, ప్రాజప్రతినిధులు పాల్గొన్నారు.

# మొహర్రం ఊరేగింపునకు విస్తృత ఏర్పాట్లు:

## రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, వెలుతురు జూన్ 09:**

ఈనెల 16న జరగనున్న మొహర్రం ఉరేగింపు కార్యక్రమాలకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తుందని రాష్ట్ర రవాణా, బి.సి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మొహర్రం పవిత్ర మాసం ఏర్పాట్లపై మంగళవారం డా.బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్, ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ తో కలిసి వివిధ శాఖల అధికారులు, ముస్లిం మత పెద్దలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. మొహర్రం కార్యక్రమాలు నిర్వహించే ఆశుర్ ఖానాల వద్ద పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేయాలని అన్నారు. ఆశుర్ ఖానాల పరిసర ప్రాంతాలలో పెండింగ్ లో ఉన్న డ్రైనేజ్, రోడ్లు మరమ్మత్తు పనులను వెంటనే పూర్తి చేయాలని, అన్ని చోట్ల హైమాస్ట్ లైట్లను ఏర్పాట్లు చేయాలని మంత్రి ఆదేశించారు. విద్యుత్ శాఖ అధికారులు ప్రత్యేక విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలని, వాటర్ బోర్డ్ అధికారులు తాగు నీటి సరఫరా చేయాలని, జి.హెచ్.ఎం.సి అధికారులు పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించాలని అన్నారు. మొబైల్ టాయిలెట్స్ తదితర మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆర్ అండ్ బి అధికారులు బారికేడింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

మొహర్రం ఊరేగింపు సందర్భంగా ట్రాఫిక్ కు అంతరాయం కలగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని పోలీస్ ఉన్నతాధికారులను ఆదేశించారు. ప్రధాన ఊరేగింపు ప్రారంభం కానున్న బీబీ–కా–ఆలం పరిసరాల ప్రాంతంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు.ఆశుర్ ఖానాలకు వచ్చే వారికి ఇబ్బందులు కలగకుండా అన్ని మౌలిక వసతులు కల్పించాలని ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ సూచించారు. వైద్య శిబిరాలు, అంబులెన్స్ లను కూడా అందుబాటులో ఉంచాలని అన్నారు. ఈ సమావేశంలో రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, మైనారిటీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూషన్ సొసైటీ వైస్ ఛైర్మన్ ఫహీం కురేషీ, చార్మినార్, బహదూర్‌పురా, యాకత్ పురా, నాంపల్లి, కార్వాన్, మల్కాజిగిరి ఎమ్మెల్యేలు, మీర్ జుల్ఫెకర్ అలీ, మహమ్మద్ ముబీన్, జాఫర్ హుస్సేన్, మాజిద్ హుస్సేన్, కౌసర్ మొహియుద్దీన్, మర్రి రాజశేఖర్ రెడ్డి, ఎమ్మెల్సీలు మీర్జా రియాజ్ ఉల్ హసన్ ఎఫెండి, మీర్జా రహ్మత్ బేగ్, వక్ఫ్ బోర్డు ఛైర్మన్, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ ఒబైదుల్లా కొత్వాల్, హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్(HMWSSB) ఎండీ అశోక్ రెడ్డి, మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి షఫీఉల్లా, వక్ఫ్ బోర్డు CEO తదితరులు పాల్గొన్నారు.



# స్టీల్ ప్లాంట్ బాధితులకు అండగా ప్రభుత్వం

- మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల పరిహారం ప్రకటించిన పవన్ కల్యాణ్*
- కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పిస్తామని హామీ
- క్షతగాత్రులకు రూ.10 లక్షల చొప్పన ఆర్థిక సాయం
- ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించిన డిప్యూటీ సీఎం



**విశాఖపట్నం వెలుతురు జూన్ 09:**

స్టీల్ ప్లాంట్‌లో చోటుచేసుకున్న ఘోర ప్రమాదంలో ఎనిమిది మంది కార్మికులు మృతి చెందడం అత్యంత బాధాకరమని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. ఈ దుర్ఘటనలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున పరిహారం అందించడంతో పాటు కుటుంబంలోని ఒకరికి ఉద్యోగం కల్పిస్తామని పవన్ కల్యాణ్ ప్రకటించారు. ప్రమాదంలో గాయపడిన వారికి రూ.10 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందజేస్తామని తెలిపారు. బాధిత కుటుంబాలు ప్రస్తుతం ఎదుర్కొంటున్న కష్టాలను ప్రభుత్వం అర్థం చేసుకుంటోందని, వారికి అన్ని విధాలా తోడుగా నిలుస్తామని భరోసా ఇచ్చారు.

ఈ సందర్భంగా ప్రమాద ఘటనపై సమగ్ర విచారణ జరిపిస్తామని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. ప్రమాదం ఎలా జరిగింది, భద్రతా ప్రమాణాల అమలులో ఎలాంటి లోపాలు చోటుచేసుకున్నాయి, యాజమాన్యం తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏమిటి అనే అంశాలపై ప్రత్యేక కమిటీ దర్యాప్తు నిర్వహిస్తుందని తెలిపారు. కమిటీ నివేదిక వచ్చిన తర్వాత బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు అవసరమైన నిర్ణయాలు తీసుకుంటామని చెప్పారు.

ప్రమాదానికి సంబంధించి ఒకే కోణంలో కాకుండా అన్ని కోణాల్లో విచారణ జరగాలని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. పూర్తి వివరాలు సేకరించిన తర్వాతే నిజానిజాలు వెలుగులోకి వస్తాయని అన్నారు. పరిశ్రమల్లో కార్మికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని, భద్రతా చర్యల్లో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని స్పష్టం చేశారు.

ఇలాంటి దుర్ఘటనలు జరిగినప్పుడు కేవలం బాధ వ్యక్తం చేయడం సరిపోదని, భవిష్యత్‌లో మళ్లీ పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవడం ముఖ్యమని ఆయన అన్నారు. ప్రమాదాల నివారణకు అవసరమైన భద్రతా ప్రమాణాలు, అత్యవసర చర్యల వ్యవస్థలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

స్టీల్ ప్లాంట్ యాజమాన్యం అమలు చేస్తున్న భద్రతా విధానాలపై కూడా సమీక్ష నిర్వహిస్తామని పవన్ కల్యాణ్ వెల్లడించారు. కార్మికుల ప్రాణాలకు సంబంధించిన అంశాల్లో రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ప్రమాదం జరిగిన పరిస్థితులు, యంత్రాల నిర్వహణ, భద్రతా పరికరాల వినియోగం తదితర అంశాలను అధికారులు పరిశీలిస్తారని తెలిపారు.

స్టీల్ ప్లాంట్ భవిష్యత్తుపై కూడా ఉప ముఖ్యమంత్రి స్పష్టత ఇచ్చారు. ప్లాంట్ ప్రైవేటీకరణ జరగకూడదనేది ప్రభుత్వ ప్రధాన సంకల్పమని చెప్పారు. ప్రభుత్వ రంగ సంస్థగా స్టీల్ ప్లాంట్ కొనసాగాలనేది ప్రజల ఆకాంక్ష అని, ఆ భావనకు అనుగుణంగానే ప్రభుత్వం వ్యవహరిస్తుందని పేర్కొన్నారు.

స్టీల్ ప్లాంట్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని పవన్ కల్యాణ్ తెలిపారు. కార్మిక సంఘాల ప్రతినిధులు, ఉద్యోగులతో సమావేశం నిర్వహించి వారి సమస్యలను నేరుగా తెలుసుకుంటామని చెప్పారు. వేతనాలు, భద్రత, ఉద్యోగ భరోసా, సంక్షేమ కార్యక్రమాలు తదితర అంశాలపై చర్చించి తగిన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

ఈ ప్రమాదం రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర విషాదాన్ని నింపిందని, బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని పవన్ కల్యాణ్ మరోసారి స్పష్టం చేశారు. కార్మికుల భద్రతే ప్రభుత్వ ప్రాధాన్యమని, ఇటువంటి ఘటనలు మళ్లీ జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# సంక్షేమ పథకాల పురోగతిపై సమీక్ష




**భువనగిరి జూన్, 9 (వెలుతురు న్యూస్):**

జిల్లాలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాల పురోగతిని సమగ్రంగా సమీక్షించారు. ప్రధానంగా గ్రామీణాభివృద్ధి, తాగునీటి సరఫరా, గృహ నిర్మాణం, ఉపాధి హామీ పథకం, రోడ్లు, విద్య, ఆరోగ్య రంగాలకు సంబంధించిన పనులపై అధికారులతో విస్తృతంగా చర్చించారు.పనులు ఆలస్యం కాకుండా వేగవంతం చేయాలని, అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ పథకాలు సమయానికి చేరేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. అలాగే, నిధుల వినియోగంలో పారదర్శకత, సమన్వయం మరియు ఫీల్డ్ లెవెల్ అమలుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు.ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని వాటికి తక్షణ పరిష్కారాలు అందించేందుకు ఇలాంటి సమీక్షా సమావేశాలు కీలకమని ఆయన పేర్కొన్నారు. భువనగిరి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు అన్ని శాఖలు కలిసి పనిచేయాలని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు.

# ప్రజా నమ్మకమే...

(మొదటి పేజీ తరువాయి)

సోమవారంతో ఆఖరి విభాగం పూర్తయిందని, ఈ కార్యక్రమాల ద్వారా దాదాపు 25వేల మంది ప్రజలను తాను వ్యక్తిగతంగా కలిసి, వారి సమస్యలను స్వయంగా కళ్లారా చూసి, చెవులారా విన్నానని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రజా దర్బార్‌లో పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుండి మొత్తం 24వేల పైచిలుకు దరఖాస్తులు వచ్చాయన్నారు. అందులో అత్యధికంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం 11,000 అర్జీలు, ఆసరా పింఛన్ల కోసం 5,200 అర్జీలు అందినట్లు వివరించారు. అలాగే గృహజ్యోతి పథకం దరఖాస్తులతో పాటు అంతర్గత రహదారులు, మురుగు కాలువలు, తాగునీరు వంటి స్థానిక సమస్యలపై కూడా ప్రజలు పెద్ద ఎత్తున వినతులు సమర్పించారని చెప్పారు.

**భూ భారతి చట్టంతో సాదాబైనామాల సమస్యకు శాశ్వత పరిష్కారం**

గత ప్రభుత్వం ధరణి చట్టం తెచ్చే ముందు సాదాబైనామాల అప్‌లోడ్‌కు అవకాశం ఇచ్చి, ఆ తర్వాత చట్టంలో చేర్చకుండా రైతులను గాలికి వదిలేసిందని మంత్రి మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న 9,26,000 సాదాబైనామా దరఖాస్తుల సమస్యను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని మంత్రి మండలి నిబంధనలను సవరించిందని తెలిపారు. గతంలో భూమి అమ్మిన వారి సమ్మతి కూడా కావాలనే నిబంధన ఉండేదని, కానీ రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, అమ్మిన వారి సమ్మతి అవసరం లేకుండా నిబంధనలు మార్చామన్నారు. ఇప్పటికే ఐదున్నర లక్షల దరఖాస్తులను గుర్తించి నోటీసులు ఇచ్చామని, మిగిలిన వాటికి మరో 15 రోజుల్లో నోటీసుల ప్రక్రియ పూర్తవుతుందని, చట్టప్రకారం 30 రోజుల నోటీసు గడువు తర్వాత అర్హులైన అన్ని సాదాబైనామాలను పరిష్కరిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు.

**ఆధునిక డిజిటల్ సర్వే.. సాగులో ఉన్న వారికే భూమి పట్టాలు**

తరతరాలుగా భూమి సాగులో ఉన్నా పట్టా పుస్తకాలు రావట్లేదని ఆవేదన చెందుతున్న రైతుల కోసం రాష్ట్రవ్యాప్తంగా మొదటి విడతగా ప్రతి జిల్లాలో 70 రెవెన్యూ గ్రామాలను ఎంపిక చేసి ఆధునిక భూ సర్వే నిర్వహిస్తున్నట్లు మంత్రి తెలిపారు. పాలేరు నియోజకవర్గంలోని తిరుమలాయపాలెం (కాకరవాయి) గ్రామంలో ఇప్పటికే ఈ సర్వే విజయవంతంగా పూర్తయిందన్నారు. క్షేత్రస్థాయిలో సాగులో ఉన్న వారికే పట్టా పుస్తకాలు ఇస్తూ, లేని వారివి రద్దు చేసే చట్టాన్ని తెచ్చామని, ప్రజా దర్బార్‌లో వచ్చిన 4,300 భూ సమస్యల దరఖాస్తుల్లో దాదాపు 2,300 అప్లికేషన్లను ప్రత్యేక కార్యాచరణ ద్వారా త్వరలోనే పరిష్కరించబోతున్నామని స్పష్టం చేశారు. అలాగే ప్రభుత్వ అవసరాల కోసం కొంత భూమి సేకరిస్తే ఆ సర్వే నెంబర్ మొత్తం నిషేధిత జాబితాలో పెట్టే పాత విధానాన్ని సవరించి, పట్టా భూములను ఆ నిషేధిత జాబితా నుంచి తొలగించే ప్రక్రియను దాదాపు పూర్తి చేశామన్నారు.

**నిర్ణీత కాలపరిమితిలోగా గృహాలు, ఇళ్ల స్థలాల కేటాయింపు**

ప్రజా దర్బార్‌లో వచ్చిన అర్జీలను పరిష్కరించడానికి అధికారుల యంత్రాంగాన్ని విభజించి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కనీసం 45 రోజుల సమయం పడుతుందన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి అర్హులైన వారి దరఖాస్తులను విడతలవారీగా అందజేస్తామని, అలాగే ఇళ్ల స్థలాల కోసం 1,500 మంది దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. గతంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఇళ్ల స్థలాల కోసం సేకరించిన భూములను గుర్తించాలని అధికారులను ఆదేశించామని, ఎక్కడైతే నివాసానికి యోగ్యమైన ప్రభుత్వ స్థలాలు ఉన్నాయో వాటిని సేకరించి రాబోయే కొద్ది రోజుల్లో ఇళ్ల స్థలాల సమస్యను కూడా పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు.

**ప్రతిపక్షాల బురదజల్లే రాజకీయాలను తిప్పికొట్టిన ఓటర్లు**

కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ ప్రజాప్రతినిధులు, పదేళ్లు దొరపాలన సాగించిన మాజీ మంత్రులు రాజకీయ దురుద్దేశంతో, స్వలాభం కోసం ప్రభుత్వంపై బురదజల్లుతున్నారని, వారి మాటల్లో ఎలాంటి నిజం లేదని మంత్రి కొట్టిపారేశారు.

# సాంఘిక విప్లవజ్యోతి మాజీమంత్రి మహేంద్రనాథ్ శతజయంతి సందర్భంగా

ఆయన ఒక వ్యక్తి కాదు శక్తి , నీతి, నిజాయితీ ఆయనకు పెట్టింది పేరు, దళిత చైతన్యశీలి, సాంఘిక విప్లవజ్యోతి, యుగపురుషుడు, గాంధీజీ ఆశయాలను, అంబేద్కర్ ఆలోచన విధానాన్ని గుండెకు హత్తుకున్న మహోన్నత వ్యక్తి, మాజీమంత్రి పుట్టపాగ మహేంద్రనాథ్. ఇంతటి గొప్ప వ్యక్తి జన్మించి 100 ఏళ్ళు కావస్తున్న సందర్భంగా ఆయన శతజయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకోవాలి. ఆయన జీవిత విశేషాలను కూడా ప్రజలందరూ కూడా తెలుసుకోని స్మరించుకోవాలి.

తెలంగాణలోని ఒకనాటి మహబూబ్ నగర్ జిల్లా నేటి నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ తాలూకాలోని జొన్నల బొగుడ గ్రామంలో 10 జూన్

**1926లో బాలమ్మ మరియు మశన్న అనే పుణ్య దంపతులకు జన్మించారు.**

బాల్యంలో మహేంద్రనాథ్ గారి తండ్రి మశన్న చదువు రాదని బాధపడేవారు. తాను బాగా చదువుకొని తండ్రి బాధ్యతలు సరిగ్గా నిర్వహించాలని మహేంద్రనాథ్ లో విద్యాబీజం పడింది. జొన్నలబొగుడ గ్రామంలో పాఠశాల లేనందున తన మేనమామ ఊరు కోడేరులో ప్రాథమిక విద్యను పూర్తి చేశారు. పట్వారి చిక్కపల్లి రామచంద్రరావు గారి ప్రోత్సాహంతో ఉన్నత విద్యకు హైదరాబాద్ వెళ్లి ఆది హిందూ సమాజ్ సేవ హాస్టల్లో చేరి అఫ్షపుల్ మదరాసి అనే వస్తానియాల్ మిడిల్ పూర్తి చేసి ఆ పిమ్మట బైతుల్ ఉల్మా అనే పాఠశాలలో చేరి మెట్రిక్యులేషన్ పూర్తి చేశారు. అదే హాస్టల్లో విద్యార్థి సంఘానికి కార్యదర్శిగా మరియు అధ్యక్షునిగా ఉన్నారు. మెట్రిక్యులేషన్ తర్వాత హైకోర్టు వారు నడిపే లా క్లాసులో డిప్లొమా పూర్తి చేశారు. ఆ తర్వాత వకీలుగా లా ప్రాక్టీస్ చేస్తూ నాగర్ కర్నూల్ లో స్థిరపడ్డారు. న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తూ ఎంతోమంది భూమిలేని నిరుపేదలకు ప్రభుత్వ భూములను పట్టాలిప్పించి, రక్షిత కౌలుదారులకు భూయాజమాన్య పట్టాలు ఇప్పించారు.

ఇంతింతై వటుడింతై అన్న చందంగా ఆయన జీవితం ఉన్నత శిఖరాలకు ఎదిగింది. నాగర్ కర్నూల్ పట్టణంలో ప్రముఖ న్యాయవాది పాపయ్య పార్సతో కలిసి నేషనల్ హై స్కూల్, నేషనల్ ఐటిఐను ఏర్పాటు చేశారు. అదే కాకుండా 1949 ప్రాంతంలో పేద విద్యార్థుల కోసం హాస్టల్ను కూడా ఏర్పాటు చేశారు. వెనుకబడిన నాగర్ కర్నూల్ ప్రాంతంలో విద్యావ్యాప్తి కోసం అహర్నిశలు కృషి చేశారు.

తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ భాషల్లో ప్రావీణ్యమున్న మహేంద్రనాథ్ ఆయన పాఠశాలలోని విద్యార్థులకు, అధ్యాపకులకు సమయాన్ని ఇస్తూనే ప్రజలకు కూడా పూర్తి సమయాన్ని కేటాయించేవారు.

తాను అనుకున్నది సాధించాలనే మనస్తత్వం ఉన్న మనిషి. అందుకే ఆయన ఏ రంగాన్ని ఎంచుకున్న అందులో చిత్తశుద్ధిగా నిజాయితీగా, నిబద్ధతగా పనిచేసిన వ్యక్తిగా చరిత్రలో నిలిచిపోయారు.

మహేంద్రనాథ్ గారు చదువుకునే సమయంలో కులవివక్ష, అంటరానితనం ఎక్కువగా ఉన్న ఆ సమయంలో ఆయన దీనికి వ్యతిరేకంగా అనాడే పోరాటం చేశారు. నాగర్ కర్నూల్ ప్రాంతంలో దళితులందరిని సాంఘిక విప్లవంలో చైతన్యం చేసి వారిని చదువు వైపుకు మళ్ళించారు. ఆయన ఉపన్యాసాలు విని ఆయన ఆదర్శాలను, ఆశయాలను ముందుకు తీసుకుపోవడంలో అన్ని కులాల వారు ముందున్నారంటే అతియోశక్తి కాదు. మహేంద్రనాథ్ పట్ల ఈ ప్రాంతంలో అందరికీ ప్రేమాభిమానాలు ఎక్కువే.

నల్లగొంగళ్ళు, ఎర్ర రుమాలలతో వచ్చిన పేదలపై ఆయన అమితంగా ప్రేమ చూపేవాడు. ఆయనకు రికమండేషన్ అంటే నచ్చవు. ఏ వ్యక్తి అయినా స్వయంగా వచ్చి తన సమస్యను దరఖాస్తు పూర్వకంగా ఇస్తే దానిని సంబంధిత అధికారులకు పంపి,ఆ పని జరిగే విధంగా చూసేవారు. ఆయన ఈ ప్రాంతంలోని అన్ని వర్గాల ప్రజలతోపాటు అన్ని రాజకీయ పార్టీలతో కూడా మంచి సంబంధాలు కలిగి ఉండి ఆయన పట్ల రాజకీయాలకు అతీతంగా ప్రేమను చూపేవారు.

కాసు బ్రహ్మానందరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో తనకు మంత్రి పదవి వచ్చే అవకాశం ఉన్న తాను ఒక మహిళకు ఇప్పించాలని సదాలక్ష్మీగారి పేరును సూచించడం ఆయనకు మహిళల పట్ల ఎంత గౌరవం ఉందో తెలిసిపోతుంది. ఏనాడు ఆయన పదవుల కోసం పాకులాడలేదు, పదవులే అయనని వెతుకులాడుతూ వచ్చాయి.

నీతి, నిజాయితీ గల వ్యక్తిత్వమే కాకుండా ఆయన పరమ భక్తుడు, యోగి, కర్మసిద్ధాంతి యుగపురుషుడు మచ్చలేని నాయకుడని చెప్పక తప్పదు. ఆయన వ్యక్తిత్వం తెలుగు రాష్ట్రాలతో పాటు పక్కనే వున్న కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో కూడా పరిచయమే. మహేంద్రనాథ్ గారి ప్రతిభ రాజకీయంగా, సాంఘికంగా తెలుగు రాష్ట్రాల చరిత్రలో కనిపిస్తుంది.

**రాజకీయం**

మహేంద్రనాథ్ గారు న్యాయవాదిగా, విద్యాదాతగానే కాకుండా రాజకీయరంగంలో కూడా తనదైన ముద్రను వేసుకున్నారు. మొట్టమొదట 1952 ఎన్నికలలో నల్గొండలో రావి నారాయణరెడ్డిపై ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు. ఆ తర్వాత 1957 సంవత్సరంలో నాగర్ కర్నూల్ ద్విసభ్య నియోజవర్గం నుంచి ఏకగ్రీవంగా ఎమ్మెల్యేగా ఎన్నుకోబడ్డారు. 1962వ సంవత్సరంలో జరిగిన సార్వత్రిక ఎన్నికలలో రెండవసారి నాగర్ కర్నూల్ శాసనసభ్యునిగా అత్యంత మెజార్టీతో గెలిచారు. శాసనసభ్యుడిగా నాగర్ కర్నూల్ నియోజకవర్గంలో పేద ప్రజలకు బంజరుభూములు, పేద విద్యార్థులకు ఉచిత విద్యావసతి, ఉపాధి మరియు తాలూకా నిర్మాణ కార్యకర్తల సంఘం స్థాపించి మహాత్మా గాంధీ ఆశయ సాధనకు నిస్వార్థంగా ప్రయత్నించారు. ప్రముఖంగా మద్యపాన నిషేధ ఉద్యమంలో ఆయన ముందుండి నడిపించారు.



**అచ్చంపేట ఎమ్మెల్యేగా**

అచ్చంపేట అసెంబ్లీ నియోజకవర్గం నుంచి నాలుగుసార్లు ఎమ్మెల్యేగా అఖండ మెజార్టీతో గెలిచి పీవీ నరసింహారావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అటవీశాఖ మరియు ఎక్సైజ్ మంత్రిగా, జలగం వెంగళరావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సాంఘిక సంక్షేమశాఖ మరియు మార్కెటింగ్ శాఖ, ఎన్టీరామారావుగారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రెవెన్యూ, పౌరసరఫరాలు విద్యుత్ శాఖ మరియు ఆర్థిక శాఖామంత్రిగా పనిచేశారు. బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కొరకు గురుకుల ఆశ్రమ పాఠశాలలను అచ్చంపేట పరిధిలో స్థాపించి ఈ ప్రాంత విద్యార్థుల విద్యాభివృద్ధికై విశేష కృషి చేశారు. మహాత్మాగాంధీ ఆశయ అనుసారంగా వినోబాభావే తలపెట్టిన ఉద్యమాన్ని ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో విస్తృతంగా ప్రచారం చేసి సాధ్యమైనంత వరకు ప్రజలకు భూస్వాములు స్వచ్ఛందంగా మిగులు భూములను పంచేలా ప్రయత్నించారు.

**రెవెన్యూ మంత్రిగా**

రెవెన్యూ మంత్రిగా ఉన్నప్పుడు కొల్లాపూర్ కు దగ్గర ఉన్న మొలచింతలపల్లి గ్రామంలో కృష్ణానది జలాలను మళ్లించి దిగువనున్న గ్రామాలకు తాగునీరు మరియు సాగునీరు అందించుటకు వారి ప్రణాళిక మరియు ఆలోచన సరళిని అప్పటి నీటిపారుదల శాఖ అధికారులతో మాట్లాడడం జరిగింది. అదే ప్రణాళిక ఆ తర్వాత కాలక్రమేణా కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ గా మారి ఇప్పుడు ప్రజలకు ఉపయోగపడుతున్న విషయం అందరికీ తెలిసింది. ఇదే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలను అంధకారంలోకి నెట్టిన అప్పటి పటేల్ పట్వారి వ్యవస్థను సమూలంగా రద్దుచేశారు. విప్లవాత్మకంగా గ్రామాధికారుల వ్యవస్థను అమలు చేసి ప్రజాస్వామ్యాన్ని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో నిలబెట్టాలని రెవెన్యూశాఖామంత్రిగా తాను తీసుకున్న నిర్ణయం తన రాజకీయ జీవితంలో అతిపెద్ద విజయంగా చెప్పుకున్నారు. ఆ కీర్తి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ కు కూడా దక్కుతుందని చెప్పుకున్నారు. రెవెన్యూశాఖా మంత్రిగా ప్రభుత్వానికి దగ్గరగా ఉండవలెననే సదాశయంతో అశోక్ మెహతా కమిటీ సిఫారసులను అనుసరించి మండల వ్యవస్థను అమలుపరిచి మండలాల విభజన సమితి అధ్యక్షుడిగా ఉండి ఇప్పుడున్న రెవెన్యూ వ్యవస్థను తీసుకురావడం జరిగింది.

వెనుకబడిన నాగర్ కర్నూల్,అచ్చంపేట ప్రాంతాల్లో మౌలిక వసతులు ఆసుపత్రులు, పాఠశాలలు, బస్టాండ్లు , రోడ్లు మరియు ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు ఏర్పాటు చేయడంలో ప్రముఖ భూమిక వహించారు. పదవులతో సంబంధం లేకుండా నిత్యం ప్రజాసమస్యలపై పోరాడే పుట్టపాగ మహేంద్రనాథ్ ఎంతైనా ఆదర్శవంతులు.

**రాష్ట్ర మంత్రిగా నిర్వహించిన శాఖలు**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో 1971 లో అటవీశాఖామంత్రిగా 1972లో ఆబ్కారిశాఖామంత్రి 1974లో మార్కెటింగ్ శాఖామంత్రిగా

1976లో సాంఘిక సంక్షేమశాఖామంత్రిగా

1983లో రెవెన్యూ మరియు రిజిస్ట్రేషన్,పౌరసరఫరాల శాఖామంత్రిగా

1985 ఆర్థిక మరియు విద్యుత్ శాఖామంత్రిగా పనిచేశారు. నాదెండ్ల భాస్కరరావు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కొంతకాలం ప్రొటెం స్పీకర్ గా కూడా పనిచేశారు.

**పేద విద్యార్థుల కోసం హాస్టల్ స్థాపించడం**

మహేంద్రనాథ్ యువన్యాయవాదిగా నాగర్ కర్నూల్ లో న్యాయవాద వృత్తి చేస్తూ ఆదరాభిమానాలు పొందుతూ ఒకవైపు న్యాయవాదిగా మరోవైపు గాంధీ మార్గంలో పేద విద్యార్థులకు హాస్టల్ ఏర్పాటు చేయాలని 1949 లో గాంధీ జయంతి నాడు గాంధీ స్మారక హాస్టలును ప్రారంభించారు. ఈ హాస్టల్ కమిటీకి చిక్కపల్లి రామచంద్రరావు అధ్యక్షులుగా తాను కార్యదర్శిగా ఉంటూ పేద విద్యార్థులకు చదువుకునే అవకాశం కల్పించారు. అతికొద్దికాలంలోనే విద్యార్థుల సంఖ్య క్రమక్రమంగా పెరిగి ఈ ప్రాంతం వారే కాక హైదరాబాదు నుండి నాగర్ కర్నూల్ కి వచ్చి హాస్టల్లో చదువుకునేవారు.

హాస్టల్ నడపడానికి ప్రజల నుంచి విరాళాలు తీసుకొని సమర్థవంతంగా నడిపిస్తూ అప్పటి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి ప్రభుత్వ నిధులను మంజూరు చేసి ఈ హాస్టల్ హరిజనగాంధీ స్మార్క హాస్టల్ గా నామకరణం చేశారు. పేదవారి కోసం తెలిసినవారికి మీ పిల్లలను చదువుకొనుటకు హాస్టల్ కు పంపించండి అని ఉత్తరాలు రాసేవారు. మన వకీల్ సాబ్ హాస్టల్ కు పంపిస్తే వారి పిల్లలు విద్యావంతులు కాగలరని భరోసాతో పేదవారు వారి పిల్లలను వారి మాట ప్రకారం హాస్టల్ కి పంపించారు. మహేంద్ర నాథ్ గారు కన్న కలలు కలగానే మిగిలిపోకుండా అన్ని వర్గాల ప్రజలకు విద్యను, దాని ఫలితాన్ని అందించారని చెప్పవచ్చు.

1985 సంవత్సరంలో మహేంద్రనాథ్ గారు ఆర్థిక మంత్రిగా ఉన్నప్పుడు ఎస్ ఆర్ శంకరన్ ఐఎఎస్ గారి సలహా తీసుకొని అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావును ఒప్పించి ఆర్థికశాఖ నుంచి నిధులు మంజూరు చేసి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోని ఎన్నో సాంఘిక గురుకుల పాఠశాలలను స్థాపించారు.

నాగర్ కర్నూల్ లో చేసిన హాస్టల్ ప్రయోగాన్ని సాంఘిక సంక్షేమగురుకులాలుగా రాష్ట్రం నలుమూలల స్థాపించడం వల్ల ఈనాడు అనేకమంది విద్యార్థులు అందులో చేరి ఎదిగి మంచి జీవన ప్రమాణాలను కలిగి ఉన్నారు. బీద విద్యార్థులు యావత్ ఆంధ్రా , తెలంగాణ రెండు రాష్ట్రాల బిడ్డలు ప్రయోజనం పొందుతున్నారని చెప్పవచ్చు.

**మహేంద్రనాథ్ ఆశయాలు**

అంటరానితనం నిర్మూలన, మద్యపాన నిషేధం ,విద్యావ్యాప్తి , పేద విద్యార్థులకు ఉచిత భోజన వసతి కల్పించుట ,భూమిలేని నిరుపేదలకు భూమి ఇప్పించుట, వతందారీ విధానం రద్దు పరచుట, అధికార వికేంద్రీకరణ, గిరిజన ప్రాంత సమగ్ర అభివృద్ధికై కృషి, వెట్టి చాకిరి నిర్మూలకై కృషి ,మొలచింతలపల్లి, నెట్టెంపాడు, భీమా ప్రాజెక్టుల సాధనకై కృషి.

**ఆదర్శాలు**

సత్యం ధర్మం అహింసలకు కట్టుబడి ఉండుట, నీతి నియమాలు కలిగి ఉండుట, క్రమశిక్షణతో మెలుగుట, నిరాడంబర జీవితం, సమయపాలన, గాంధేయవాదం సర్వోదయ ఉద్యమం

తన కర్తవ్యాన్ని చిత్తశుద్ధితో నిర్వర్తించి వకీల్ గా, విద్యాదాతగా పెత్తందారులను ఎదిరించి పేద ప్రజలకు భూములు ఇప్పించిన ధీమంతుడిగా ,శాసనసభ్యుడిగా మరియు మంత్రిగా పనిచేసిన మహేంద్రనాథ్ గారు భక్తి భావంతో కూడిన నిర్మల జీవితం గడిపారు. తన తండ్రి మశన్న శివరామదీక్షితులు అనే అచల గొప్ప గురువుగారి వలన ప్రభావితులై బ్రహ్మంగారి మనమరాలైన పరమ పావని ,వేదస్వరూపిణి మహాయోగిని ఈశ్వరమ్మ వారి భక్తుడైన దున్న ఇద్దాసు గారి భక్తుడు.

ఇంతటి గొప్ప మహానాయకుని ఆశయాలను, ఆలోచనలను అమలుపరిచి ముందుకు తీసుకుపోవడమే ఆయనకు నిజమైన నివాళి.



ముచ్చర్ల దినకర్
రచయిత, 944070 4535

# రైతు గుండె మంట వినిపించని పాలనకు చరిత్ర క్షమించదు..?

తెలంగాణ గ్రామీణ జీవితాన్ని నిలబెట్టేది రైతు చెమట. పల్లెలో పంట పండితేనే పట్టణాల్లో జీవనం కదులుతుంది. రైతు పొలంలో విత్తనం పడిన క్షణం నుంచి కోత ముగిసే వరకు ప్రతి అడుగులోనూ అనిశ్చితి, అప్పులు, ప్రకృతి, మార్కెట్, ప్రభుత్వ వ్యవస్థలతో పోరాడుతూనే ఉంటాడు. అయినా దేశానికి అన్నం పెట్టాలనే బాధ్యతతో ముందుకు సాగుతాడు. కానీ ఆ రైతే తన పండించిన ధాన్యాన్ని అమ్ముకోవడానికి రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల వద్ద వేచి ఉండాల్సి రావడం, గన్నీ సంచులు లేక, లారీలు లేక, హమాలీలు లేక ధాన్యం తడిసి నష్టపోవడం చూస్తుంటే వ్యవస్థ ఎంత నిర్లక్ష్యంగా మారిందో అర్థమవుతోంది. ఇసుక తరలింపుకు అడ్డగోలుగా లారీలు అందుబాటులోకి వస్తుంటే రైతు పండించిన పంట తరలించడానికి మాత్రం లారీలు దొరకకపోవడం యాదృచ్ఛికం కాదు. అది పాలనా వైఫల్యానికి ప్రతీక.

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నెలరోజులు, నెలన్నర దాటినా కాంటాలు పడక రైతులు పడుతున్న అవస్థలు ఇప్పుడు తెలంగాణ అంతటా ఆవేదనగా మారాయి. వర్షాలు పడితే ధాన్యం తడుస్తోంది. ఎండలు మండితే రైతుల ఆరోగ్యం దెబ్బతింటోంది. కొన్నిచోట్ల వడదెబ్బతో రైతులు ప్రాణాలు కోల్పోయారనే వార్తలు వినిపిస్తున్నాయి. అయినా వ్యవస్థలో చలనం కనిపించడం లేదు. రైతులు ధర్నాలు చేస్తున్నారు, రాస్తారోకోలు చేస్తున్నారు, ధాన్యం బస్తాలకు నిప్పుపెడుతున్నారు. ఇవి కేవలం నిరసనలు కావు; ఇవి ఒక రైతు మనసులో పేరుకుపోయిన అసహాయతకు రూపాలు. పంటను దహనం చేయడం అంటే రైతు తన కష్టాన్ని తానే కాల్చుకోవడం. దానికంటే పెద్ద విషాదం ఇంకేముంటుంది?

రైతు పంటను కాల్చే స్థితికి వస్తే అది కేవలం ఆర్థిక నష్టం కాదు, సమాజం మొత్తం వైఫల్యానికి సూచిక. పంట అంటే రైతుకు కేవలం ధాన్యం కాదు. అది అతని కుటుంబ ఆశలు, పిల్లల చదువు, అప్పుల తీర్చిదిద్దే మార్గం, ఇంటి భవిష్యత్తు. అలాంటి పంట కొనుగోలు కాకపోవడంతో రైతు నిరాశలో కూరుకుపోతున్నాడు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చిన తర్వాత కూడా రోజులు గడుస్తున్నా స్పందన లేకపోవడం రైతుల ఆవేదనను మరింత పెంచుతోంది.

ప్రభుత్వం ప్రతి ఏడాది ధాన్యం కొనుగోళ్లను గొప్పగా ప్రచారం చేస్తుంది. రైతు సంక్షేమమే తమ లక్ష్యమని చెబుతుంది. కానీ నేలమీద పరిస్థితులు చూస్తే ప్రకటనలకు, వాస్తవాలకు మధ్య ఎంత పెద్ద అంతరం ఉందో తెలుస్తోంది. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ముందస్తు ప్రణాళిక లేకపోవడం స్పష్టంగా కనిపిస్తోంది. గన్నీ సంచుల కొరత, లారీల కొరత, హమాలీల కొరత వంటి సమస్యలు ఒక్కరోజులో పుట్టేవి కావు. ప్రతి సీజన్లో ఇవే సమస్యలు వస్తున్నప్పటికీ శాశ్వత పరిష్కారం కనిపించడం లేదు. ఎన్నికలు ఉన్నాయని, కార్మికులు అందుబాటులో లేరని చెప్పడం బాధ్యత నుంచి తప్పించుకోవడమే తప్ప సమస్యకు సమాధానం కాదు.

రైతు ప్రశ్న చాలా సరళమైనది. పంట పండించమని ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది. విత్తనాలు, ఎరువులు, విద్యుత్, సాగునీరు అందిస్తామని చెబుతుంది. కానీ చివరికి పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో మాత్రం ఎందుకు నిర్లక్ష్యం చూపుతోంది? రైతు ధాన్యం కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చిన తర్వాత అది ప్రభుత్వ బాధ్యత కాదా? అక్కడి నుంచి సకాలంలో తూకం వేసి, నిల్వ చేసి, తరలించడం ప్రభుత్వ యంత్రాంగం చేయాల్సిన పని కాదా?

ఇప్పటి పరిస్థితుల్లో రైతు కష్టానికి గౌరవం తగ్గిపోతుందనే భావన బలపడుతోంది. మార్కెట్ యార్డుల్లో రోజులు గడిపినా అధికారులు పట్టించుకోకపోవడం రైతును మరింత అవమానానికి గురిచేస్తోంది. కొన్నిచోట్ల తూకంలో తరుగు పేరుతో అదనపు నష్టం కలిగిస్తున్నారు. క్వింటాకు పది కిలోల వరకూ తగ్గిస్తుండటంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు పంట ఆలస్యంగా కొనుగోలు అవుతోంది. మరోవైపు తూకంలో నష్టం. చివరకు చెల్లింపులు కూడా ఆలస్యమవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో రైతు ఎలా నిలబడగలడు?

ఇంకా బాధాకరమైన విషయం ఏమిటంటే రైతుల ఆవేదనను అర్థం చేసుకోవాల్సిన కొందరు ప్రజాప్రతినిధులు, మంత్రులు సమస్యను తేలికగా తీసుకోవడం. రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రతిపక్షాలు, మీడియా సృష్టించిన ప్రచారంగా కొట్టిపారేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం. రైతు ధాన్యాన్ని కాల్చుకుంటూ రోడ్డెక్కితే అది రాజకీయ నాటకం కాదు. అది ఆవేదనకు చివరి అంచు. అలాంటి సమయంలో అధికారంలో ఉన్నవారు బాధ్యతగా స్పందించాలి. సమస్యను అంగీకరించకుండా రైతులపైనే ఎదురుదాడి చేయడం పరిస్థితిని మరింత విషమం చేస్తుంది.

రైతు ఎండలో నిలబడి ధాన్యం కాపాడుకుంటుంటే, వర్షం వస్తే తడవకుండా రాత్రింబవళ్లు కాపలా కాస్తుంటే, కుటుంబ సభ్యులు కూడా కేంద్రాల వద్దే గడుపుతుంటే ఆ బాధను అర్థం చేసుకోవాలి. రైతు కష్టాన్ని చిన్నచూపు చూడడం ప్రమాదకరం. ఎందుకంటే వ్యవసాయం కేవలం ఒక రంగం కాదు. అది గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు మూలాధారం. రైతు చేతిలో డబ్బు ఉంటేనే గ్రామాల్లో వ్యాపారం తిరుగుతుంది. రైతు బలహీనపడితే దాని ప్రభావం మొత్తం సమాజంపై పడుతుంది.


ఇటీవలి కాలంలో వ్యవసాయం ఖర్చులు భారీగా పెరిగాయి. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, కార్మిక వ్యయం అన్నీ పెరిగిపోయాయి. రైతు అప్పులు చేసి పంట వేస్తున్నాడు. పంట చేతికి వచ్చిన తర్వాత అయినా గిట్టుబాటు ధర దక్కుతుందనే ఆశతో జీవిస్తున్నాడు. కానీ కొనుగోలు కేంద్రాల్లో ఆలస్యం కారణంగా అతని ఆశలు ఛిద్రమవుతున్నాయి. ధాన్యం తడిస్తే నాణ్యత తగ్గుతుందని చెప్పి ధర కోత పెడుతున్నారు. చివరకు రైతే నష్టపోతున్నాడు.

ఇక్కడ మరో ముఖ్యమైన అంశం పాలనా ప్రాధాన్యతల గురించి. ప్రభుత్వ యంత్రాంగం ఎక్కడ వేగంగా పనిచేస్తుందో, ఎక్కడ మందగిస్తుందో చూస్తే సమాజానికి అసలు ప్రాధాన్యత ఏమిటో తెలుస్తుంది. ఇసుక, ఖనిజాలు, కాంట్రాక్టులు వంటి రంగాల్లో వేగంగా కదిలే వ్యవస్థ రైతు ధాన్యం విషయంలో మాత్రం ఎందుకు అలసత్వం ప్రదర్శిస్తోంది? రైతు పంట తరలించడానికి సరిపడా లారీలు లేకపోవడం నిజంగా వనరుల కొరతా? లేక ప్రణాళికల లోపమా? ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే.ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద జరుగుతున్న పరిస్థితులు రైతులలో ప్రభుత్వంపై నమ్మకాన్ని దెబ్బతీస్తున్నాయి. ఒక రైతు తన పంటను కాల్చుకోవడం వెనుక కేవలం ఆర్థిక నష్టం కాదు, వ్యవస్థపై కోల్పోయిన విశ్వాసం ఉంటుంది. "ఇలా బతికే కంటే చనిపోవడమే మంచిది" అనే స్థితికి రైతు వెళ్లకుండా కాపాడటం ప్రభుత్వపు కనీస బాధ్యత. రైతు ఆత్మగౌరవాన్ని కాపాడలేని పాలన ఎంతటి సంక్షేమ పథకాలు ప్రకటించినా ప్రజల మనసుల్లో నిలబడదు.ఈ సమస్యను రాజకీయ కోణంలో మాత్రమే చూడటం సరైంది కాదు. రైతు బాధ ఏ పార్టీకి చెందినది కాదు. పంట కోసిన తర్వాత కొనుగోలు కాక ఇబ్బంది పడుతున్న రైతుకు రాజకీయాలు గుర్తుకురావు. అతనికి తన ధాన్యం తడవకుండా, సకాలంలో అమ్ముడవ్వాలనే ఆందోళన మాత్రమే ఉంటుంది. అందుకే రైతు సమస్యలను మానవీయ దృష్టితో చూడాలి. ప్రతి కొనుగోలు కేంద్రంలో సరిపడా గన్నీ సంచులు, తూకం యంత్రాలు, హమాలీలు, లారీలు అందుబాటులో ఉండేలా ముందస్తు ప్రణాళిక అవసరం. కొనుగోలు ప్రక్రియను డిజిటల్ పద్ధతుల్లో పారదర్శకంగా నిర్వహించాలి. రైతుకు ఎప్పుడు కాంటా పడుతుంది, ఎప్పుడు చెల్లింపు వస్తుంది అనే సమాచారం స్పష్టంగా అందాలి.అలాగే అధికారుల బాధ్యతను ఖచ్చితంగా నిర్ధారించాలి. నిర్లక్ష్యం వల్ల ధాన్యం తడిసి నష్టం జరిగితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు తాగునీరు, నీడ, విశ్రాంతి సదుపాయాలు కల్పించాలి. ఇవి విలాసాలు కావు, కనీస మానవ హక్కులు. రైతు గౌరవాన్ని కాపాడటం అంటే అతని కష్టాన్ని గుర్తించడం.

ప్రస్తుతం రైతుల్లో పెరుగుతున్న అసంతృప్తి కేవలం కొనుగోలు కేంద్రాల సమస్య కాదు. అది గ్రామీణ సమాజంలో పేరుకుపోతున్న అసహనం. రైతు కష్టానికి విలువ లేదనే భావన బలపడితే యువత వ్యవసాయం వైపు రావడం తగ్గిపోతుంది. ఇది భవిష్యత్తులో ఆహార భద్రతకే ముప్పు. ఒక దేశం బలంగా ఉండాలంటే ముందుగా రైతు బలంగా ఉండాలి. రైతు చేతులు ఖాళీగా ఉంటే దేశ ఆర్థిక వ్యవస్థ ఎంత పెరిగినా సామాన్యుడికి ప్రయోజనం ఉండదు.ప్రజాస్వామ్యంలో ప్రభుత్వం ప్రజలకు జవాబుదారిగా ఉండాలి. ముఖ్యంగా అన్నదాత విషయంలో మరింత బాధ్యతగా వ్యవహరించాలి. రైతు సమస్యలను కేవలం గణాంకాలుగా చూడకూడదు. ప్రతి ధాన్యం బస్తా వెనుక ఒక కుటుంబం జీవితం ఉందని గుర్తించాలి. రైతు కన్నీటి విలువ అర్థం చేసుకున్న పాలన మాత్రమే నిజమైన అభివృద్ధిని తీసుకురాగలదు.

ఇప్పటికైనా తెలంగాణ ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలి. ధాన్యం కొనుగోళ్లను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి. లారీల కొరతను వెంటనే పరిష్కరించాలి. గన్నీ సంచుల సరఫరా పెంచాలి. హమాలీల సమస్యకు తాత్కాలిక, శాశ్వత పరిష్కారాలు కనుగొనాలి. తడిసిన ధాన్యానికి పూర్తి పరిహారం ఇవ్వాలి. రైతులకు చెల్లింపులు ఆలస్యం కాకుండా పర్యవేక్షణ పెంచాలి. ముఖ్యంగా రైతుతో మాట్లాడే తీరు మారాలి. రైతును అనుమానంతో కాక గౌరవంతో చూడాలి. ఎందుకంటే రైతు కేవలం ఓటరు కాదు. ఈ దేశ ఆహార భద్రతకు ఆధారం. అతను నవ్వితేనే గ్రామం నవ్వుతుంది. గ్రామం నవ్వితేనే దేశం ముందుకు సాగుతుంది. రైతు గుండెల్లో పేరుకుపోతున్న బాధను వినకుండా ఉంటే ఒకరోజు అది సామాజిక ఆగ్రహంగా మారుతుంది. అప్పుడు సమస్య కేవలం ధాన్యం కొనుగోళ్లది కాదు, వ్యవస్థపై ప్రజల విశ్వాసానిదవుతుంది.

చరిత్ర చెబుతోంది – రైతును నిర్లక్ష్యం చేసిన సమాజాలు ఎన్నడూ స్థిరంగా నిలబడలేదని. రైతు కష్టాన్ని గౌరవించిన దేశాలే అభివృద్ధిలో ముందంజలో నిలిచాయని. అందుకే ఇప్పుడు అవసరమైనది ప్రకటనలు కాదు, చర్యలు. రైతుకు భరోసా కలిగించే పరిపాలన. రైతు కళ్లలోని ఆవేదనను చూసి స్పందించే మానవత్వం. పంటను కాల్చే స్థితి నుంచి రైతును బయటకు తీసుకురావడం ప్రతి ప్రభుత్వపు చారిత్రక బాధ్యత.రైతు దేశానికి అన్నం పెడతాడు. కానీ అదే రైతు అవమానంతో, అప్పులతో, నిరాశతో బతకాల్సి వస్తే అది ఏ సమాజానికైనా సిగ్గుచేటే. రైతు నిలబడితేనే దేశం నిలబడుతుంది. రైతు గుండె మంటను వినిపించని పాలనకు చరిత్ర ఎప్పటికీ క్షమించదు.



మన్నారం నాగరాజు
సామాజిక రాజకీయ విశ్లేషకులు

# పోలీస్–మీడియా సత్సంబంధాలకు వేదికగా 'సైబరాబాద్ ప్రెస్ & పోలీస్ ఫ్రెండ్లీ క్రికెట్ లీగ్–2026' ప్రారంభం

- **టోర్నమెంట్‌ను ప్రారంభించిన సైబరాబాద్ సీపీ డా. ఎం. రమేష్, ఐపీఎస్**





**సైబరాబాద్ వెలుతురు జూన్ 09:**

పోలీస్–మీడియా మధ్య సత్సంబంధాలను మరింత బలోపేతం చేయడం, క్రీడాస్ఫూర్తిని పెంపొందించడం లక్ష్యంగా నిర్వహిస్తున్న "సైబరాబాద్ ప్రెస్ & పోలీస్ ఫ్రెండ్లీ క్రికెట్ లీగ్–2026" టోర్నమెంట్‌ను సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్, ఐపీఎస్ మంగళవారం రోజున సైబరాబాద్ సీపీ కార్యాలయ పరేడ్ గ్రౌండ్‌లో ఘనంగా ప్రారంభించారు. సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్ డీసీపీ సంజీవ్, అదనపు డీసీపీ షమీర్ ఆధ్వర్యంలో జూన్ 9 నుంచి 11 వరకు మూడు రోజులపాటు ఈ టోర్నమెంట్ నిర్వహించనున్నారు. పోలీసు అధికారులు, సిబ్బంది మరియు మీడియా ప్రతినిధులతో కూడిన జట్లు ఇందులో పాల్గొంటున్నాయి.టోర్నమెంట్ తొలి రోజు జరిగిన మ్యాచ్‌లలో మల్కాజిగిరి మీడియా థండర్స్ జట్టు కెప్టెన్ వంశీ నాయకత్వంలో క్రైమ్ పార్ట్నర్స్ జట్టుతో తలపడింది. ఉత్కంఠభరితంగా సాగిన ఈ మ్యాచ్‌లో మల్కాజిగిరి మీడియా థండర్స్ జట్టు విజయం సాధించగా, అద్భుత ప్రదర్శన కనబర్చిన జెస్తాది రాజు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యారు.

మరో మ్యాచ్‌లో ఎస్‌సీఎస్‌సీ డిఫెండర్స్ జట్టు కెప్టెన్ ప్రణవ్ నాయకత్వంలో, శేరిలింగంపల్లి జట్టు కెప్టెన్ ఖాదిర్ నాయకత్వంలోని జట్టుతో పోటీ పడింది. ఈ మ్యాచ్‌లో ఎస్‌సీఎస్‌సీ డిఫెండర్స్ జట్టు విజయం సాధించగా, అత్యుత్తమ ఆటతీరును ప్రదర్శించిన శివ కుమార్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది.ఈ సందర్భంగా సీపీ డా. ఎం. రమేష్ మాట్లాడుతూ పోలీసు శాఖ మరియు మీడియా ప్రతినిధుల మధ్య పరస్పర అవగాహన, సమన్వయం, స్నేహపూర్వక వాతావరణాన్ని మరింత బలోపేతం చేయడంలో ఇటువంటి క్రీడా పోటీలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. క్రీడాస్ఫూర్తితో పాటు ఐక్యత, జట్టుగా పనిచేసే భావన, పరస్పర గౌరవాన్ని పెంపొందించడమే ఈ టోర్నమెంట్ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు."యునైటెడ్ ఇన్ స్పిరిట్ – స్ట్రాంగర్ టుగెదర్" అనే నినాదంతో నిర్వహిస్తున్న ఈ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ జూన్ 11న సాయంత్రం జరగనుంది.

# ఐఐఐటీ జంక్షన్ - డీఎల్ఎఫ్ కారిడార్ రహదారి అభివృద్ధి పనులను పరిశీలించిన సైబరాబాద్ సీపీ

**గచ్చిబౌలి వెలుతురు జూన్ 09:**



గచ్చిబౌలి పరిధిలోని ఐఐఐటీ జంక్షన్ వద్ద కొనసాగుతున్న రహదారి అభివృద్ధి, ఫ్లైఓవర్ నిర్మాణ పనులను ఈ రోజు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ నుండి డీఎల్ఎఫ్ జంక్షన్ వరకు చేపడుతున్న ఫ్లైఓవర్ మరియు రహదారి విస్తరణ పనుల పురోగతిని ఆయన సమీక్షించారు. శేర్లింగంపల్లి ఏడీసీపీ హనుమంతరావు, సిఎంసి (CMC) అధికారులతో కలిసి నిర్మాణ ప్రాంతాన్ని సందర్శించిన సీపీ, పనులు నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. నిర్మాణ పనుల కారణంగా ప్రజలకు కలిగే ఇబ్బందులను తగ్గించేందుకు చేపట్టాల్సిన చర్యలు, ట్రాఫిక్ నిర్వహణ, ప్రత్యామ్నాయ మార్గాల ఏర్పాటుపై అధికారులతో చర్చించారు.ఈ సందర్భంగా సైబరాబాద్ సీపీ అధికారులు తో మాట్లాడుతూ, నిర్మాణ పనుల దృష్ట్యా రాబోయే మూడు నెలల పాటు ప్రత్యేక ట్రాఫిక్ అడ్వైజరీ అమలు చేసి, అవసరమైన ప్రాంతాల్లో ట్రాఫిక్ డైవర్షన్లు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వాహనదారులు ట్రాఫిక్ పోలీసుల సూచనలను పాటిస్తూ ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించాలని కోరారు. రహదారి అభివృద్ధి, ఫ్లైఓవర్ నిర్మాణ పనులు పూర్తయిన అనంతరం గచ్చిబౌలి–డీఎల్ఎఫ్ మార్గంలో ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గడంతో పాటు ప్రయాణికులకు మరింత మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని సీపీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గచ్చిబౌలి ట్రాఫిక్ ఎస్‌హెచ్ఓ సురేష్, సిఎంసి అధికారులు మరియు ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పెరిగిన పెట్రోల్, గ్యాస్ ధరలను తక్షణమే తగ్గించాలి

- **తెలంగాణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ గారి ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ పాల్గొని**
- **కేంద్ర ప్రభుత్వ వైఖరిపై రంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీమతి జ్యోతి భీమ్ భరత్ ధ్వజం**







**హైదరాబాద్ వెలుతురు జూన్ 09:**

కేంద్ర బీజేపీ ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో మంగళవారం నాడు హైదరాబాద్‌లో భారీ నిరసన ర్యాలీ నిర్వహించబడింది.

రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీమతి ఎర్రవెల్లి స్వర్ణ గారి ఆదేశాల మేరకు గాంధీభవన్ నుండి తెలంగాణ అమరవీరుల స్థూపం వరకు జరిగిన ఈ మహా ర్యాలీలో హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న ఐదు జిల్లాల నుండి దాదాపు 500 మందికి పైగా మహిళా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై తమ నిరసనను తెలియజేశారు. ఈ సందర్భంగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీమతి జ్యోతి భీమ్ భరత్ మాట్లాడుతూ, కేంద్రం ఇష్టానుసారంగా పెంచుతున్న ఇంధన, గ్యాస్ ధరల పెంపుతో దేశంలోని 90 శాతం పేద, మధ్యతరగతి కుటుంబాలు మరింత పేదరికంలోకి నెట్టివేయబడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. సామాన్యుడి నడ్డి విరిచే ఈ ధరల భారాన్ని వెంటనే తగ్గించకపోతే దేశవ్యాప్తంగా ప్రజల నుండి వచ్చే తిరుగుబాటు ధాటికి కేంద్ర ప్రభుత్వం కుప్పకూలక తప్పదని హెచ్చరించారు. మహిళల వంటింటి బడ్జెట్‌ను చిన్నాభిన్నం చేసిన బీజేపీ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పేందుకు మహిళా లోకం సిద్ధంగా ఉందని, పెంచిన ధరలను వెనక్కి తీసుకునే వరకు మహిళా కాంగ్రెస్ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా నుండి నియోజకవర్గ, ఏ & బి బ్లాక్ మండల, మున్సిపల్, డివిజన్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు, కమిటీ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. వారందరికీ శ్రీమతి జ్యోతి భీమ్ భరత్ ధన్యవాదాలు తెలిపారు.

# దండుమైలారం గ్రామంలో ప్రభుత్వ టీచర్ల ఆధ్వర్యంలో ఉధృతంగా బడిబాట కార్యక్రమం

**పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించండి జిహెచ్ఎం గోవర్ధన్**



**ఇబ్రహీంపట్నం వెలుతురు జూన్ 09:**

ఇబ్రహీంపట్నం మండలం దండుమైలారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జిహెచ్ఎం గోవర్ధన్ ఆధ్వర్యంలో పాఠశాల టీచర్లు మరియు గ్రామపంచాయతీ వార్డు సభ్యులు కలిసి అనేక వార్డులో మరియు కాలనీలో తిరుగుతూ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని పాఠశాలలో విద్యా భివృద్ధికి మరియు విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలైనా ఉచిత విద్య ఉచిత ఏకరూప దుస్తులు.పాఠ్యపుస్తకాలు నోటు పుస్తకాలుమధ్యాహ్న భోజనం ఉదయం పూట అల్పాహారం మరియు విద్యార్థులకు కిట్టువంటివి వినియోగించుకుంటూ మంచి నాణ్యమైన ఉచి త విద్యను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యా యులు వి గోవర్ధన్ గ్రామంలోని విద్యార్థుల తల్లిదండ్రులను పెద్దలను గ్రామప్రజా ప్రతినిధులను గ్రామ యువకులను కలిసి మాట్లాడారుచిన్నపిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలి అని కోరారు ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు ప్రసాద్ చాంద్ పాషా నిఖిల్,వెంకటేష్ టీచర్లు నివేది త సుజాత శ్రీనివాస్ రామకృష్ణ లింగమయ్య వెంకటరమణ పూజారి రమేశ సుమలత రామేశ్వరి విజయ షఫీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.ల

# శేరిలింగంపల్లి అభివృద్ధికి రూ. 2,000 కోట్ల మంజూరు

- **సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీకి కాంగ్రెస్ నాయకుడు చిరుమర్తి రాజు కృతజ్ఞతలు**

**కూకట్ పల్లి జూన్ 09 వెలుతురు:**

శేరిలింగంపల్లి నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రూ.2,000 కోట్ల నిధులను మంజూరు చేయడం పట్ల తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) రాష్ట్ర నాయకుడు చిరుమర్తి రాజు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీకి నియోజకవర్గ ప్రజల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో చిరుమర్తి రాజు మాట్లాడుతూ, శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి భారీ స్థాయిలో నిధులను కేటాయించడం ప్రభుత్వం అభివృద్ధి పట్ల ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు. అలాగే నియోజకవర్గంలో మౌలిక సదుపాయాల విస్తరణ, రహదారుల అభివృద్ధి, డ్రైనేజీ వ్యవస్థ బలోపేతం, ట్రాఫిక్ సమస్యల పరిష్కారం, ప్రజా సౌకర్యాల మెరుగుదల వంటి అంశాలపై ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. అభివృద్ధే ధ్యేయంగా ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి నిధుల సాధనలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. రూ.2,000 కోట్ల నిధులతో నియోజకవర్గంలో చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాలు శేరిలింగంపల్లి రూపురేఖలను మరింత మార్చనున్నాయని, ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు అందుబాటులోకి వస్తాయని చిరుమర్తి రాజు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శేరిలింగంపల్లి ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ముందంజలో నిలిపేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు.



# నేడు మీర్ ఖాన్ పేట్ పోర్త్ సిటీ ప్రారంభోత్సవం చేయనున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

- **పోర్త్ సిటీ ప్రారంభోత్సవం కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు హాజరు కావాలి**
- **మంచాల మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎడ్మ నరేందర్ రెడ్డి**


**మంచాల వెలుతురు జూన్ 09:**



మంచాల మండలం కేంద్రంలో మంచాల మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎడ్మ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని లక్ష్యంతో దూసుకెళ్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు నేడు సాయంత్రం 5 గంటలకు రంగారెడ్డి జిల్లా కందుకూరు మండ లం మీర్ ఖాన్ పేట్ గ్రామంలో అభివృద్ధిలో భాగంగా పోర్త్ సిటీ ప్రారంభోత్సవం చేయను న్నారు కావున ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి గారి ఆదేశాలమేరకు మంచాల మం డలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు సర్పంచులు ప్రజాప్రతినిధులు మాజీ ప్రజా ప్రతి నిధులు పెద్దఎత్తున మీర్ ఖాన్ పేట్ లో జరిగే పోర్త్ సిటీ ప్రారంభోత్సవం కార్యక్రమానికి హాజరుకా వాలని పిలుపునిచ్చారు.

# మెరుగైన మౌలిక వసతులు కల్పించడం ప్రభుత్వ బాధ్యత

**బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్**



**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) జూన్ 09:**

మంగళవారం 130 – సుభాష్ నగర్ డివిజన్ పరిధిలోని రాజుల స్వామి నగర్, సిద్ధార్థ్ నగర్, జై శ్రీరామ్ నగర్, మరాఠీ బస్తీలలో ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక వసతుల సమస్యలపై బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా రాజుల స్వామి నగర్లో భూగర్భ డ్రైనేజీ అవుట్ లెట్ సమస్య, సిద్ధార్థ నగర్ లో భూగర్భ డ్రైనేజీ సమస్యతో పాటు శానిటేషన్ సమస్య, వరద నీటి సమస్య, జై శ్రీరామ్ నగర్ లో సీసీ రోడ్డు సమస్యతో పాటు నాలా సమస్యను పరిశీలించిన ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ పారిశుధ్య నిర్వహణ, భూగర్భ డ్రైనేజీ పనులలో అధికారుల నిర్లక్ష్య వైఖరి పై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.

అనంతరం వారు మాట్లాడుతూ.... గత 12 ఏళ్ల కాలంలో కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి కుత్బుల్లాపూర్ ను ఎంతో అభివృద్ధి పరిచామని, అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ అని రానున్న రోజుల్లో కూడా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని సుభాష్ నగర్ డివిజన్ తో పాటు అన్ని ప్రాంతాలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో కొంపల్లి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ లావణ్య, ఈఈ సుబ్రహ్మణ్యం, డీజీఎం శ్రావణి, వివిధ విభాగాల అధికారులు అలాగే స్థానిక నాయకులు మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, పోలే శ్రీకాంత్, వారాల వినోద్, రాజ్ కుమార్ ముదిరాజ్, కోల శ్రీకాంత్ ముదిరాజ్, గుబ్బల లక్ష్మీ నారాయణ, రవి, వేణు, మరాఠీ అశోక్, మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, స్వామి, చందు,గట్టు అశోక్, కాలనీల సంక్షేమ సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యపై తక్షణ స్పందన తాగునీటి సరఫరా పునరుద్ధరణ

**మాజీ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్**

**హైదరాబాద్ వెలుతురు జూన్ 09:**



విటల్‌వాడి ప్రాంతంలోని సిటీ హోమ్స్, హెయిర్‌బస్ అపార్ట్‌మెంట్ మరియు పరిసర కాలనీలలో గత కొన్ని రోజులుగా తాగునీటి సరఫరా సక్రమంగా లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నీటి అవసరాల కోసం పలువురు కుటుంబాలు రూ.2,000 నుండి రూ.3,000 వరకు ఖర్చు చేసి ప్రైవేట్ వాటర్ ట్యాంకర్లను తెప్పించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ విషయాన్ని స్థానిక మాజీ కార్పొరేటర్ శ్రీమతి మహాలక్ష్మి రామన్ గౌడ్ గారి దృష్టికి తీసుకువెళ్లగా, ఆమె వెంటనే వాటర్ వర్క్స్ అధికారులతో మాట్లాడి సమస్యను అత్యవసరంగా పరిష్కరించాలని ఆదేశించారు. కార్పొరేటర్ గారి చొరవతో అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించి అవసరమైన మరమ్మతు పనులు చేపట్టారు. దీంతో ప్రస్తుతం తాగునీటి సరఫరా పూర్తిగా పునరుద్ధరించబడింది. నీటి కోసం వేల రూపాయలు ఖర్చు చేయాల్సిన అవసరం లేకుండా పోవడంతో అపార్ట్‌మెంట్ వాసులు, బస్తీ ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. ప్రజల ఇబ్బందిని తమ ఇబ్బందిగా భావించి వెంటనే స్పందించిన మాజీ కార్పొరేటర్ గారి సేవాభావాన్ని స్థానికులు అభినందించారు. ఈ సందర్భంగా సమస్య పరిష్కారానికి సహకరించిన వాటర్ వర్క్స్ అధికారులకు, మున్నవ్వర్.

# జల శక్తి అభియాన్‌పై గ్రామాల్లో విస్తృత అవగాహన కార్యక్రమం





**నార్కట్ పల్లి వెలుతురు జూన్ 09:**

నల్లగొండ జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ (DRDA) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జలసంచయి – జలభాగేదారి ప్రచార కార్యక్రమంలో భాగంగా బ్రాహ్మణవెల్లంల, చౌడంపల్లి, గోపాలపల్లి, మాదాఎడవల్లి గ్రామాల్లో కళాజాత బృందం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. జల వనరుల సంరక్షణ, భూగర్భ జలాల పెంపు లక్ష్యంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో ఇంటి కప్పులపై వర్షపు నీటి సంరక్షణ, నీటి సంరక్షణ గుంటలు, బోరుబావుల పునరుద్ధరణ, పురాతన బావుల పూడికతీత, సమతల కందకాలు, ఖండిత కందకాలు, నీటి నిల్వ కందకాలు, మట్టి కట్టలు, వీడి రాళ్ల కట్టలు, రాళ్ల కట్టలు, చెక్‌డ్యాంల పూడికతీత మరియు నిర్మాణం, చెక్‌వాల్ పూడికతీత మరియు నిర్మాణం, ఫారం పాండ్ కుంటలు, చేపల కుంటలు, చెరువుల పూడికతీత వంటి అంశాలపై గ్రామస్తులకు వివరించారు. ఈ సందర్భంగా నీటి వనరులను సంరక్షించడం ద్వారా భవిష్యత్ తరాలకు నీటి భద్రత కల్పించవచ్చని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ శిరీష, టెక్నికల్ అసిస్టెంట్లు శ్రీను, అశోక్, కృష్ణవేణి, సంబంధిత గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# పులిపెల్లి అండాలు మృతికి చిరుమర్తి లింగయ్య నివాళి

**నార్కట్ పల్లి వెలుతురు జూన్ 09:**



నార్కెట్‌పల్లి మండలం శేరుబావిగూడెం గ్రామానికి చెందిన పులిపెల్లి అండాలు అనారోగ్యంతో మృతిచెందగా, వారి మృతదేహాన్ని నకిరేకల్ మాజీ శాసనసభ్యులు చిరుమర్తి లింగయ్య సందర్శించి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అండాలు కుటుంబ సభ్యులను పరామర్శించిన చిరుమర్తి లింగయ్య, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేసి, ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని కల్పించాలని భగవంతుడిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు, పార్టీ కార్యకర్తలు, కుటుంబ సభ్యులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు నర్రా శ్రీకాంత్ రెడ్డిని పరామర్శించిన చిరుమర్తి లింగయ్య



**నార్కట్ పల్లి వెలుతురు జూన్ 09:**

చిట్యాల మండలం వట్టిమర్తి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు నర్రా శ్రీకాంత్ రెడ్డి ఇటీవల జరిగిన బైక్ ప్రమాదంలో గాయపడగా, ప్రస్తుతం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో నకిరేకల్ మాజీ శాసనసభ్యులు చిరుమర్తి లింగయ్య వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న చిరుమర్తి లింగయ్య, మెరుగైన వైద్య సేవలు తీసుకొని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అలాగే కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఘనంగా పాల్వాయి గోవర్ధన్ రెడ్డి వర్ధంతి

**మునుగోడు,జూన్ 9(వెలుతురు):**



మాజీ రాజ్యసభ సభ్యుడు,మాజీ ఎమ్మెల్సీ,మాజీ ఎమ్మెల్యే పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి 9వ వర్ధంతి సందర్భంగా మంగళవారం చండూరు మున్సిపాలిటీ కేంద్రంలోని ఆయన విగ్రహానికి మునుగోడు బీఆర్ఎస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజా సేవకు అంకితమైన నాయకుడిగా పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి చిరస్థాయిగా నిలిచారని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఆయన చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు.ఆయన ఆశయాలను కొనసాగిస్తూ ప్రజల సంక్షేమానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మారగోని అంజయ్య గౌడ్,మేకల శ్రీనివాస్ రెడ్డి,జిట్టగోని మల్లేష్,గురిజ సునిల్, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలులో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం

- **రాష్ట్రంలో అనేక అభివృద్ధి పనులకు కేంద్రం పెద్ద ఎత్తున నిధుల కేటాయింపు**
- **బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ .రామచంద్రరావు**
- **యాదగిరిగుట్ట శివారులో ఘనంగా ప్రారంభమైన బిజెపి యాదాద్రి భువనగిరి జిల్లా రెండు రోజుల శిక్షణ శిబిరాలు**

**యాదగిరిగుట్ట, జూన్ 9 వెలుతురు న్యూస్**



ధాన్యం కొనుగోలులో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు

ఎన్. రామచందర్రావు అన్నారు. బిజెపి యాదాద్రి భువనగిరి జిల్లా స్థాయి రెండు రోజుల శిక్షణ శిబిరాలు యాదగిరిగుట్ట శివారులో మంగళవారం ప్రారంభమయ్యాయి . ఈ సందర్భంగా ఆయన బిజెపి రెండు రోజుల శిక్షణ శిబిరాలను ప్రారంభించారు. అనంతరం ఆయన బిజెపి యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు ఉట్కూరి అశోక్ గౌడ్ , పలువురు బిజెపి జిల్లా సీనియర్ నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి తరచుగా బిజెపి నేతలపై విమర్శలు చేస్తున్నారని , తమ నాయకులను విమర్శించడం తప్ప రాష్ట్రంలో ఆయన చేస్తున్న అభివృద్ధి ఏమీ లేదని అన్నారు. ధాన్యం కొనుగోలును రాష్ట్ర ప్రభుత్వమే చేయాలని , ఆ తరువాత కేంద్ర ప్రభుత్వం తగినన్ని నిధులు కేటాయించి ఆ ధాన్యాన్ని తీసుకుంటుందని అన్నారు . ధాన్యం కొనుగోలు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. సకాలంలో ధాన్యం కొనుగోలును ప్రారంభించకుండా, నెలరోజులు ఆలస్యంగా ధాన్యం కొనుగోలును చేపట్టిన రాష్ట్ర ప్రభుత్వానికి ధాన్యం కొనుగోలు పై స్పష్టత లేదని అన్నారు . రాష్ట్రంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలకు కేంద్రం పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తుందని అన్నారు . ఈ విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి తో పాటు కాంగ్రెస్ నాయకులు గుర్తుంచుకోవాలని అన్నారు. తమ నాయకులు రాష్ట్ర ప్రాజెక్టులకు కేంద్రంలో అడ్డుపడుతున్నారు అన్న విమర్శలకు ఎలాంటి అర్థం లేదని అన్నారు. ఎయిమ్స్, ఎంఎంటీఎస్ లాంటి అభివృద్ధి పనులను కేంద్రం పెద్ద ఎత్తున చేపట్టింది అని అన్నారు . రాష్ట్రంలో జాతీయ రహదారులకు పెద్ద ఎత్తున నిధులు వెచ్చిస్తున్నామని తెలిపారు. తమ కేంద్ర ప్రభుత్వం అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినప్పటికీ సీఎం రేవంత్ రెడ్డి తమ పార్టీపై లేనిపోని విమర్శలు చేయడం తగదని విమర్శించారు . కాంగ్రెస్ , బిఆర్ఎస్ పార్టీలు రెండు ఒకటేనని అన్నారు . ఆ రెండు పార్టీల మధ్య లోపాయ కారి ఒప్పందం ఉందని విమర్శించారు. ఆ రెండు పార్టీలు కలిసి తమను అకారణంగా విమర్శిస్తున్నాయని అన్నారు. ప్రజలు అంతా గమనిస్తున్నారని ప్రజలే ఆ రెండు పార్టీలకు తగిన బుద్ధి చెప్తారని అన్నారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు, మూసి ప్రాజెక్టు కాంగ్రెస్ పార్టీకి ఏటీఎం గా మారాయని తీవ్రంగా విమర్శించారు. ఓబీసీ అయిన ప్రధానికి నమస్కరిస్తే తప్పేమిటని ఆయన అన్నారు. కాంగ్రెస్ నాయకులే ఆ పార్టీ ఢిల్లీ పెద్దలకు గులాములుగా మారారని విమర్శించారు. దేశాన్ని సోనియా రాహుల్ గాంధీ లే పరిపాలించాలా ? అని ప్రశ్నించారు. బిజెపి బడుగు బలహీన వర్గాలకు ఎంతో ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ నేతలు ఇప్పటికైనా వాస్తవాలు గమనించాలని సూచించారు. ఆయన వెంట యాదాద్రి భువనగిరి జిల్లా బిజెపి అధ్యక్షులు ఉట్కూరి అశోక్ గౌడ్, సీనియర్ నాయకులు వేముల అశోక్, బిజెపి జిల్లా ఐటీ సెల్ ఇంచార్జి మిట్ట వెంకటేష్ గౌడ్ ( MVT) యాదాద్రి భువనగిరి జిల్లా బిజెపి నాయకులు ఉన్నారు.

# తెలంగాణ ఉద్యమకారుల కోసం ఏర్పడిన కేకే కమిటీ

- **దివ్యాంగ ఉద్యమకారులను గుర్తించాలి**
- **సభలో మాట్లాడుతున్న డాక్టర్ ఎం. అశోక్**



**రామన్నపేట వెలుతురు న్యూస్ జూన్ 09:**

ఉద్యమకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మలిదశ తెలంగాణ ఉద్యమంలో పాల్గొని ప్రత్యేక తెలంగాణ కోసం దివ్యాంగులు ఎంతో కీలక పాత్ర పోషించారని వారు గుర్తింపు కోసం చైతన్యపురి శివాజి స్టార్చ్ వద్ద తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో దివ్యాంగుల యొక్క ఉద్యమకారులను ఏకతాటిపై తెచ్చి ఉద్యమకారులతో వందలాది మందితో సభను ఏర్పాటు చేశారు.తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం చైర్మన్ కచం సత్యనారాయణ సమావేశంలో అప్పుడు జరిగిన ఉద్యమాలను గుర్తు చేసుకుని దివ్యాంగుల తెలంగాణ కోసం నిరంతరం పనిచేసే ఉద్యమానికి అండగా ఉన్నారని వారి కృషి మరువలేనిదని డాక్టర్ కాచం సత్యనారాయణ మాట్లాడారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ కేకే కమిటీ సభ్యులు మోత శోభన్ రెడ్డి పాల్గొని దివ్యాంగులను గుర్తించి వారి పక్షాన ఉండి న్యాయం చేస్తామని దివ్యాంగులతో కె. కె. కమిటీ సమావేశం అవుతుందని. తెలంగాణలో ఉద్యమకారులు అందరికీ న్యాయం చేస్తానని హామీ ఇచ్చి తెలంగాణ ఉద్యమ కారులకు సంబంధించిన విధివిధానాలను ప్రకటించి సభలో మాట్లాడారు. దివ్యాంగుల ఉద్యమకారులను గుర్తిస్తామని కమిటీ సభ్యులు మాట్లాడడం జరిగింది. ఈ సభకు హాజరైన దివ్యాంగుల విశ్వవిద్యాలయాల పోరం అధ్యక్షుడు డాక్టర్ ఎన్. అశోక్ మాట్లాడుతూ దివ్యాంగులు తెలంగాణ ఉద్యమంలో ఎంతో క్రియాశీలకంగా ప్రత్యేక తెలంగాణ కోసం పని చేశారని వారు టెంట్ కు పరిమితమై కూడా ఎన్నో రోజులు దీక్షలో పాల్గొన్నారని ప్రతి కార్యక్రమంలో ఉద్యమానికి అండగా ఉన్న దివ్యాంగులు ఎలక్ట్రానిక్ మీడియా ప్రింట్ మీడియాలో మాత్రం మీడియా కవర్ చేసింది. కానీ ప్రింట్ మీడియా లో మాత్రం దివ్యాంగులకు అవకాశం దొరకలేదని. ఉద్యమాల్లో పాల్గొన్నప్పుడు దివ్యాంగులనే గౌరవంతో పోలీస్ కేసులు కూడా నమోదు చేయలేదని అందువల్ల కమిటీ గుర్తించి పేపర్లలో లేకున్నా అప్పటి మీడియా ను సంప్రదించి దివ్యాంగులకు న్యాయం చేయాలని కమిటీని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల కాంగ్రెస్ మేనిఫెస్టో చైర్మన్ చెరుకు నాగ భూషణం. విశ్వవిద్యాలయాల ప్రధాన కార్యదర్శి పల్స అంజనేయులు గౌడ్. విశ్వవిద్యాలయాల పోరం ఉపాధ్యక్షులు డాక్టర్ కుర్షిత్ మియా, బండి శ్రీనివాసరావు. సహాయ కార్యదర్శి వేణు గౌడ్. సైదులు యాదవ్. రాజ్యాధికార పార్టీ అధ్యక్షులు రామచంద్రం మహిళా విభాగం అధ్యక్షురాలు దానమ్మ. తెలంగాణ ఉద్యమ దివ్యాంగ నాయకుడు పెద్ద ఎత్తున పాల్గొని సభను విజయవంతం చేశారు.

# వంటగ్యాస్ ధరల పెంపుపై పి.ఓ.డబ్ల్యూ వినూత్న నిరసన

**నార్కట్ పల్లి వెలుతురు జూన్ 09:**




కేంద్ర ప్రభుత్వం వంటగ్యాస్ సిలిండర్ ధరలను పెంచి సామాన్య ప్రజలపై అదనపు ఆర్థిక భారాన్ని మోపుతోందని ప్రగతిశీల మహిళా సంఘం (పి.ఓ.డబ్ల్యూ) జిల్లా ప్రధాన కార్యదర్శి పజ్జూరు ఉపేంద్ర విమర్శించారు. పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ నార్కట్‌పల్లి మండలం పల్లెపహాడ్ గ్రామంలో ఖాళీ గ్యాస్ సిలిండర్లతో పి.ఓ.డబ్ల్యూ ఆధ్వర్యంలో వినూత్న నిరసన కార్యక్రమం నిర్వహించారు.<

ఈ సందర్భంగా ఉపేంద్ర మాట్లాడుతూ, గృహ వినియోగ ఎల్‌పీజీ సిలిండర్లపై ఇటీవల ధరల పెంపు పేద, మధ్యతరగతి కుటుంబాలపై తీవ్ర ప్రభావం చూపుతుందని అన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు నిరంతరం పెరుగుతుండటంతో ప్రజల ఆర్థిక పరిస్థితి మరింత దెబ్బతింటోందని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న యుద్ధాలు, అంతర్జాతీయ మార్కెట్ పరిణామాల పేరుతో ఇంధన ధరలను పెంచడం వల్ల ప్రజలపై భారం పడుతోందని విమర్శించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను పలుమార్లు పెంచిందని ఆరోపించారు. ప్రజలపై అదనపు భారాలు మోపే విధానాలను కేంద్ర ప్రభుత్వం విరమించుకుని, పెంచిన వంటగ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో తోడుసు జయలక్ష్మి , చిరమెని చంద్రకళ, మట్టిపెల్లి యాదమ్మ, మీడిదొడ్డి సోవమ్మ, మీడిదొడ్డి సునీత, పజ్జూరు పద్మ, కొప్పుల రజిత, చింతల అనిత, షేక్ జరీనా తదితరులు పాల్గొన్నారు.

# పెంచిన ఎరువుల ధరలను తగ్గించాలి

**మోత్కూర్, జూన్ 9,వెలుతురు న్యూస్ :**

మంగళవారం నాడు మోత్కూర్ మున్సిపల్ కేంద్రంలోని కె.ఆర్ భవన్ లో మోత్కూర్ మండల రైతు సంఘం నాల్గవ మహాసభ మొగుళ్ల తిరుపతిరెడ్డి అధ్యక్షతన జరిగింది.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా రైతు సంఘం కార్యదర్శి జక్క దయాకర్ రెడ్డి హాజరై మాట్లాడుతూ రైతులకు సకాలంలో రైతుబంధు అందించాలని రెండు లక్షల రుణమాఫీ ఏకకాలంలో మాఫీ చేయాలని మార్కెట్లో ఉన్న వడ్లను తక్షణమే ఎగుమతి చేయాలని వర్షాకాలం సీజన్ వస్తున్న తరుణంలో రైతులందరి ధాన్యం కొనుగోలు చేయాలని తెలిపారు.అదేవిధంగా సకాలంలో బిల్లులు చెల్లించాలని పెంచిన ఎరువుల ధరలను తగ్గించాలని ఇటీవల పెంచిన మద్దతు ధరలను పున:పరిశీలించాలని అన్నారు.

స్వామినాథన్ కమిషన్ సిఫారసు మేరకు మద్దతు ధర ప్రకటించాలని లేనిపక్షంలో ఈ జిల్లాలో రైతులను సమీకరించి పోరాటాలు నిర్వహిస్తామని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు . ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి అన్నెపువెంకట్ , సహాయ కార్యదర్శి పులకరం మల్లేష్ పాల్గొన్నారు.సమావేశం అనంతరం మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీలో

అధ్యక్షులు మొగుళ్ల తిరుపతిరెడ్డి,ఉపాధ్యక్షులు పైళ్ళ సత్తిరెడ్డి,ప్రధాన కార్యదర్శి దొండ ఎల్లయ్య,సహాయ కార్యదర్శి కడమంచి వీరస్వామి,కోశాధికారి కొమ్ము రాములు, కార్యవర్గ సభ్యులుగా కళ్లెం నరసయ ,కొల్లు లక్ష్మయ్య, ఎర్రబాబు, బుష్పాక అంజయ్య, కట్కూరి జగన్మోహన్ రెడ్డి, మదూరి సోమిరెడ్డి, పంగ శ్రీహరి, నిలిగొండ అశోక్ తదితరులను ఎన్నుకున్నారు.



# చెత్తాచెదారంతో మరో డంపింగ్ యార్డును తలపిస్తున్న "హిందూపురి"



- 12 ఏళ్లుగా నాలుగు డివిజన్లో చెత్తతో అధ్వానంగా మారిన హిందూ పూరి ప్రాంతం
- సమస్యను పరిష్కరించడానికి రంగంలోకి దిగిన మేయర్ కోలగని శ్రీనివాస్,22వ డివిజన్ కార్పొరేటర్ బండ రమణారెడ్డి

**కరీంనగర్ వెలుతురు జూన్ 09:**

నగరంలోని ఆర్టీసీ వర్క్ షాప్ క్వాటర్స్ ప్రాంతంలోని హిందూ పురి ప్రాంతం గత 12 ఏళ్లుగా తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతోంది. దాదాపు నాలుగు డివిజన్లకు సంబంధించిన చెత్తాచెదారాన్ని ఇక్కడే వేస్తుండటంతో, ఈ ప్రాంతం కాస్తా మరో డంపింగ్ యార్డ్‌గా రూపాంతరం చెందింది. స్థానిక ప్రజలు తీవ్ర దుర్వాసనతో, దోమల బెడదతో నరకయాతన అనుభవిస్తున్నారు. అధికారులు, పాలకులు మారినా ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం దొరకకపోవడంతో, 22వ బీజేపీ కార్పొరేటర్ బండ రమణారెడ్డి రంగంలోకి దిగారు. 12 ఏళ్ళు నరకప్రాయంగా మారిన ప్రాంతానికి విముక్తి కల్పించడానికి కార్పొరేటర్ బండ రమణారెడ్డి సమస్యను నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ దృష్టికి తీసుకువెళ్లారు. సమస్యపై వెంటనే స్పందించిన మేయర్ కొలగని శ్రీనివాస్ చెత్తను తరలించడానికి తక్షణం చర్యలు చేపట్టాలని మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు.. ప్రధానంగా నాలుగు డివిజన్ల చెత్తను ఇక్కడే అడ్డగోలుగా పారబోస్తుండటంతో చుట్టుపక్కల కాలనీ ప్రజలు ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని స్థానిక బీజేపీ కార్పొరేటర్ బండ రమణారెడ్డి మంగళవారం రోజున ఈ చెత్తను తరలించేందుకు పూనుకున్నారు. తాత్కాలికంగా చెత్తను తరలించడం మాత్రమే కాకుండా, ఇకపై ఇక్కడ నాలుగు డివిజన్ల చెత్తను వేయకుండా మున్సిపల్ అధికారులు శాశ్వత చర్యలు చేపట్టాలని, ఈ ప్రాంతాన్ని శుభ్రంగా ఉంచాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. చెత్తను తరలించడానికి చర్యలు తీసుకున్న మేయర్ కోలగని శ్రీనివాస్ ,కార్పొరేటర్ బండ రమణారెడ్డి కి చుట్టుపక్కల కాలనీ ప్రజలు కృతజ్ఞతలు తెలియజేశారు.

# కోహిర్ మండలంలో ప్రీ–ప్రైమరీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

- అర్హులైన స్థానిక అభ్యర్థులు ఎంఈఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి
- కోహిర్ ఎంఈఓ ఎండీ. జాకిర్ హుషన్

**జహీరాబాద్ వెలుతురు, జూన్ 09:**

సంగారెడ్డి జిల్లా కోహిర్ మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ప్రీ–ప్రైమరీ తరగతుల నిర్వహణ కోసం రాష్ట్ర విద్యాశాఖ అనుమతి మంజూరు చేయడంతో ప్రతి పాఠశాలకు రెండు పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కోహిర్ మండల విద్యాధికారి ఎండీ. జాకిర్ హుషన్ తెలిపారు.



ప్రతి పాఠశాలకు ఒక ప్రీ–ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్ (బోధకుడు), ఒక ఆయా పోస్టును భర్తీ చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రీ–ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్ పోస్టుకు కనీస విద్యార్హత ఇంటర్మీడియట్ కాగా, బాల్య విద్య లేదా ప్రాథమిక బోధనలో అర్హతలు కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వబడుతుందని తెలిపారు. అలాగే బోధనలో పూర్వ అనుభవం ఉన్నవారికి అదనపు ప్రాధాన్యత ఉంటుందని చెప్పారు. ఆయా పోస్టుకు కనీస విద్యార్హత 7వ తరగతి ఉత్తీర్ణతగా నిర్ణయించినట్లు వెల్లడించారు. ఎంపిక ప్రక్రియలో వితంతు అభ్యర్థులకు ప్రాధాన్యత కల్పించనున్నట్లు తెలిపారు. దరఖాస్తుదారులు అదే గ్రామ పంచాయతీ లేదా సంబంధిత మండలానికి చెందిన వారై ఉండాలని స్పష్టం చేశారు. నోటిఫికేషన్ తేదీ నాటికి అభ్యర్థుల వయస్సు 18 నుంచి 44 సంవత్సరాల మధ్య ఉండాలని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 5 సంవత్సరాలు, మాజీ సైనికులకు 3 సంవత్సరాలు, వికలాంగులకు 10 సంవత్సరాల వయో పరిమితి సడలింపు వర్తిస్తుందని పేర్కొన్నారు. ఈ నియామకాలు పూర్తిగా తాత్కాలిక ప్రాతిపదికన చేపడుతున్నట్లు తెలిపారు. ఎంపికైన ప్రీ–ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్లకు నెలకు రూ.8,000, ఆయాలకు నెలకు రూ.6,000 గౌరవ వేతనం చెల్లించబడుతుందని, ప్రతి విద్యా సంవత్సరంలో 10 నెలలపాటు మాత్రమే ఈ గౌరవ వేతనం అందజేయబడుతుందని వివరించారు.

దరఖాస్తుల స్వీకరణ జూన్ 9, 2026 నుంచి ప్రారంభమై, మండల ఎంపిక కమిటీ ద్వారా దరఖాస్తుల పరిశీలన జూన్ 13న నిర్వహించబడుతుందని తెలిపారు. జూన్ 14న అభ్యర్థుల ఎంపిక, జూన్ 15న ఎంపికైన వారి జాబితా ప్రకటించబడుతుందని చెప్పారు. జూన్ 16 వరకు అభ్యర్థులు సంబంధిత ఎంఈఓ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించవచ్చని సూచించారు. ఖాళీల వివరాలు, ఇతర సమాచారం కోసం సంబంధిత మండల విద్యాధికారి కార్యాలయాన్ని సంప్రదించాలని ఎండీ. జాకిర్ హుషన్ కోరారు.

# హైదరాబాద్–ముంబై బుల్లెట్ ట్రైన్ మార్గం జహీరాబాద్ మీదుగానే వెళ్లాలి

- మాజీ ఎంపీ బీబీ పాటిల్‌కు కౌన్సిలర్ స్రవంతి రవికిరణ్ బృందం వినతి
- నిమ్జ్, పారిశ్రామిక అభివృద్ధి దృష్ట్యా జహీరాబాద్‌కు బుల్లెట్ ట్రైన్ స్టేషన్ అవసరం



**హైదరాబాద్ వెలుతురు జూన్ 9:**

దేశంలోని ప్రతిష్టాత్మక రైల్వే ప్రాజెక్టుల్లో ఒకటైన హైదరాబాద్–ముంబై బుల్లెట్ ట్రైన్ మార్గాన్ని జహీరాబాద్ మీదుగా మళ్లించి, ఇక్కడ ఆధునిక బుల్లెట్ ట్రైన్ స్టేషన్ ఏర్పాటు చేయాలని కోరుతూ జహీరాబాద్ మున్సిపాలిటీ 27వ వార్డు కౌన్సిలర్ నామ స్రవంతి రవికిరణ్ నేతృత్వంలోని బృందం మాజీ ఎంపీ బీబీ పాటిల్‌ను కలిసి వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా కౌన్సిలర్ స్రవంతి రవికిరణ్ మాట్లాడుతూ, జహీరాబాద్ ప్రాంతం పారిశ్రామికంగా వేగంగా అభివృద్ధి చెందుతోందని, నిమ్జ్ (NIMZ) వంటి భారీ పారిశ్రామిక ప్రాజెక్టులు ఇక్కడ ఏర్పాటు అవుతున్న నేపథ్యంలో మెరుగైన రవాణా సదుపాయాలు అత్యంత అవసరమని పేర్కొన్నారు. భవిష్యత్తులో పారిశ్రామిక, వాణిజ్య మరియు ఉపాధి అవకాశాల విస్తరణకు బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు ఎంతో దోహదపడుతుందని తెలిపారు.

గతంలో బీబీ పాటిల్ ఎంపీగా ఉన్న సమయంలో ఆయన ప్రత్యేక చొరవతో బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టులో జహీరాబాద్‌ను ఒక ముఖ్యమైన స్టేషన్‌గా చేర్చడం జరిగిందని గుర్తు చేశారు. అయితే ఇటీవల సిద్ధం చేసిన డీపీఆర్‌లో మార్పులు చేసి బుల్లెట్ ట్రైన్ మార్గాన్ని వికారాబాద్ వైపు మళ్లించాలనే ప్రతిపాదనలు రావడం పట్ల జహీరాబాద్ ప్రాంత ప్రజలు తీవ్ర నిరాశ, ఆందోళన వ్యక్తం చేస్తున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. జహీరాబాద్ ప్రాంతానికి బుల్లెట్ ట్రైన్ అనుసంధానం కల్పిస్తే పారిశ్రామిక పెట్టుబడులు పెరగడంతో పాటు ఉద్యోగ అవకాశాలు విస్తరించి, ప్రాంతీయ అభివృద్ధికి మరింత ఊతమిస్తుందని వారు వివరించారు. అందువల్ల డీపీఆర్‌లో తగిన మార్పులు చేసి ప్రాజెక్టును తిరిగి జహీరాబాద్ మీదుగా అమలు చేయాలని కోరారు. ప్రజల విజ్ఞప్తిని సానుకూలంగా స్వీకరించిన మాజీ ఎంపీ బీబీ పాటిల్, ఈ అంశాన్ని అత్యంత ప్రాధాన్యతతో తీసుకుంటానని హామీ ఇచ్చారు.

కేంద్ర రైల్వే మంత్రిని, సంబంధిత ఉన్నతాధికారులను కలిసి జహీరాబాద్ ప్రజల అభిప్రాయాన్ని వివరించి, బుల్లెట్ ట్రైన్ మార్గాన్ని తిరిగి జహీరాబాద్ మీదుగా వెళ్లేలా చేయడంతో పాటు ఇక్కడ ఆధునిక రైల్వే స్టేషన్ ఏర్పాటు కోసం కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నామ రవికిరణ్, కోహిర్ మండల యువ నాయకుడు రాచయ్య యాదవ్, నరేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా అభివృద్ధిపై మంత్రుల మేధోమథనం


- సంక్షేమ పథకాల అమలు వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశాలు
- సమావేశంలో పాల్గొన్న సెట్విన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి




**జహీరాబాద్ వెలుతురు జూన్ 9:**

సంగారెడ్డి జిల్లా సమగ్ర అభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ పథకాల సమర్థవంతమైన అమలుపై రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి మరియు జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి మంగళవారం జిల్లా అధికారులతో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా అభివృద్ధిని మరింత వేగవంతం చేయడం, ప్రభుత్వ పథకాల ఫలాలను అర్హులైన ప్రతి కుటుంబానికి చేరవేయడం లక్ష్యంగా నిర్వహించిన ఈ సమావేశంలో విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇళ్లు, మున్సిపల్ పరిపాలన, వ్యవసాయం, మిషన్ భగీరథ, సంక్షేమ హాస్టళ్లు, విద్యుత్ సరఫరా, రహదారులు, పంచాయతీరాజ్, కార్మిక శాఖల పనితీరుపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో అభివృద్ధి పనులు పారదర్శకంగా, నాణ్యతతో చేపట్టాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి లబ్ధిదారులకు త్వరితగతిన అందించాలని ఆదేశించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు. సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు మెరుగైన వసతి, ఆహార సదుపాయాలు కల్పించాలని సూచించారు. అలాగే వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధుల నివారణకు వైద్య ఆరోగ్య శాఖ ముందస్తు చర్యలు చేపట్టి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం పెంచి అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని మంత్రులు అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో పార్లమెంట్ సభ్యుడు సురేష్ కుమార్ షెట్కార్, ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి, సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ ఎన్. గిరిధర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, అదనపు కలెక్టర్ పాండు తదితర జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# అల్లోల్ – భారత్ నగర్ రహదారి పనులపై ఆర్‌టీఐ దాఖలు



- రహదారి పనుల్లో పారదర్శకత కోసం సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు
- నిధులు, టెండర్లు, బిల్లులు, పనుల పురోగతిపై పూర్తి వివరాలు కోరిన ఎర్రుపల అశోక్

**జహీరాబాద్ వెలుతురు, జూన్ 09:**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మున్సిపల్ పరిధిలోని అల్లోల్–భారత్ నగర్ రహదారి అభివృద్ధి పనులకు సంబంధించిన పూర్తి వివరాలను వెల్లడించాలని కోరుతూ బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎర్రుపల అశోక్ జహీరాబాద్ రోడ్లు & భవనాల శాఖ (ఆర్&బి) కార్యాలయంలో సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ) కింద దరఖాస్తు సమర్పించారు.రహదారి నిర్మాణానికి మంజూరైన నిధులు, టెండర్ ప్రక్రియ, జారీ చేసిన వర్క్ ఆర్డర్లు, ఇప్పటివరకు జరిగిన ఖర్చులు, చెల్లించిన బిల్లులు, పనుల పురోగతి తదితర అంశాలపై పూర్తి సమాచారాన్ని అందించాలని ఆయన ఆర్‌టీఐ దరఖాస్తులో కోరారు.ఈ సందర్భంగా ఎర్రుపల అశోక్ మాట్లాడుతూ, ప్రజల పన్నుల రూపంలో వచ్చే నిధులతో చేపట్టే అభివృద్ధి పనుల్లో పూర్తి పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలని అన్నారు. అల్లోల్–భారత్ నగర్ రహదారి పనులకు సంబంధించిన అధికారిక సమాచారాన్ని ప్రజల ముందుకు తీసుకురావడమే ఆర్‌టీఐ దాఖలు చేయడం వెనుక ప్రధాన ఉద్దేశమని తెలిపారు.ప్రభుత్వ నిధుల వినియోగం, పనుల అమలు తీరుపై ప్రజలకు స్పష్టత కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఆర్‌టీఐ ద్వారా లభించే సమాచారాన్ని ప్రజలకు వెల్లడించి, అవసరమైతే తదుపరి కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు.ప్రజాధనంతో చేపట్టే అభివృద్ధి పనులు పారదర్శకంగా, నాణ్యతతో సాగేందుకు ప్రజల పర్యవేక్షణ కూడా అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు.

## నూతన ఎమ్మార్వో సన్మానం కార్యక్రమం



**వెలుతురు నారాయణఖేడ్ జూన్ 09 :**

సంగారెడ్డి జిల్లా :– నారాయణఖేడ్ పట్టణంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నూతన ఎన్నుకోబడిన ఎమ్మార్వో గారికి సన్మానించడం జరిగింది. ఈరోజు భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నుకోబడిన ఎమ్మార్వో రాజ్ పటేల్ గారికి సన్మానించి అభినందనలు తెలపడం జరిగింది ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు.పత్రి రామకృష్ణ పట్టణ అధ్యక్షులు జి రాజశేఖర్ గౌడ్ యువమోర్చా అసెంబ్లీ కన్వీనర్ పట్న మాణిక్ మండల అధ్యక్షులు దశరథ్ శ్రీనివాస్ దశరథ్ పూసిన మాణిక్యం సాయి సగనాకర్ విశాల్ యాదవ్ తదితరులు పాల్గొనడం జరిగింది.

## బిజెపి పార్టీ బూత్ అధ్యక్షుడు సమావేశం



**వెలుతురు నారాయణఖేడ్ జూన్ 09 :**

సంగారెడ్డి జిల్లా :– నారాయణఖేడ్ పట్టణంలో ఈ రోజు బూత్ అధ్యక్షుల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో ఎన్నికల సంఘం నిర్వహించే ఎస్ ఐ ఆర్ ప్రక్రియపై చర్చించారు. ఆయా బూత్ అధ్యక్షులు తమ తమ బూత్ పరిధిలోని బి ఎల్ ఓ ల దగ్గరకు వెళ్లి ఓటర్ మ్యాపింగ్ ప్రక్రియ ఎలా జరుగుతుందో పరిశీలించాలని నిర్ణయించారు. అదే విధంగా ప్రతి బూత్‌లో డబుల్ ఓట్లు, దొంగ ఓట్లు, చనిపోయిన వారి పేర్లతో ఉన్న ఓట్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సమావేశంలో స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పట్టణంలోని బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎల్లమ్మ దేవాలయ బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న నగర మేయర్ కొలగాని శ్రీనివాస్

**కరీంనగర్ వెలుతురు జూన్ 09:**

కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని 4వ డివిజన్ దుర్షేడ్ శివారులో గల ఎల్లమ్మ దేవాలయంలో నిర్వహించిన బోనాల ఉత్సవాల్లో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ గారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజల సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు. అనంతరం మల్లన్న దేవాలయం నుండి ఎల్లమ్మ దేవాలయం వరకు ఏర్పాటు చేసిన నూతన స్ట్రీట్ లైట్లను మేయర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే నగర పాలక సంస్థ లక్ష్యమని తెలిపారు.ఈ కార్యక్రమంలో 4వ డివిజన్ కార్పొరేటర్ భూపతి రవీందర్, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, భక్తులు మరియు స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# ఇసుక కాంట్రాక్టర్ల అక్రమ వసూళ్ళని అరికట్టండి

- ఇసుక ర్యాంప్ లలో జిల్లాకో విధంగా కాంట్రాక్టర్ల ఇసుక లారీల దగ్గర వసూలు చేస్తున్నారని అట్టి వసూళ్ళని వెంటనే అరికట్టేందుకు కఠినంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేయడం జరిగింది.
- లోడింగ్ ఇతర ఖర్చులు కలిపి 2000 నుండి 2500 రూపాయలు వసూలు చేస్తున్న ఇసుక కాంట్రాక్టర్లు.
- TGMDC GM గారికి వినతిపత్రం అందజేసిన పెద్ద అంబార్ పేట ఇసుక లారీ ఓనర్స్ అసోసియేషన్



**హైదరాబాద్ వెలుతురు జూన్ 09:**

జిల్లాల వారీగా ఇసుక ర్యాంపులలో కాంట్రాక్టర్లు ఇసుక లారీల వద్ద అక్రమ వసూళ్లు చేస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో అట్టి అక్రమ వసూళ్లను వెంటనే అరికట్టాలని కోరుతూ TGMDC GM ఎల్లయ్య గారిని కలిసి వినతిపత్రం అందజేయడం జరిగింది.

లోడింగ్ మరియు ఇతర ఖర్చుల పేరుతో ఒక్కో లారీకి రూ. 2000 నుండి రూ. 2500 వరకు వసూలు చేస్తున్నారని లారీ యజమానులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు మించి అదనపు డబ్బులు వసూలు చేయడం వల్ల లారీ యజమానులు మరియు సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

అలాగే ఓవర్లోడ్ విషయంలో కఠిన చర్యలు తీసుకోవాలని, ఓవర్లోడ్‌కు సహకరిస్తున్న అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అక్రమ వసూళ్లను అరికట్టి పారదర్శక విధానాన్ని అమలు చేయాలని కోరడం జరిగింది.

ఈ కార్యక్రమంలో పెద్ద అంబార్‌పేట ఇసుక లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పోలగోని భాస్కర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి రవీందర్, ఉపాధ్యక్షులు మునుకుంట్ల బలరాం గౌడ్, పేదగోని నర్సింహా, స్వామి, శ్రీను, శేఖర్, నర్సింహా, కుమార్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# తమకు ప్రాణ రక్షణ కల్పించాలంటూ మానవ హక్కుల కమిషన్ ను ఆశ్రయించిన వృద్ధ దంపతులు



**చర్లపల్లి వెలుతురు జూన్ 09:**

చర్లపల్లి ఘట్‌కేసర్ రైల్వే మార్గంలో తన ఇద్దరు పిల్లలతో కలిసి ఆత్మహత్య చేసుకున్న సాఫ్ట్ వేర్ ఉద్యోగిని విజయరెడ్డి అత్తమామలు రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ ను ఆశ్రయించారు. చనిపోయిన తన కోడలు తల్లి , సోదరుడు నుండి తమకు తమ కుమారుడు సురేందర్ రెడ్డికి ప్రాణహాని ఉందంటూ బాధిత వృద్ధ దంపతులు భగవంత్ రెడ్డి , సులోచనలు మానవ హక్కుల కమిషన్ లో పిర్యాదు చేసారు. ఈ ఏడాది జనవరి 31న తమ కోడలు ఇద్దరు పిల్లలు ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. తన కొడుకు కష్టపడి సంపాదించిన ఆస్తిపై తమ కోడలు తల్లి పుష్ప, అన్న చిరంజీవిల కన్నుపడిందన్నారు. తన కొడుకు ఇంట్లో ఉన్న బంగారు , వెండి ఆభరణాలతో పాటు కోటిన్నర నగదు, పలు ఇంటి స్థలాల డాక్యుమెంట్ లను ఎత్తుకెళ్లారని ఆరోపించారు. వాటిని అడిగితే స్థానిక రౌడీ షీటర్ దర్గా సుధాకర్ రెడ్డి అలియాస్ మున్ని పాహిల్వాన్ తో బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై స్థానిక మేడిపల్లి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోయారు. వృద్ధులు అని చూడ కుండ రౌడీ షీటర్ దర్గా సుధాకర్ రెడ్డి తమను చంపుతానని బెదిరిస్తున్నారని తెలిపారు. తమకు రక్షణ కల్పించి... తన కొడుకు సంపాదించిన డబ్బు నగదు ఇప్పించేటట్లు పోలీసులను ఆదేశించాలని వారు కమిషన్ ను వేడుకున్నారు.

# నూతన ఎమ్మార్వో కు శుభాకాంక్షల వెల్లువ



**కూకట్ పల్లి జూన్ 09 వెలుతురు:**

కూకట్ పల్లి మండల తహశీల్దార్ (ఎమ్మార్వో) గా బాధ్యతలు చేపట్టిన అశోక్ కుమార్ కు శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. వెంకటేశ్వర నగర్ డివిజన్ పాపిరెడ్డి నగర్ బస్తి అధ్యక్షుడు ఊట్ల చంద్రారెడ్డి పలువురు బస్తి నేతలతో కలిసి మంగళవారం అశోక్ కుమార్ ను కలిసి పుష్పగుచ్ఛలను అందిస్తూ శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం బస్తి లోని సమస్యలను ఎమ్మార్వో కు వివరించారు. కార్యక్రమంలో శంకర్ రెడ్డి, రెడ్డి సత్యనారాయణ రెడ్డి, యాదగిరి , లక్ష్మణ్ , సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# “బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధిని విస్మరించడం ప్రజలను తప్పుదోవ పట్టించడమే”

**ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ వ్యాఖ్యలపై**

**మాజీ కార్పొరేటర్ రంగారావు తీవ్ర విమర్శలు**

**కూకట్ పల్లి జూన్ 9 వెలుతురు:**



శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ మియాపూర్‌లో ఇటీవల నిర్వహించిన బహిరంగ సభలో చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు తీవ్ర స్థాయిలో స్పందించారు. బీఆర్ఎస్ మాజీ కార్పొరేటర్లు, సీనియర్ నాయకులతో కలిసి మియాపూర్ లో మీడియాతో మాట్లాడిన ఆయన శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధిలో బీఆర్ఎస్ ప్రభుత్వ పాత్రను విస్మరించడం ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమని ఆరోపించారు. ఎమ్మెల్యే గాంధీ సభలో మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శేరిలింగంపల్లి అభివృద్ధికి కృషి చేశారని పేర్కొనడాన్ని రంగారావు తప్పుబట్టారు. ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు, మాజీ మంత్రి కేటీఆర్ ఆధ్వర్యంలో దాదాపు రూ.9,500 కోట్ల అభివృద్ధి పనులు జరిగాయని ప్రచారం చేస్తూ ప్రజల ఓట్లు పొందిన గాంధీ, ఇప్పుడు ఆ నాయకుల పేర్లను ప్రస్తావించకుండా మాట్లాడటం హాస్యాస్పదమని విమర్శించారు.

2014కు ముందు శేరిలింగంపల్లి పరిస్థితి ఎలా ఉందో, బీఆర్ఎస్ పాలనలో ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, లింక్ రోడ్లు, ఆధునిక మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసి ట్రాఫిక్ సమస్యలను గణనీయంగా తగ్గించామని గుర్తు చేశారు. అలాగే వేలాది కుటుంబాలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను అందించిన విషయాన్ని కూడా ఎమ్మెల్యే విస్మరించరాదన్నారు. రెండు సంవత్సరాల క్రితం కాంగ్రెస్‌లో చేరినప్పుడు అభివృద్ధి పేరుతో ప్రజలకు హామీలు ఇచ్చిన గాంధీ, ఇప్పుడు శంకుస్థాపనలను గొప్పగా చెప్పుకోవడం సమంజసం కాదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వచ్చి ఉంటే ప్రస్తుతం శంకుస్థాపన దశలో ఉన్న అనేక ప్రాజెక్టులు ఇప్పటికే ప్రారంభోత్సవాలు జరుపుకునే స్థాయికి చేరుకునేవని పేర్కొన్నారు.కేసీఆర్ తనపై నమ్మకం ఉంచి ప్రభుత్వ విప్ వంటి కీలక బాధ్యతలు అప్పగించిన విషయాన్ని గుర్తు చేస్తూ, నిజంగా తాను ప్రతిపక్షంలో ఉన్నానని భావిస్తే బీఆర్ఎస్‌లో చేరి ప్రజా సమస్యలపై కలిసి పోరాడాలని సూచించారు. ఒకవేళ కాంగ్రెస్ సిద్ధాంతాల పట్ల కట్టుబడి ఉన్నానని భావిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి ప్రజల తీర్పు కోరాలని, తిరిగి గెలిచి నాలుగోసారి ఎమ్మెల్యేనని చెప్పుకోవాలని సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ మాజీ కార్పొరేటర్లు, పార్టీ సీనియర్ నాయకులు పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలు, స్థానిక అభివృద్ధి అంశాలపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

# ఎమ్మెల్యే గారిని విమర్శిస్తే తగిన బుద్ధి చెబుతాం



**మోత్కూర్, జూన్ 9,వెలుతురు న్యూస్ :**

భువనగిరి మెయిన్ రోడ్డు రాజన్నగూడెం దగ్గర గల రోడ్డు విషయంలో బి .ఆర్. ఎస్. నాయకులు అవగాహన లేకుండా మాట్లాడడం సిగ్గుచేటు అని మోత్కూరు మున్సిపల్ ఛైర్పర్సన్ గడ్డం స్వప్న సోమనర్సయ్య,జిల్లా కాంగ్రెస్ మాజీ ఉపాధ్యక్షులు పైళ్ళ సోమిరెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు గుండగొని రామచంద్రుగౌడ్ అన్నారు. ఈరోజు R&Bగెస్ట్‌హౌస్‌లో పత్రిక సమావేశంలో వారు మాట్లాడుతూ నాటి వారి ప్రభుత్వంలో C5 కాంట్రాక్ట్ సంస్థకు 5కోట్ల 25 లక్షలకు అప్పజెప్పి ప్రభుత్వం మారాక కాంట్రాక్టర్ పనులు చేయకుండా వదిలేసి పోయిన విషయం బి .ఆర్. ఎస్. నాయకులు కప్పిపుచ్చుకొని ఈ విషయంలో స్థానిక ఎమ్మెల్యే మందుల సామెల్ గారిపై తప్పుడు ప్రచారం చేస్తూ అనుచిత వ్యాక్యలు చేస్తున్నారని అర్హత లేని వారు స్థాయికి మించి ఎమ్మెల్యే గారిని విమర్శిస్తే చూస్తూ ఊరుకునేది లేదని తగిన బుద్ధి చెబుతామని అన్నారు. మోత్కూరు లో ఏదో అలజడి సృష్టించాలని కొందరు చూస్తున్నారని అన్నారు. ప్రజాపాలన నడిపిస్తూ తుంగతుర్తి నియోజకవర్గంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతియుతంగా పాలన,సంక్షేమం, అభివృద్ధి చేస్తున్న స్థానిక బిడ్డ మందుల సామెలు అనీ అన్నారు.మోత్కూరు అభివృద్ధి లో విశాలమైన రోడ్డు వెడల్పు తో మోత్కూరు మున్సిపాలిటీ సుందరంగా తీర్చిదిద్దిన ఘనత ఎమ్మెల్యే గారికీ దక్కుతుందని గత ఎమ్మెల్యే కమిషన్ల కోసం నాసిరకపు డివైడర్,చెరువు కట్ట(మినీ ట్యాంక్ బండ్)పేరుతో దోచుకున్న ఘనులు బి .ఆర్. ఎస్. పాలకులని అన్నారు. నిరుపేదలకు రేషన్ కార్డులు, గ్యాస్ సబ్సిడీ,ఉచిత విద్యుత్,మహిళలకు ఉచిత బస్,రైతు రుణాలు మాఫీ,రైతులకు బోనస్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి దక్కుతుందని ప్రజా ప్రభుత్వం పై తప్పుడు ప్రచారం చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కారుపోతుల వెంకన్న, యూత్ కాంగ్రెస్ జిల్లా మాజీ కార్యదర్శి మందుల సురేష్, మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు ముద్దం జయశ్రీ, అన్నెపు పద్మ, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఎడ్ల శ్రీను, కుర్మిల్ల రాములు,సోషల్ మీడియా కన్వీనర్లు పాలోజు శేఖర చారి బందెల రవి తదితరులు ఉన్నారు.

# కేరళ సీఎంవోను కుదిపేస్తున్న వీణా విజయన్ కేసు

- పినరయి విజయన్ కుమార్తెకు ఈడీ సమన్లు
- సీఎంఆర్ఎల్-ఎక్సాలాజిక్ ఆర్థిక లావాదేవీలపై విచారణ వేగం
- కొచ్చిలో జూన్ 12న ఈడీ ఎదుట హాజరు కావాల్సిన వీణా
- మరో తొమ్మిది మందికి కూడా నోటీసులు
- ఐటీ సేవలు లేకుండానే కోట్ల రూపాయల చెల్లింపుల ఆరోపణలు
- మనీలాండరింగ్ కోణంలో దర్యాప్తు చేస్తున్న ఈడీ
- కంపెనీల చట్టం కింద ఎస్ఎఫ్ఐఓ కేసు నమోదు
- హైకోర్టులో సీఎంఆర్ఎల్‌కు ఎదురుదెబ్బ
- కేరళ రాజకీయాల్లో మళ్లీ వేడెక్కిన చర్చ

**కేరళ వెలుతురు జూన్ 09:**

కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ కుటుంబాన్ని చుట్టుముట్టిన సీఎంఆర్ఎల్–ఎక్సాలాజిక్ ఆర్థిక లావాదేవీల కేసు మరింత కీలక దశకు చేరుకుంది. ఈ కేసులో ముఖ్యమంత్రి కుమార్తె వీణా విజయన్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సమన్లు జారీ చేయడం రాష్ట్ర రాజకీయాల్లో సంచలనంగా మారింది. జూన్ 12న కొచ్చిలోని ఈడీ ప్రాంతీయ కార్యాలయంలో విచారణకు హాజరుకావాలని ఆమెకు ఆదేశాలు జారీ అయ్యాయి.

ఈ కేసు మూలాలు వీణా విజయన్‌కు చెందిన ఎక్సాలాజిక్ సొల్యూషన్స్ అనే ఐటీ కన్సల్టెన్సీ సంస్థ వరకు వెళ్తాయి. ఈ సంస్థ, ప్రైవేట్ మైనింగ్ రంగానికి చెందిన సీఎంఆర్ఎల్‌తో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకుంది. ఒప్పందం ప్రకారం ఎక్సాలాజిక్‌కు భారీ మొత్తంలో చెల్లింపులు జరిగాయి.

అయితే ఆ చెల్లింపులపై అనుమానాలు వ్యక్తం కావడంతో వివిధ దర్యాప్తు సంస్థలు రంగంలోకి దిగాయి. లభ్యమైన పత్రాల ప్రకారం సీఎంఆర్ఎల్ సంస్థ నుంచి ఎక్సాలాజిక్‌కు రూ.1.72 కోట్ల నుంచి రూ.2.78 కోట్ల వరకు నిధులు బదిలీ అయినట్లు గుర్తించారు. కానీ అందుకు ప్రతిఫలంగా ఎలాంటి ఐటీ సేవలు అందించలేదని దర్యాప్తులో తేలినట్లు అధికారులు చెబుతున్నారు.

ఆదాయపు పన్ను శాఖ ఈ వ్యవహారాన్ని పరిశీలించిన అనంతరం, ఈ చెల్లింపులు సాధారణ వ్యాపార లావాదేవీలుగా కనిపించడం లేదని అభిప్రాయపడింది. ముఖ్యమంత్రి కుటుంబంతో ఉన్న సంబంధాల కారణంగానే ఈ నిధులు బదిలీ అయ్యి ఉండవచ్చని తన పరిశీలనలో పేర్కొంది.

దీంతో కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల శాఖ పరిధిలో పనిచేసే సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్ ప్రత్యేక దర్యాప్తు ప్రారంభించింది. కంపెనీల చట్టంలోని నిబంధనల ఉల్లంఘనలపై కేసు నమోదు చేసి సంబంధిత ఆర్థిక రికార్డులను పరిశీలించింది. సంస్థల మధ్య ఒప్పందాల నిజస్వరూపం, చెల్లింపుల అవసరం, సేవల అమలు వంటి అంశాలను పరిశోధించింది.

అదే సమయంలో ఈ వ్యవహారంలో అక్రమ ధన ప్రవాహం జరిగిందా అనే కోణంలో ఈడీ కూడా విచారణ మొదలు పెట్టింది. పీఎంఎల్ఏ చట్టం కింద నమోదు చేసిన కేసులో ఆర్థిక లావాదేవీల మార్గం, డబ్బు వినియోగం, లబ్ధిదారుల పాత్రలను విశ్లేషిస్తోంది.

ఈడీ చర్యలను సవాలు చేస్తూ సీఎంఆర్ఎల్ సంస్థ కేరళ



హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. అయితే హైకోర్టు ఈడీ దర్యాప్తును అడ్డుకునే పరిస్థితి లేదని స్పష్టం చేసింది. పిటిషన్‌ను కొట్టివేస్తూ విచారణ కొనసాగించడానికి అనుమతించింది.

న్యాయస్థానం నిర్ణయం తర్వాత దర్యాప్తు వేగం పెరిగింది. తిరువనంతపురంలో వీణా విజయన్ కుటుంబానికి సంబంధించిన అద్దె నివాసం సహా పలు ప్రాంతాల్లో సోదాలు జరిగాయి. బ్యాంకు లావాదేవీలు, డిజిటల్ పరికరాలు, కంపెనీ రికార్డులు, ఒప్పంద పత్రాలు తదితరాలను అధికారులు పరిశీలించినట్లు సమాచారం.

తాజాగా సమన్లు జారీ కావడంతో వీణా విజయన్ నేరుగా ఈడీ విచారణను ఎదుర్కోనున్నారు. ఆమె వాంగ్మూలం కేసులో కీలకంగా మారే అవకాశం ఉందని న్యాయ నిపుణులు భావిస్తున్నారు. చెల్లింపుల వెనుక వ్యాపార కారణాలు, సేవల స్వరూపం, నిధుల వినియోగంపై ఆమె వివరణ కోరే అవకాశం ఉంది.

ఈ వ్యవహారం కేరళ రాజకీయాల్లో తీవ్ర ప్రభావం చూపుతోంది. ప్రతిపక్ష పార్టీలు ముఖ్యమంత్రి నైతిక బాధ్యత వహించాలని డిమాండ్ చేస్తుండగా, అధికార వర్గాలు కేసు రాజకీయ ప్రేరేపితమని ఆరోపిస్తున్నాయి. ఏదేమైనా జూన్ 12న జరిగే ఈడీ విచారణ తర్వాత కేసు మరింత కీలక మలుపు తిరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# నిజాంపేట్ SNDP పనులపై విజిలెన్స్ విచారణ జరపాలి

**కుత్బుల్లాపూర్ వెలుతురు ప్రతినిధి జూన్ 09:**

అప్పటి కార్పొరేటర్లు కమిషన్లకు కక్కుర్తి పడి ఎస్ ఎన్ డి పి పనులు చేయడం ద్వారా ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ లో ఎస్ ఎన్ డి పి పనుల నాణ్యత ప్రమాణాలలో లోపంతో పాటు నాలాల నిర్మాణం అనేది ఒక క్రమబద్ధంగా జరగడం లేదని అప్పుడున్న కమిషనర్ తో పాటుగా అధికారులకు ఎంత మొరపెట్టుకున్నా కూడా అసంబద్ధంగా పనులు పూర్తి చేయడమే కాకుండా కొన్ని పనులను మధ్యలోనే ఆపివేయడం ద్వారా ప్రజాధనం వృధా అవ్వడమే కాకుండా మళ్లీ వర్షం పడితే ఎక్కడ నీళ్లు అక్కడే ఆగి ఉండడం ద్వారా బండారి లేఔట్ కాలనీ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు కార్పొరేటర్లుగా పదవిలో ఉన్నప్పుడు కమిషన్ల కుక్కడి ఇప్పటి ముప్పడిగా పనులు అసంపూర్తిగా పూర్తి చేయడం వలన ఈ పరిస్థితి దాపురించిందని అలాగే ఎస్ ఎన్ డి పి పనుల నిమిత్తం దాదాపు నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ నుండి ప్రజలు చెల్లించిన పన్నుల ద్వారా వసులైన 30 కోట్లు కార్పొరేషన్ చెల్లించడం పై కమిషన్ల రూపంలో అధికారులు ప్రజాప్రతినిధులు చేతులు మారాయని భారతీయ జనతా పార్టీ తరపున క్షేత్రస్థాయిలో పర్యటించి పలుమార్లు నిరసన తెలుపడం కాకుండా విచారణకు డిమాండ్ డిమాండ్ చేయడం జరిగిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు.అప్పటి నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో తొమ్మిది ప్రాంతాల్లో ఎస్ ఎన్ డి పి దాదాపు 150 కోట్ల వ్యయంతో టెండర్లు ఖరారు చేసి, నాసిరకం పనులతో కొంతవరకు పూర్తిచేసి మిగిలిన చోట పనులు పూర్తికాకుండానే డబ్బులు కూడా చెల్లించారని బండారి లేఔట్ రోడ్ నెంబర్ 1 నుండి 10 వరకు వచ్చే వరద నీరు బాక్స్ కాలం నుండా వెళ్లేట్టు చేయకుండా సగం సిమెంట్ పైపులతో వేయడం, ఎస్ ఎన్ డి పి నాలాకు డ్రైనేజీ పైప్ లైన్ కూడా కలపడం ద్వారానే ప్రస్తుతం చిన్న వర్షానికి



రోడ్డుపైన వరద పొంగిపొర్లుతుందని మొన్నటివరకు పదవులు అనుభవించిన కార్పొరేటర్లు ఇప్పుడు ప్రజా సమస్యల పైన నిరసన కూడా తెలియజేస్తున్నారని ఇది మీరు చేసిన తప్పిదాలు కమిషన్ల కుక్క కక్కుర్తి పడడం వలన ఎస్ ఎన్ డి పి పనులు అసంపూర్తిగా పూర్తయ్యాయని జీవో నెంబర్ 286/2021(MAUD) ప్రకారం sndpకి సంబంధించిన 851 కోట్ల పైచిలుకు రాష్ట్ర ప్రభుత్వం జిహెచ్ఎంసికి ద్వారా ఈ ప్రాజెక్టును చేపట్టాలని స్పష్టంగా పేర్కొన్న, నిజాంపేట్ కార్పొరేషన్ నుండి 30 కోట్లు ఇప్పించిన ప్రస్తుత హ్యాట్రిక్ ఎమ్మెల్యే గారు 30 కోట్లు వెనక్కి ఇప్పించాలని డిమాండ్ చేశారు.

అంతేకాకుండా కార్పోరేషన్ నుండి 30 కోట్లు కాంట్రాక్టు చెల్లించడంలో కమిషన్లు చేతులు మారాయని దీనికి బాధ్యులు ఆప్పటి కమిషనరే వంశీకృష్ణ అని, ప్రస్తుతం టిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు 50 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేసినట్టుగా వివిధ పత్రికలలో కూడా ప్రచారం అయ్యాయని ఇప్పటికైనా సంబంధిత కాంట్రాక్టర్ పైన అధికారుల పైన అప్పుడు అధికారంలో ఉన్న కార్పొరేటర్ల పైన విజిలెన్స్ కమిషన్ జరిపి నిజాలు బయట పెట్టడమే కాకుండా రాబోయే వర్షాకాలం దృష్టిలో పెట్టుకొని అధికారులు చదివిన చర్యలు వెంటనే తీసుకోవాలని భారతీయ జనతా పార్టీ నిజాంపేట మరియు బండారి లేఅవుట్ అధ్యక్షులు బిక్షపతి యాదవ్ డిమాండ్ చేశారు.

# నరేంద్ర మోదీ 2026

**డాక్టర్ కరణ్ సింగ్**

భారత ప్రజాస్వామ్య ప్రస్థానంలో 2026 జూన్ 10న ఒక విశేషమైన ఘట్టం నమోదు కానుంది. దేశ చరిత్రలోనే అత్యంత సుదీర్ఘకాలం ప్రధాన మంత్రిగా నిర్విరామంగా సేవలందించిన నాయకుడిగా శ్రీ నరేంద్ర మోదీ నిలవనున్నారు. తనకంటే ముందు పనిచేసిన ప్రధానమంత్రులు అందరి కంటే కూడా అత్యధిక రోజులు ఆయన అంతరాయం లేకుండా అధికారంలో కొనసాగారు. దాదాపు స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి నేను ప్రజా జీవితంలో భాగస్వామిగా ఉన్నందున గతంలో సుదీర్ఘకాలం పనిచేసిన ఇద్దరు ప్రధానమంత్రులతో చాలా సన్నిహితంగా మెలిగే అవకాశం నాకు లభించింది.

నా మార్గదర్శి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ. వలసవాదం, పేదరికం, దేశ విభజన, మతపరమైన మారణహోమాల నుంచి అప్పుడప్పుడే కోలుకుంటున్న ఒక గాయపడిన నాగరికత ఆయనకు వారసత్వంగా లభించింది. ఒక సువిశాలమైన, వైవిధ్యభరితమైన ఉపఖండాన్ని ఒక సజావుగా పనిచేసే ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యంగా మార్చడమే ఆయన సాధించిన గొప్ప విజయం. ఇక శ్రీమతి ఇందిరా గాంధీ విషయానికి వస్తే నేను ఆమె క్యాబినెట్‌లో పదేళ్లపాటు మంత్రిగా పనిచేశాను. బంగ్లాదేశ్ ఆవిర్భావంలో ఆమె సాధించిన అత్యున్నత విజయాన్ని, అత్యవసర పరిస్థితి నాటి ఆమె చీకటి రోజులను... రెండింటినీ నేను ప్రత్యక్షంగా చూశాను. ప్రధానమంత్రిగా ఆమె మొత్తం పదవీ కాలాన్ని అధిగమించడమే శ్రీ నరేంద్ర మోదీ ముందున్న తదుపరి సవాలు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఖాతాలో చెప్పుకోదగ్గ ఎన్నో గొప్ప విజయాలు ఉన్నాయి. జవహర్‌లాల్ నెహ్రూ కాలం నాటి భారత్‌తో పోలిస్తే ఆయనకు వారసత్వంగా లభించిన దేశం పూర్తిగా భిన్నమైనది. దేశ జనాభా దాదాపు 34 కోట్ల నుంచి దాదాపు 146 కోట్లకు పెరగగా ఓటర్ల సంఖ్య సుమారు 11 కోట్ల నుంచి 83 కోట్లకు పైకి చేరుకుంది. తన పార్టీని వరుసగా మూడుసార్లు పార్లమెంటరీ ఎన్నికలలో విజయపథంలో నడిపించటమే ఒక అద్భుతమైన రాజకీయ ఘనత. ఒకవేళ ఆయన తదుపరి సార్వత్రిక ఎన్నికల్లో కూడా విజయం సాధిస్తే భారత రాజకీయాల్లో మరెవ్వరికీ సాధ్యం కాని మరొక సరికొత్త రికార్డును నెలకొల్పుతారు.

నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రపంచంలోనే అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా భారత్ తన స్థానాన్ని నిలబెట్టుకుంది. కోవిడ్-19 మహమ్మారి సృష్టించిన అడ్డంకులు, ప్రపంచవ్యాప్త ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు, భౌగోళిక రాజకీయ సంఘర్షణలు, సరఫరా గొలుసు అంతరాయాలు ఎదురైనప్పటికీ దేశం బలమైన ఆర్థిక వృద్ధిని కొనసాగించింది. టెలివిజన్, డిజిటల్ మీడియా, సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల ద్వారా మునుపెన్నడూ లేని విధంగా ప్రతి క్షణం నిశిత పరిశీలన జరిగే ఈ ఆధునిక యుగంలో ఆయన పాలన సాగించారు. స్వచ్ఛ భారత్, గ్రామీణ పారిశుద్ధ్య విస్తరణ, మహిళల కోసం స్వచ్ఛమైన వంట గ్యాస్, గ్రామీణ విద్యుదీకరణ, పేదల కోసం గృహ నిర్మాణ కార్యక్రమాలు, సౌరశక్తి రంగానికి ఊతం, కోట్ల మంది ప్రజలకు ప్రయోజనం చేకూరుస్తున్న ఆహార భద్రత చర్యలతో కూడిన ఆయన సామాజిక సంక్షేమ పథకాలు సామాన్య భారతీయుల జీవితాలపై గణనీయమైన ప్రభావాన్ని చూపాయి. అందువల్లే ఇవి మోదీ ప్రభుత్వానికి దక్కిన అత్యంత చెప్పుకోదగ్గ విజయాలుగా నిలిచాయి.

విద్యా, ఆరోగ్య సంరక్షణ సంస్థల విస్తరణ కూడా ఈ కాలంలో ఎంతో చెప్పుకోదగ్గదిగా నిలిచింది. దేశంలోనే మొట్టమొదటి ఐఐటీలు, ఎయిమ్స్‌లను జవహర్‌లాల్ నెహ్రూ స్థాపించారు. నరేంద్ర మోదీ నాయకత్వంలో ఐఐటీలు, ఎయిమ్స్‌లు, ఐఐఎంల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఈ విద్యాసంస్థలు భారతదేశ మానవ వనరుల అభివృద్ధికి చేసిన భారీ పెట్టుబడిగా నిలవడమే కాకుండా దేశంలో పెరుగుతున్న వృత్తిపరమైన, శాస్త్రీయ, మేధోపరమైన ఆకాంక్షలను ప్రతిబింబిస్తున్నాయి. మౌలిక సదుపాయాల అభివృద్ధి కూడా ఈ కాలంలో ఒక ముఖ్యమైన అంశంగా నిలిచింది. రహదారుల వేగవంతమైన విస్తరణ, విమానాశ్రయాల నిర్మాణం, రైల్వేల ఆధునికీకరణ, డిజిటల్ అనుసంధానత, ప్రజా మౌలిక సదుపాయాల కల్పన వంటివి దీర్ఘకాలిక ఆర్థిక వృద్ధికి బలమైన పునాది వేయడానికి ఉద్దేశించినవి. ఆయన అనుసరించిన అన్ని విధానాలతో ప్రతి ఒక్కరూ ఏకీభవించినా, ఏకీభవించకపోయినా... ఈ ప్రాజెక్టుల అమలుకు ఉన్న స్థాయి మాత్రం అత్యంత భారీగా ఉందనేది వాస్తవం.

పెద్ద నోట్ల రద్దు, ఆర్టికల్ 370 రద్దు వంటి ఆయన తీసుకున్న కొన్ని నిర్ణయాలు నిస్సందేహంగా వివాదాస్పదమయ్యాయి. ఒక ప్రజాస్వామ్య దేశంలో ఇటువంటి పెద్ద పెద్ద విధానపరమైన నిర్ణయాలపై ఎల్లప్పుడూ ఇరుపక్షాల నుంచి అనుకూలంగా, ప్రతికూలంగా బలమైన అభిప్రాయాలు వ్యక్తమవుతుంటాయి. అయితే నరేంద్ర మోదీ తాను ప్రకటించిన లక్ష్యాలను సాధించడంలో తనకున్న పట్టుదల, దృఢ సంకల్పాన్ని నిరూపించుకున్నారు.

విదేశాంగ వ్యవహారాలలో కూడా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీలకమైన కార్యక్రమాలను చేపట్టారు. ఆయన విస్తృత అంతర్జాతీయ పర్యటనలు, దౌత్య సంబంధాలు ప్రపంచంలోని అగ్రరాజ్యాలతో పాటు అభివృద్ధి చెందుతున్న దేశాలతో కూడా భారత్ సంబంధాలను బలోపేతం చేశాయి. దేశానికి పెరుగుతున్న దౌత్యపరమైన పరపతి, గ్లోబల్ సౌత్‌లో



నాయకత్వ పాత్ర, అంతర్జాతీయ వేదికలపై పెరిగిన ప్రాధాన్యత... ప్రపంచవ్యాప్తంగా దేశ ప్రతిష్టను మరింత పెంచాయి. ముఖ్యంగా గల్ఫ్ దేశాలతో ఆయన చేపట్టిన దౌత్య సంప్రదింపులు ఎంతో ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. భారత్ లౌకికవాదం నుంచి పక్కకు తప్పుకుంటోందనే ఆందోళన ఆ దేశాల్లో ఉన్నప్పటికీ మన దేశానికి వ్యూహాత్మకంగా, ఆర్థికంగా ఎంతో కీలకమైన ఆ ప్రాంతంతో సంబంధాలను మరింత బలోపేతం చేసేందుకు ఇవి దోహదపడ్డాయి. దీనికి నేను ఒకటి చెప్పాలనుకుంటున్నాను... మన రాజ్యాంగ ప్రవేశికలో 'లౌకిక వాదం' అనే పదం చేర్చినప్పటికీ దురదృష్టవశాత్తూ అది కాలక్రమేణా 'హిందూ వ్యతిరేక' భావనను సంతరించుకుంది. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పును అనుసరించి అయోధ్యలో శ్రీ రామ మందిరం నిర్మాణం జరగడం ఆయన పదవీ కాలంలో సాధించిన ఒక అతిపెద్ద విజయం. కోట్ల మంది భారతీయులకు ఇది సుదీర్ఘకాలంగా నలుగుతున్న ఒక సాంస్కృతిక, నాగరికత సంబంధిత సమస్యకు లభించిన శాశ్వత పరిష్కారంగా నిలిచింది.

'భారత్‌లోని విస్తృత ప్రజానీకంతో నేరుగా మమేకమవ్వడం, దేశ భవిష్యత్తుపై వారిలో నమ్మకాన్ని నింపగలగడం' అనేవి బహుశా నరేంద్ర మోదీ అందించిన అత్యంత శాశ్వతమైన సహకారాలు. భారత్ తనను తాను కేవలం ఒక అభివృద్ధి చెందుతున్న దేశంగానే కాకుండా పెరుగుతున్న ఆర్థిక, సాంకేతిక, వ్యూహాత్మక ప్రభావంతో ఎదుగుతున్న ఒక ప్రపంచ శక్తిగా చూసుకుంటున్న కాలంతో ఆయన నాయకత్వం ముడిపడి ఉంది. మరిన్ని వివరాల్లోకి వెళ్లకుండా ఒక్క మాటలో చెప్పాలంటే... అనేక జాతీయ, అంతర్జాతీయ సవాళ్లను ఎదుర్కొన్నప్పటికీ నరేంద్ర మోదీ ఒక ప్రతిష్ఠాత్మకమైన మార్పుల ఎజెండాను ముందుకు తీసుకెళ్తూనే ప్రజాస్వామ్య పాలనను విజయవంతంగా కాపాడగలిగారు. అయితే ముందున్న సవాళ్లు ఇంకా చాలా పెద్దగా ఉన్నాయి. అవే భారతదేశ సమాఖ్య నిర్మాణాన్ని బలోపేతం చేయడం, విద్యా ప్రమాణాలను మెరుగుపరచడం, యువతకు ఉపాధి అవకాశాలను సృష్టించడం, పర్యావరణ సమస్యలను పరిష్కరించడం, అందరినీ కలుపుకొనిపోయే సమగ్ర వృద్ధిని నిర్ధారించడం. ఎవరి రాజకీయ విశ్వాసాలు ఎలా ఉన్నప్పటికీ నరేంద్ర మోదీ భారతీయ రాజకీయాల రూపురేఖలను పూర్తిగా మార్చేశారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి గత దశాబ్ద కాలంలో ఆయన చేసినట్లుగా ఓటర్లతో అంతటి ప్రత్యక్ష సంబంధాన్ని ఏర్పరచుకున్న లేదా జాతీయ స్థాయి చర్చను అంతగా ప్రభావితం చేసిన నాయకులు చాలా కొద్దిమంది మాత్రమే ఉన్నారు.

భారత్ అభివృద్ధి తదుపరి దశలోకి ప్రవేశిస్తున్న తరుణంలో ఈ పనులను పూర్తి చేయడానికి వివేకం, ఓర్పు, జాతీయ ఏకాభిప్రాయం అవసరమవుతాయి. స్వాతంత్ర్యోద్యమ వేకువజాము నుంచి భారత్ ప్రస్థానాన్ని ప్రత్యక్షంగా చూసిన ఒక వ్యక్తిగా రాబోయే సంవత్సరాల్లో మన దేశం కేవలం అధికారం, సంపదల్లోనే కాకుండా వివేకం, కరుణ, జాతీయ ఐక్యతలో కూడా ఎదుగుతుందని నేను ఆశిస్తున్నాను. ఆ సువిశాలమైన ప్రయత్నంలో పార్టీ రాజకీయాలకు అతీతంగా ప్రధానమంత్రి దేశానికి సేవ చేయడంలో విజయం సాధించాలని మనమందరం ఆకాంక్షిద్దాం.

**(రచయిత మాజీ పార్లమెంట్ సభ్యులు)**

# గ్రేట్ నికోబార్‌లో ఎయిర్‌పోర్ట్.. కేంద్రం గ్రీన్ సిగ్నల్

- **రూ.13 వేల కోట్లతో విమానాశ్రయ నిర్మాణానికి కేంద్ర అనుమతి**
- **పౌర-సైనిక అవసరాలకు సంయుక్త విమానాశ్రయం నిర్మాణం**
- **చింగెన్ ప్రాంతంలో కొత్త ఎయిర్‌పోర్ట్ ఏర్పాటు**
- **ఐఎన్ఎస్ బాజ్ విస్తరణ ప్రణాళికకు కేంద్రం స్వస్తి**
- **రూ.81 వేల కోట్ల గ్రేట్ నికోబార్ ప్రాజెక్టులో కీలక ముందడుగు**

**అండమాన్-నికోబార్ వెలుతురు జూన్ 09:**

అండమాన్-నికోబార్ దీవుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ప్రతిష్ఠాత్మక గ్రేట్ నికోబార్ ఐలాండ్ (జీఎన్ఐ) ప్రాజెక్టుకు మరో కీలక ముందడుగు పడింది. గ్రేట్ నికోబార్‌లో ప్రతిపాదిత పౌర-సైనిక విమానాశ్రయ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది. సుమారు రూ.13 వేల కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఈ విమానాశ్రయం దేశ భద్రతా అవసరాలతో పాటు పౌర విమానయాన రంగానికి కూడా కీలకంగా మారనుంది.

గ్రేట్ నికోబార్ అభివృద్ధి ప్రాజెక్టులో భాగంగా గలాథియా బే సమీపంలోని చింగెన్ ప్రాంతంలో ఈ విమానాశ్రయాన్ని నిర్మించనున్నట్లు సమాచారం. పౌర విమానాల రాకపోకలతో పాటు భారత సాయుధ దళాల అవసరాలకు కూడా ఇది ఉపయోగపడేలా ప్రణాళిక రూపొందించారు. దీంతో ఈ ప్రాంతంలో భారత వ్యూహాత్మక సామర్థ్యం మరింత పెరిగే అవకాశం ఉందని రక్షణ రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికే గ్రేట్ నికోబార్‌లో భారత నౌకాదళానికి చెందిన ఐఎన్ఎస్ బాజ్ ఎయిర్‌స్టేషన్ ఉంది. గతంలో ఈ ఎయిర్‌స్టేషన్ రన్‌వేను విస్తరించి పెద్ద విమానాలను నడిపేలా అభివృద్ధి చేయాలనే ఆలోచన ఉన్నప్పటికీ, భౌగోళిక పరిమితుల కారణంగా ఆ ప్రణాళికను విరమించుకున్నట్లు తెలుస్తోంది. దీంతో కొత్తగా భారీ విమానాశ్రయ నిర్మాణానికి కేంద్రం మొగ్గుచూపింది.

విమానాశ్రయం నిర్మాణం పూర్తయితే గ్రేట్ నికోబార్ దీవి అంతర్జాతీయ స్థాయిలో మరింత ప్రాధాన్యం సంతరించుకోనుంది. రానున్న ఐదేళ్లలో ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తయ్యే అవకాశాలు ఉన్నట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

గ్రేట్ నికోబార్ దీవి ప్రపంచంలో అత్యంత కీలకమైన సముద్ర మార్గాల్లో ఒకటైన మలక్కా జలసంధికి అత్యంత సమీపంలో ఉంది. ఆసియా-యూరప్ దేశాల మధ్య జరిగే సముద్ర వాణిజ్యంలో మలక్కా జలసంధి కీలక పాత్ర పోషిస్తోంది. ముఖ్యంగా చైనాకు అవసరమైన సుమారు 80 శాతం చమురు, 70 శాతం సహజవాయువు ఈ జలసంధి మీదుగానే రవాణా అవుతున్నట్లు రక్షణ రంగ వర్గాలు పేర్కొంటున్నాయి.

ఈ నేపథ్యంలో గ్రేట్ నికోబార్‌లో యుద్ధనౌకలు, సైనిక విమానాల కార్యకలాపాలకు అనువైన మౌలిక సదుపాయాలు ఉండటం భారత్‌కు వ్యూహాత్మకంగా ఎంతో కీలకమని నిపుణులు చెబుతున్నారు. సముద్ర నిఘా, భద్రతా కార్యకలాపాలు, అత్యవసర సైనిక స్పందన వ్యవస్థలకు ఈ ప్రాజెక్టు బలాన్ని చేకూర్చనుంది.

అయితే గ్రేట్ నికోబార్ ఐలాండ్ అభివృద్ధి ప్రాజెక్టుపై ప్రారంభం నుంచే వివాదాలు కొనసాగుతున్నాయి. సుమారు రూ.81 వేల కోట్ల వ్యయంతో చేపడుతున్న ఈ ప్రాజెక్టు కింద విమానాశ్రయం, నౌకాశ్రయం, విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, పట్టణ మౌలిక వసతులు వంటి పలు అభివృద్ధి పనులను ప్రభుత్వం ప్రతిపాదించింది. అండమాన్-నికోబార్ దీవులను ఆర్థిక, వాణిజ్య, వ్యూహాత్మక కేంద్రంగా అభివృద్ధి చేయడమే దీని లక్ష్యమని కేంద్రం చెబుతోంది.

అయితే పర్యావరణవేత్తలు, ప్రతిపక్ష పార్టీలు ఈ ప్రాజెక్టుపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయి. ఈ ప్రాజెక్టు అమలుతో భారీ స్థాయిలో అటవీ ప్రాంతాలు నష్టపోతాయని, అరుదైన జీవవైవిధ్యంపై ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. లక్షలాది చెట్లను తొలగించాల్సి వస్తుందని, ఇది పర్యావరణానికి తీవ్ర నష్టం కలిగిస్తుందని విమర్శిస్తున్నాయి.



# స్టీల్ ప్లాంట్ బాధితులకు లోకేశ్ పరామర్శ

- **కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా**
- **విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాద బాధితులను పరామర్శించిన మంత్రులు**
- **కేజీహెచ్‌లో బాధిత కుటుంబాలతో మాట్లాడిన నారా లోకేశ్**
- **ధైర్యంగా ఉండాలని కుటుంబ సభ్యులకు సూచన**
- **కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని విధాలా ఆదుకుంటాయని హామీ**
- **బాధితులకు జీవితాంతం అండగా ఉంటామని స్పష్టీకరణ**
- **కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మతో కలిసి పరామర్శ**
- **ప్రమాదానికి గల కారణాలపై కమిటీ విచారణ కొనసాగుతోంది**
- **నివేదిక వచ్చిన తర్వాత బాధ్యులపై చర్యలు తీసుకుంటామని వెల్లడి**
- **విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కాపాడేందుకు అందరం కలిసి పోరాడామని గుర్తుచేసిన లోకేశ్**
- **కిమ్స్ ఐకాన్ ఆసుపత్రిలో క్షతగాత్రులను పరామర్శించిన మంత్రి సుభాష్**



**విశాఖపట్నం వెలుతురు జూన్ 09:**

విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌లో సోమవారం చోటుచేసుకున్న ఘోర ప్రమాదం రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర విషాదాన్ని నింపిన నేపథ్యంలో బాధిత కుటుంబాలను పరామర్శించేందుకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ ప్రతినిధులు ఆసుపత్రికి చేరుకున్నారు. ప్రమాదంలో ఎనిమిది మంది కార్మికులు ప్రాణాలు కోల్పోగా, మరో ఆరుగురు తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం విశాఖపట్నంలోని కింగ్ జార్జ్ ఆసుపత్రి (కేజీహెచ్)లో చికిత్స పొందుతున్న బాధిత కుటుంబ సభ్యులను రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ పరామర్శించారు.

ఈ సందర్భంగా రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత, మంత్రి సంధ్యారాణి, కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, విశాఖపట్నం ఎంపీ శ్రీభరత్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, పార్టీ నేత చింతకాయల విజయ్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు కూడా ఆసుపత్రికి చేరుకుని బాధితులను ఓదార్చారు.

ప్రమాదంలో మృతిచెందిన కార్మికుల కుటుంబ సభ్యులను నారా లోకేశ్ ప్రత్యేకంగా కలుసుకుని వారి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రమాదం ఎలా జరిగిందనే విషయంపై కుటుంబ సభ్యుల నుంచి వివరాలు సేకరించారు. ఈ విషాద సమయంలో ధైర్యంగా ఉండాలని వారికి సూచించారు. ప్రభుత్వం మీకు అండగా ఉంటుందని, ఎలాంటి ఆందోళన చెందవద్దని భరోసా కల్పించారు.

అనంతరం మీడియాతో మాట్లాడిన లోకేశ్.. ప్రమాదంలో మృతిచెందిన కార్మికుల కుటుంబాలకు, గాయపడిన బాధితులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. బాధితులను పరామర్శించి వారికి మద్దతు తెలియజేయడానికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రతినిధులు ఆసుపత్రికి వచ్చారని తెలిపారు. ఇది కేవలం పరామర్శ మాత్రమే కాదని, బాధిత కుటుంబాల వెన్నంటే నిలబడతామనే నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు.

బాధిత కుటుంబాలకు జీవితాంతం అండగా ఉంటామని లోకేశ్ స్పష్టం చేశారు. ప్రమాదం వల్ల కుటుంబ పెద్దలను కోల్పోయిన వారికి ప్రభుత్వం అండగా నిలిచి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. ప్రమాద బాధితుల పట్ల ప్రభుత్వం పూర్తి బాధ్యతతో వ్యవహరిస్తోందని చెప్పారు.

విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రాధాన్యతను ప్రస్తావించిన లోకేశ్.. ఈ సంస్థను కాపాడుకోవడానికి రాష్ట్ర ప్రజలు, కార్మిక సంఘాలు, రాజకీయ పార్టీలు, కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ఎన్నో పోరాటాలు చేశాయని గుర్తు చేశారు. అందరి కృషి వల్లే విశాఖ స్టీల్ ప్లాంట్ కొనసాగుతోందని అన్నారు. అలాంటి కీలక పరిశ్రమలో జరిగిన ప్రమాదం బాధాకరమని వ్యాఖ్యానించారు.

ప్రమాద ఘటనపై ఇప్పటికే ప్రత్యేక కమిటీని ప్రభుత్వం నియమించినట్లు ఆయన తెలిపారు. ప్రమాదానికి దారితీసిన కారణాలు, భద్రతా ప్రమాణాల అమలు, యాజమాన్య బాధ్యతలు, సాంకేతిక లోపాలు తదితర అంశాలను కమిటీ సమగ్రంగా పరిశీలిస్తుందని చెప్పారు. కమిటీ నివేదిక అందిన తర్వాత బాధ్యులెవ్వరైనా వారిపై తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ప్రమాదాలు పునరావృతం కాకుండా పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలను మరింత కట్టుదిట్టం చేయాల్సిన అవసరం ఉందని లోకేశ్ అభిప్రాయపడ్డారు. కార్మికుల భద్రత విషయంలో ప్రభుత్వం రాజీ పడబోదని, అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఇదిలా ఉండగా విశాఖలోని కిమ్స్ ఐకాన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గాయపడిన కార్మికులను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పరామర్శించారు. బాధితుల ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని ఆసుపత్రి యాజమాన్యాన్ని ఆదేశించారు. గాయపడిన కార్మికులకు అవసరమైన అన్ని వైద్య సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు.

స్టీల్ ప్లాంట్ ప్రమాదం నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సహాయక చర్యలను వేగవంతం చేసింది. మృతుల కుటుంబాలకు, గాయపడిన వారికి ప్రకటించిన పరిహారం అందించే ప్రక్రియను కూడా వేగంగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ప్రమాదంపై సమగ్ర విచారణతో పాటు భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరగకుండా భద్రతా చర్యలను మరింత బలోపేతం చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు అధికార వర్గాలు తెలిపాయి.

# ఆక్వా రంగానికి పండగ..!


- అదనంగా 12 వేల కనెక్షన్లకు రూ. 1.50 రాయితీ
- మంత్రి అచ్చెన్నాయుడు కీలక ప్రకటన
- విజయవాడలో రొయ్యల రైతులు, మేత తయారీ
- సంస్థలతో మంత్రి ఉన్నత స్థాయి సమీక్ష
- చిన్న, పెద్ద ఫారాలన్నింటికీ కరెంట్ సబ్సిడీ
- జూన్ 1 నుంచి అమలులోకి వచ్చేలా ప్రభుత్వం ఏర్పాట్లు
- ధరల పెరుగుదలపై ఫీడ్ కంపెనీల వివరణ
- మేత ధరల విపరీత పెంపును నియంత్రించాలని..
- సాగు నష్టాల నుండి కాపాడాలని రైతుల విజ్ఞప్తి
- పరిష్కారం కోసం 'సీబా' తో కలిపి శాస్త్రీయ ధరల కమిటీ
- ధరల మార్పులపై ఇరువర్గాల చర్చలు
- ఆక్వా రైతుల ప్రయోజనాలే పరమావధి
- మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా పారదర్శక ధరల విధానం

**అమరావతి వెలుతురు జూన్ 09:**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అత్యంత కీలకమైన ఆక్వాకల్చర్ (చేపలు, రొయ్యల సాగు) రంగాభివృద్ధికి మరియు రొయ్యల రైతుల ఆర్థిక సంక్షేమానికి తమ కూటమి ప్రభుత్వం నూటికి నూరు శాతం కట్టుబడి ఉందని రాష్ట్ర వ్యవసాయ, మత్స్యశాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఆక్వా రంగాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు, ప్రపంచ మార్కెట్లో తెలుగు ఆక్వా రైతులకు మంచి పోటీతత్వ సామర్థ్యాలను కల్పించడమే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రభుత్వ ప్రధాన ప్రాధాన్యతని ఆయన వెల్లడించారు. విజయవాడలోని మత్స్యశాఖ కమిషనర్ కార్యాలయంలో రొయ్యల రైతులు, మేత (ఫీడ్) తయారీ సంస్థల ప్రతినిధులు, సీఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల యజమానులు మరియు ఎగుమతి దారులతో మంత్రి ఒక ఉన్నత స్థాయి కీలక సమావేశాన్ని నిర్వహించారు.

రాష్ట్రంలోని ఆక్వాకల్చర్ రైతులకు భారీ ఆర్థిక ఊరట నిచ్చేలా మంత్రి అచ్చెన్నాయుడు ఒక అద్భుతమైన శుభవార్తను ప్రకటించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన ఆదేశాల మేరకు.. ప్రస్తుత జూన్ 1వ తేదీ నుండి అమలులోకి వచ్చేలా రాష్ట్రంలో అదనంగా మరో 12 వేల ఆక్వాకల్చర్ విద్యుత్ కనెక్షన్లకు యూనిట్‌కు రూ. 1.50 చొప్పున భారీ కరెంట్ రాయితీ (సబ్సిడీ) అందించే ప్రక్రియ ప్రస్తుతం తుది దశకు చేరుకుందని వెల్లడించారు. ఇందుకు సంబంధించిన అధికారిక ప్రభుత్వ ఉత్తర్వులు (జీఓ) మరికొద్ది రోజుల్లోనే జారీ కానున్నాయని తెలిపారు. ఈ నిర్ణయం వల్ల క్షేత్రస్థాయిలో రొయ్యల సాగు పెట్టుబడి ఖర్చులు గణనీయంగా తగ్గుతాయని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

ప్రభుత్వం ఇవ్వబోయే ఈ నూతన విద్యుత్ రాయితీ



పథకం రాష్ట్రంలోని అర్హులైన ఆక్వా రైతులందరికీ సమానంగా వర్తిస్తుందని మంత్రి అచ్చెన్నాయుడు క్లారిటీ ఇచ్చారు. గతంలో ఉన్న కొన్ని సాంకేతిక నిబంధనలను సడలిస్తూ.. అవి చిన్న రొయ్యల చెరువులైనా లేదా పెద్ద ఆక్వా ఫారాలైనా సరే, అలాగే అవి అధికారిక ఆక్వా జోన్ పరిధిలో ఉన్నా లేదా నాన్-ఆక్వా జోన్ పరిధిలో ఉన్నా సరే.. ఈ కొత్త పథకం పరిధిలోకి వస్తాయని స్పష్టం చేశారు. ఈ చారిత్రాత్మక మార్పు వల్ల గతంలో రాయితీలు కోల్పోయిన వేలాది మంది సామాన్య, మధ్యతరగతి ఆక్వా రైతులకు గొప్ప లబ్ధి చేకూరుతుందని, ఉత్పత్తి వ్యయాలు తగ్గి రైతులు ఆర్థికంగా నిలదొక్కుకుంటారని వివరించారు.

గత కొంతకాలంగా ఆంధ్రప్రదేశ్‌లో రొయ్యల మేత (ఫీడ్) ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో ఆక్వా రైతులు పెట్టుబడులు పెట్టలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

దీనికి తోడు వేసవి కాలం కావడం వల్ల చెరువుల నిర్వహణ భారం మరింత ఎక్కువైందని రైతులు మత్స్యశాఖ అధికారుల దృష్టికి తెచ్చారు. విజయవాడ సమావేశంలో రైతు ప్రతినిధులు మాట్లాడుతూ.. అంతర్జాతీయ మార్కెట్లో రొయ్యల ధరలు స్థిరంగా లేనప్పుడు, స్థానికంగా మేత ధరలను భారీగా పెంచడం వల్ల తాము అప్పులపాలై సాగును పూర్తిగా నిలిపివేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కాబట్టి ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని ఫీడ్ ధరల నియంత్రణకు చట్టబద్ధమైన చర్యలు తీసుకోవాలని గట్టిగా కోరారు.

ధరల పెంపుపై ఫీడ్ తయారీ కంపెనీల యాజమాన్యాలు కూడా తమ వైపు ఉన్న ఇబ్బందులను మంత్రి అచ్చెన్నాయుడికి వివరించాయి. రొయ్యల మేత తయారీకి అత్యంత ముఖ్యమైన ముడి పదార్థాలైన ఫిష్‌మీల్ (చేపల పొడి), సోయాబీన్ మీల్ వంటి వాటి అంతర్జాతీయ, జాతీయ మార్కెట్ ధరలు ఈ మధ్య కాలంలో విపరీతంగా పెరిగిపోయాయని తెలిపారు. ముడి పదార్థాల కొనుగోలు ఖర్చులు, రవాణా ఛార్జీలు మరియు ఫ్యాక్టరీల ఉత్పత్తి వ్యయాలు అధికమవ్వడం వల్లే తాము తప్పనిసరి పరిస్థితుల్లో ధరలను పెంచాల్సి వస్తోందని, లేకుంటే ఫీడ్ పరిశ్రమలు నష్టాల్లో మునిగిపోతాయని మంత్రికి వివరించారు.

ఇరు పక్షాల వాదనలు విన్న మంత్రి అచ్చెన్నాయుడు.. ఫీడ్ ధరల నిర్ణయంలో ఇకపై ఎలాంటి ఏకపక్ష నిర్ణయాలకు తావులేకుండా ఒక పక్కా శాస్త్రీయ విధానాన్ని అనుసరించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ఇందులో భాగంగా.. రాష్ట్ర మత్స్యశాఖ, కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక సంస్థ అయిన 'సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్రాకిష్‌వాటర్ ఆక్వాకల్చర్స్, ఆక్వా రైతు సంఘాల ప్రతినిధులు మరియు ఫీడ్ తయారీదారుల సంఘ సభ్యులతో కూడిన ఒక ఉన్నత స్థాయి 'శాస్త్రీయ ధరల కమిటీస ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ప్రతిపాదించిందని తెలిపారు. ఈ కమిటీ మార్కెట్లోని ముడి పదార్థాల ధరలు, దేశీయ టోకు ధరల సూచీ ప్రమాణాలను ఎప్పటికప్పుడు పరిశీలించి ప్రభుత్వానికి పారదర్శక సిఫార్సులు చేస్తుందన్నారు.

కొత్త శాస్త్రీయ ధరల విధానం పూర్తి స్థాయిలో అమల్లోకి వచ్చే వరకు మధ్యంతర కాలానికి గానూ తాత్కాలిక ధరల సర్దుబాటుపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చలు జరిగాయి.

ఆక్వా రైతు ప్రతినిధులు మాట్లాడుతూ.. ప్రస్తుతం ఉన్న క్లిష్ట పరిస్థితుల్లో కేవలం కిలోకు రూ. 6 మేర మాత్రమే ధరల పెంపును అనుమతించాలని, దానిని కూడా కేవలం ఒక నెల కాలానికి మాత్రమే పరిమితం చేయాలని సూచించారు. కాగా, ఫీడ్ తయారీదారులు తాత్కాలికంగా కిలోకు రూ. 12 మేర పెంపును పరిశీలించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈ తాత్కాలిక పెంపు అంశంపై ఇరు వర్గాల మధ్య పూర్తి స్థాయిలో ఏకాభిప్రాయం కుదరకపోవడంతో, సంప్రదింపులను మరింత వేగవంతం చేయాలని ప్రభుత్వం కోరింది.

ఆక్వా రంగం సమగ్ర ప్రయోజనాలను మరియు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని రైతులు, తయారీదారులు పరస్పర అంగీకారంతో, సామరస్యపూర్వక చర్చల ద్వారా అందరికీ ఆమోదయోగ్యమైన తుది పరిష్కారానికి రావాలని ప్రభుత్వం సూచించిందని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. ఇరు వర్గాలు ఒక ఏకాభిప్రాయానికి వచ్చిన తర్వాత తమ ఉమ్మడి ప్రతిపాదనలను ప్రభుత్వానికి సమర్పిస్తే, దానిపై సానుకూల నిర్ణయం తీసుకుంటామన్నారు.

భవిష్యత్తులో మార్కెట్ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని పూర్తిగా పారదర్శక ధరల వ్యవస్థ ఏర్పాటుపై ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. ఈ ఉన్నత స్థాయి సమావేశంలో కైకలూరు నియోజకవర్గ శాసనసభ్యుడు కె. శ్రీనివాస్, ఏపీఎస్ఏడీఏ కో-వైస్ ఛైర్మన్ ఆనం వెంకట రమణారెడ్డి, మత్స్యశాఖ కమిషనర్ రామశంకర్ నాయక్‌తో పాటు కేంద్ర మత్స్యరంగ సంస్థల ప్రతినిధులు, పరిశ్రమ సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించాలి



- వైద్యాధికారులు, సిబ్బంది సమయ పాలన పాటిస్తూ వైద్య సేవలో అలసత్వం చేయకూడదు
- డాక్టర్ పుట్ల శ్రీనివాస్ జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి, హైదరాబాద్

**హైదరాబాద్ వెలుతురు జూన్ 09:**

జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయం హైదరాబాద్ సమావేశ మందిరంలో ప్రోగ్రామ్ ఆఫీసర్స్,సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్స్, కార్యాలయ అధికారులు, సిబ్బంది తో సమావేశం నిర్వహించినారు. ఈ సందర్భంగా మట్లాడుతూ హైదరాబాద్ జిల్లా లో ప్రతి ఒక్కరికి నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించాలని కోరారు. ప్రజలకు సేవలు అందించడంలో అలసత్వం వహించ కూడదు అని కోరారు. వైద్యులు ,సిబ్బంది ,సమయ పాలన పాటించాలని కోరారు. కార్యాలయం లో ఫైల్స్ క్లియరెన్స్ సకాలంలో పూర్తి చేయాలని ,పెండింగ్ ఉంచకూడదని ఈ సందర్భంగా కోరారు. జిల్లాలో ఆరోగ్య కార్యక్రమాలు ,పథకాలు ,ఆరోగ్య సేవలు నిరంతరం పర్యవేక్షణ చేయాలని ప్రోగ్రామ్ ఆఫీసర్స్, సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్స్ ను కోరారు. ఈ సందర్భంగా హైదరాబాదు ప్రజలకు ఆరోగ్య సేవలు అందించటానికి నన్ను ఇక్కడికి బదిలీ చేసిన వైద్య& ఆరోగ్య శాఖ మంత్రి వర్యులకు కు,ప్రిన్సిపాల్ సెక్రటరీ ,ఆరోగ్య శాఖ,కమిషనర్,ఆరోగ్య &కుటుంబ సంక్షేమ శాఖ,ప్రజారోగ్య సంచాలకులకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసరూడా, శ్రీదర్, సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్స్,కార్యలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం చేసిన ప్రీ ప్రైమరీ పీఎంశ్రీ కేంద్రాలను తక్షణమే రద్దుచేయాలి సిఐటియు

**మంచాల వెలుతురు జూన్ 09:**



మంచాల మండలం ప్రీ ప్రైమరీ పీఎం ప్రైమరీ రద్దు డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో మంచాల తహశీల్దార్ ఎంపీడీఓలకు వినతి పత్రాలు అందజేశారుఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం చేసిన ప్రీప్రైమరీ పీఎంశ్రీ మొత్తం4,131 కేంద్రాలను తక్షణమే రద్దు చే యాలని డిమాండ్ చేశారు వీటిని అంగన్వాడీ కేంద్రాలకు అప్పగిస్తూ వెంటనే ప్రభుత్వం నిర్ణయం చేయాలన్నారు ఐసిడిఎస్ ను నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వ నిర్ణయాన్ని విరమించుకుని వాటిని బ లోపేతంచేయాలి కోరారు అంగన్వాడీ టీచర్స్ హెల్పర్స్ కు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారుఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్ యాదమ్మ హంసమ్మ లక్ష్మి రజి త భారతి తదితరులు పాల్గొన్నారు.

## దళితుల భూములపై కన్నేస్తే ఊరుకోం

- 49 ఎకరాల ఎస్సీ కార్పొరేషన్ భూమికి రక్షణ కవచం
- సర్వే పూర్తయ్యాక ఫెన్సింగ్.. కబ్జాదారులపై కఠిన చర్యలు
- సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**గుండ్లపోచంపల్లి, వెలుతురు జూన్ 9:**





దళిత విద్యార్థుల భవిష్యత్తు కోసం కేటాయించిన ఒక్క గజం భూమిని కూడా కబ్జా చేసేందుకు ఎవరినీ అనుమతించబోమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి శ్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హెచ్చరించారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని గుండ్లపోచంపల్లి శివారులో ఎస్సీ కార్పొరేషన్‌కు చెందిన భూములు అన్యాక్రాంతమవుతున్నాయన్న ఫిర్యాదుల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఎం. మను చౌదరితో కలిసి మంత్రి మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా మంత్రి అడ్లురి లక్ష్మణ్ కుమార్ గారు మాట్లాడుతూ.. 1991లో గుండ్లపోచంపల్లి శివారు సర్వే నంబర్ 509లోని 49 ఎకరాల 20 గుంటల భూమిని దళిత విద్యార్థుల సంక్షేమం, శిక్షణా కార్యక్రమాల కోసం ఎస్సీ కార్పొరేషన్‌కు కేటాయించారని తెలిపారు. తెలంగాణకు చెందిన ఎస్సీ విద్యార్థులకు ఉద్యానవన శిక్షణ అందించేందుకు ఉద్దేశించిన ఈ విలువైన భూమిని పరిరక్షించడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు.రాష్ట్రంలోని 33 జిల్లాల్లో ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన భూములను కొందరు ప్రైవేట్ వ్యక్తులు గత ప్రభుత్వ అండదండలతో, ఆర్థిక బలాన్ని ఉపయోగించి అన్యాక్రాంతం చేస్తున్నారని ఆరోపించారు. దళితుల హక్కులకు భంగం కలిగించే ఎలాంటి చర్యలనైనా ప్రభుత్వం ఉపేక్షించదన్నారు. 49 ఎకరాల 20 గుంటల భూమికి సంబంధించి సమగ్ర సర్వే నిర్వహించి నివేదిక అందిన వెంటనే పూర్తిస్థాయిలో ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తామని మంత్రి ప్రకటించారు. "అన్యాక్రాంతం చేస్తున్న వారిలో ఎంత పెద్దవారు ఉన్నా సహించేది లేదు. ప్రభుత్వ భూమిని తిరిగి స్వాధీనం చేసుకుని రక్షిస్తాం" అని స్పష్టం చేశారు.జిల్లా కలెక్టర్ ఈ అంశాన్ని సుమోటోగా తీసుకుని వెంటనే సర్వే నిర్వహించాలని, హద్దురాళ్లు, గేట్లు ఏర్పాటు చేసి భౌతిక స్వాధీన స్థితిపై నివేదిక అందించాలని ఆదేశించారు.అనంతరం భూమిని పూర్తిస్థాయిలో ఎస్సీ కార్పొరేషన్ ఆధీనంలోకి తీసుకొస్తామని తెలిపారు.ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధిగా బాధ్యతతోనే తాను ఇక్కడికి వచ్చానని పేర్కొన్న మంత్రి, దళితుల ఆస్తులను కాపాడటంలో ప్రభుత్వం వెనుకడుగు వేయదన్నారు.


బెదిరింపులు, ఒత్తిళ్లు, రాజకీయ ప్రభావాలకు ప్రభుత్వం భయపడదని, మాటల్లో కాదు చేతల్లో చూపిస్తామని హెచ్చరించారు."దళిత విద్యార్థులకు బంగారు భవిష్యత్తు అందించడమే మా లక్ష్యం. భవిష్యత్ తరాలకు ఉపయోగపడే ఈ 49 ఎకరాల 20 గుంటల భూమి సాధారణ ఆస్తి కాదు. దీనిని కాపాడటం సామాజిక బాధ్యత" అని మంత్రి పేర్కొన్నారు.ఎస్సీ, ఎస్టీల భూముల విషయంలో ఎవరైనా చట్టవ్యతిరేకంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని, అవసరమైతే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసులు నమోదు చేయడానికీ ప్రభుత్వం వెనుకాడదని స్పష్టం చేశారు. "49 ఎకరాల 20 గుంటల్లో ఒక్క గజం భూమి పోయినా చట్టం తన పని తాను చేసుకుంటూ పోతుంది" అని హెచ్చరించారు.అదే సమయంలో ఆ ప్రాంతంలో వ్యవసాయం చేస్తున్న రైతుల ప్రయోజనాలను కూడా పరిరక్షిస్తామని తెలిపారు. రైతులు తమ పొలాలకు వెళ్లేందుకు అవసరమైన దారులు కల్పించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎవరైనా రైతులను అడ్డుకునేందుకు ప్రయత్నించినా, తమ ప్రభావాన్ని చూపాలని భావించినా చర్యలు తప్పవని హెచ్చరించారు.ఈ అంశంపై రాష్ట్ర రెవెన్యూ మంత్రికి కూడా నివేదిక సమర్పించి భూముల రక్షణకు అవసరమైన చర్యలు వేగవంతం చేస్తామని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ వెల్లడించారు.ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం, వీసీ అండ్ ఎండీ హనుమంత్ నాయక్, జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమల అధికారి బి. శ్రీధర్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి బి. శంకర్, మేడ్చల్ ఆర్డీవో శ్యాంప్రసాద్, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి (DSCDO) వినోద్ కుమార్, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి (DTDO) పద్మజ, మేడ్చల్ తహసీల్దార్ (ఇన్‌చార్జి) అనూష తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ లోక్ అదాలత్ విజయవంతానికి సమన్వయంతో కృషి చేయాలి

**న్యాయవాదులు, పోలీసు అధికారులతో సమావేశమైన న్యాయమూర్తులు...**

**జహీరాబాద్ వెలుతురు జూన్ 09:**

ఈ నెల 20న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయడానికి రాజీ పడదగిన కేసులను అధిక సంఖ్యలో పరిష్కరించేలా సమన్వయంతో కృషి చేయాలని న్యాయమూర్తులు పిలుపునిచ్చారు. ఈ మేరకు సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ కోర్టు ఆవరణలో న్యాయవాదులు, పోలీసు అధికారులతో సీనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్‌పర్సన్ జి. కవితాదేవి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మొహమ్మద్ అబ్దుల్ ఖలీల్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బ్లెస్సి సమావేశమయ్యారు.ఈ సందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడుతూ, లోక్ అదాలత్ ద్వారా రాజీ మార్గంలో పరిష్కరించగలిగే కేసులను గుర్తించి, వాటిని ఎక్కువ సంఖ్యలో పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజల్లో లోక్ అదాలత్‌పై విస్తృత అవగాహన కల్పించాలని, కక్షిదారులకు ఈ విధానం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించాలని పోలీసు అధికారులకు



సూచించారు.లోక్ అదాలత్ ద్వారా కేసులను పరిష్కరించుకోవడం వల్ల సమయం, డబ్బు ఆదా కావడంతో పాటు పరస్పర సంబంధాలు కూడా కొనసాగుతాయని తెలిపారు. కోర్టుల చుట్టూ సంవత్సరాల తరబడి తిరగకుండా, పరస్పర అంగీకారంతో సమస్యలను పరిష్కరించుకునే అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.లోక్ అదాలత్‌కు సంబంధించిన పూర్తి వివరాల కోసం న్యాయవాదులు, పోలీసు అధికారులు, మండల స్థాయి అధికారులు లేదా మండల లీగల్ సర్వీసెస్ కమిటీ కార్యాలయాన్ని సంప్రదించవచ్చని తెలిపారు.ఈ సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, ఏజీపీ దత్తాత్రేయ రెడ్డి, పబ్లిక్ ప్రాసిక్యూటర్, డీఎస్పీ సైదా నాయక్, సీఐలు, ఎస్సైలు, కోర్టు కానిస్టేబుళ్లు, లీగల్ సర్వీసెస్ సిబ్బంది, పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో కురిసిన భారీ వర్షంపై అధికారులతో సమీక్ష నిర్వహించిన హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్ వెలుతురు జూన్ 09:**

హైదరాబాద్ సాయంత్రం కురిసిన భారీ వర్షం కారణంగా ఏర్పడిన పరిస్థితులపై హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ జీహెచ్ఎంసీ కమిషనర్, సిటీ పోలీస్ కమిషనర్, జిల్లా కలెక్టర్‌లతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.తక్కువ సమయంలో ఒక్కసారిగా భారీ వర్షం కురవడంతో నగరంలోని పలు ప్రాంతాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని మంత్రి పేర్కొన్నారు. అనేక ప్రాంతాల్లో మోకాళ్ల లోతు వరకు వర్షపు నీరు నిల్వ ఉండటంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారని తెలిపారు.

నగరంలోని ఒక్కసారిగా ఈదురు గాలులు వీయడంతో పలు ప్రాంతాల్లో చెట్లు కూలిపోవడం, విద్యుత్ తీగలు తెగిపడిన ఘటనలపై మంత్రి ఆరా తీశారు. విద్యుత్ షాక్ తో ఇద్దరు వ్యక్తులు మరణించారని తెలుసుకున్న సమాచారంతో తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.కూలిన చెట్లు ,తెగిన విద్యుత్ తీగలు తొలగించడానికి సహాయక చర్యలను వేగవంతం చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని జీహెచ్ఎంసీ, హైడ్రా, పోలీస్, విద్యుత్, హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్, రెవెన్యూ తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. భారీ వర్షాలు కురిసే సమయంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని సూచించారు.ప్రజల భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఎలాంటి అత్యవసర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

# విశాఖ స్టీల్ ప్లాంట్‌లో జరిగిన ఘోర అగ్నిప్రమాదంపై హైకోర్టు అడ్వకేట్ డా "సగరపు ప్రసాద్ దిగ్భ్రాంతి

**హైదరాబాద్ వెలుతురు జూన్ 09:**

విశాఖపట్నంలోని విశాఖ స్టీల్ ప్లాంట్‌లో జరిగిన భారీ అగ్నిప్రమాదంలో పలువురు కార్మికులు ప్రాణాలు కోల్పోవడం అత్యంత విషాదకరమని హైకోర్టు అడ్వకేట్ ప్రసాద్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.లిక్విడ్ స్టీల్ ద్వారా బీమ్స్ తయారు చేసే విభాగంలో లాడల్ బ్లాస్ట్ కారణంగా మరుగుతున్న ఉక్కు కార్మికులపై పడటంతో 8 మంది కార్మికులు సజీవ దహనమైనట్టు వస్తున్న వార్తలు హృదయ విదారకమని అన్నారు.ఇప్పటివరకు నలుగురు మృతదేహాలను గుర్తించినట్లు తెలిసిందని, మిగిలిన వారి ఆచూకీ కోసం సహాయక చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన కార్మికుల కుటుంబాలకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు ఈ తీవ్ర విషాదాన్ని తట్టుకునే మనోధైర్యం ప్రసాదించాలని భగవంతుడిని కోరారు.

గాయపడిన వారికి అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని, ప్రమాదానికి గల కారణాలపై సమగ్ర దర్యాప్తు చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని



సంబంధిత అధికారులను కోరారు. భవిష్యత్తులో ఇటువంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా స్టీల్ ప్లాంట్‌లో భద్రతా ప్రమాణాలను మరింత కట్టుదిట్టం చేయాలని సూచించారు.దేశ పారిశ్రామికాభివృద్ధికి సేవలందిస్తున్న కార్మికుల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని డా"సగరపు ప్రసాద్ అన్నారు.

## డీకేకు కొనసాగుతున్న...

(మొదటి పేజీ తరువాయి)

**బెంగళూరు వెలుతురు జూన్ 09:**

కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి డీకే శివకుమార్ నాయకత్వానికి తొలి రోజుల్లోనే అనేక రాజకీయ సవాళ్లు ఎదురవుతున్నాయి. మంత్రివర్గ ఏర్పాటు, శాఖల కేటాయింపు ప్రక్రియ పూర్తయినప్పటికీ అసంతృప్తి స్వరాలు మాత్రం తగ్గడం లేదు. తాజాగా మరో మంత్రి శాఖల కేటాయింపుపై బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేయడం రాష్ట్ర కాంగ్రెస్‌లో చర్చనీయాంశంగా మారింది.గ్రేటర్ బెంగళూరు అభివృద్ధి శాఖ బాధ్యతలను మంత్రి కృష్ణ బేరె గౌడకు అప్పగించినప్పటికీ, ఆ శాఖ పరిధిలోని కీలక సంస్థలను ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తన వద్దే ఉంచుకోవడం వివాదానికి దారితీసింది. బెంగళూరు అభివృద్ధి అథారిటీ (బీడీఏ), బెంగళూరు మెట్రోపాలిటన్ ప్రాంత అభివృద్ధి అథారిటీ (బీఎంఆర్‌డీఏ) వంటి నగరాభివృద్ధికి సంబంధించిన అత్యంత కీలక సంస్థలు సీఎం ఆధీనంలోనే కొనసాగుతున్నాయి. ఈ నిర్ణయంపై కృష్ణ బేరె గౌడ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. గ్రేటర్ బెంగళూరు అభివృద్ధి శాఖకు సంబంధించిన ప్రధాన నిర్ణయాలు, ప్రణాళికలు, భూ వినియోగ విధానాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి కార్యక్రమాలు బీడీఏ, బీఎంఆర్‌డీఏల ద్వారా అమలవుతుంటాయి. అలాంటి పరిస్థితుల్లో కీలక అధికారాలు లేకుండా శాఖ బాధ్యతలు స్వీకరించడం వల్ల ప్రయోజనం ఉండదని కృష్ణ బేరె గౌడ భావిస్తున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.ఈ అంశంపై ఇప్పటికే ఆయన ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను వ్యక్తిగతంగా కలిసి తన అభ్యంతరాలను వెల్లడించినట్లు సమాచారం. అయితే ఇప్పటివరకు పూర్తి స్థాయిలో స్పష్టత రాకపోవడంతో శాఖ బాధ్యతలను అధికారికంగా స్వీకరించడానికి ఆయన ముందుకు రావడం లేదు. సమస్యకు సమగ్ర పరిష్కారం లభించిన తర్వాతే బాధ్యతలు చేపడతానని ఆయన స్పష్టం చేసినట్లు తెలుస్తోంది.ఈ నేపథ్యంలోనే కృష్ణ బేరె గౌడ సోమవారం రాత్రి ఢిల్లీకి బయలుదేరారు. కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేలతో సమావేశమై తన అభిప్రాయాలను వివరించే అవకాశమున్నట్లు రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.రాష్ట్ర నాయకత్వం తీసుకున్న నిర్ణయాలపై అధిష్ఠానం జోక్యం చేసుకోవాలని ఆయన కోరే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది.ఇదిలా ఉండగా శాఖల కేటాయింపుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్న నేతల జాబితాలో కృష్ణ బేరె గౌడ ఒక్కరే కాదు. ఇటీవల నగరాభివృద్ధి శాఖను తనకు కేటాయించకపోవడంపై సీనియర్ నేత రామలింగారెడ్డి కూడా బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆయనకు నీటిపారుదల శాఖ కేటాయించగా, నగరాభివృద్ధి శాఖ దక్కకపోవడంపై తీవ్ర నిరాశకు గురయ్యారు.ప్రమాణ స్వీకారం చేసిన రెండు రోజులకే మంత్రి పదవికి రాజీనామా చేస్తూ రామలింగారెడ్డి సంచలన నిర్ణయం తీసుకున్నారు. దీంతో కాంగ్రెస్ అధిష్ఠానం అప్రమత్తమైంది. వెంటనే పార్టీ పెద్దలు రంగంలోకి దిగి ఆయనతో చర్చలు జరిపారు. అనంతరం పార్టీ ప్రయోజనాల దృష్ట్యా రాజీనామాను వెనక్కి తీసుకోవాలని కోరడంతో ఆయన అంగీకరించారు. ప్రభుత్వం ఏర్పడి కొద్దికాలమే అయినప్పటికీ శాఖల కేటాయింపు, అధికారాల పంపిణీ, మంత్రివర్గ ప్రాతినిధ్యం వంటి అంశాలు కాంగ్రెస్ నాయకత్వానికి సవాళ్లుగా మారాయి. ఈ అసంతృప్తులను అధిష్ఠానం ఎలా పరిష్కరిస్తుందన్నది ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.



# మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ – బీజేపీ అంతానికి నాంది: రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రసన్న కుమార్ శర్మ

- **ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధంగా వ్యవహరించారని ఆరోపణ**
- **భవిష్యత్తులో ప్రజల తీర్పుతో బీజేపీకి గట్టి ఎదురుదెబ్బ తప్పదని వ్యాఖ్య**

**హైదరాబాద్ వెలుతురు జూన్ 09:**

మధ్యప్రదేశ్‌లో రాజ్యసభ సభ్యురాలిగా నామినేషన్ దాఖలు చేసిన కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణపై రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రసన్న కుమార్ శర్మ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.

ఆయన మాట్లాడుతూ, స్వాతంత్ర్యం అనంతరం భారతదేశంలో ఎన్నో ఎన్నికలు జరిగినప్పటికీ, ఇటువంటి పరిణామాలు ప్రజాస్వామ్య వ్యవస్థపై అనుమానాలు కలిగించే విధంగా ఉన్నాయని అన్నారు.

భారతీయ జనతా పార్టీ గత కొన్నేళ్లుగా అనుసరిస్తున్న రాజకీయ విధానాలను ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని, ఈ చర్యల ప్రభావం భవిష్యత్తు రాజకీయ పరిణామాల్లో స్పష్టంగా కనిపిస్తుందని పేర్కొన్నారు.

మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ పట్ల విద్యావంతులు, వ్యాపారవేత్తలు, యువతలో ఆందోళన వ్యక్తమవుతోందని ఆయన అన్నారు.

రాజ్యాధికారాన్ని కాపాడుకోవడమే లక్ష్యంగా ప్రతిపక్ష పార్టీలను బలహీనపర్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు.

మహాభారతంలోని దుర్యోధనుడు, దుశ్శాసనుడు, శకుని, కర్ణుడు వంటి పాత్రలను ఉదాహరణగా ప్రస్తావిస్తూ, అధికార దుర్వినియోగం చివరికి ప్రజా వ్యతిరేకతకు దారితీస్తుందని వ్యాఖ్యానించారు.

భవిష్యత్తు భారత రాజకీయాల్లో రాహుల్ గాంధీ కీలక పాత్ర పోషిస్తారని, ఆయన చుట్టూ ప్రజాస్వామ్య శక్తులు ఏకమవుతాయని తెలిపారు.

అలాగే ఎన్నికల ప్రక్రియలో స్వతంత్ర సంస్థలు తమ రాజ్యాంగబద్ధ బాధ్యతలకు అనుగుణంగా పనిచేయాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీసే



చర్యలు ఎవరూ చేయరాదని హెచ్చరించారు.

గాంధేయవాదిగా పేరుగాంచిన మీనాక్షి నటరాజన్ పట్ల అనుచితంగా వ్యవహరించి ఆమె నామినేషన్‌ను తిరస్కరించారని ఆరోపించిన ప్రసన్న కుమార్ శర్మ, ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరగాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఇటువంటి రాజకీయ సవాళ్లను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండి ప్రజాస్వామ్య పరిరక్షణకు కట్టుబడి ఉండాలని ఆయన పిలుపునిచ్చారు.

విద్యావేత్తలు, వ్యాపారవేత్తలు, యువత ఈ పరిణామాలను లోతుగా పరిశీలించి ప్రజాస్వామ్య విలువల పరిరక్షణలో తమ వంతు పాత్ర పోషించాలని కోరారు.

## శేరిలింగంపల్లి అభివృద్ధికి మద్దతుగా మియాపూర్ సభకు భారీ బైక్ ర్యాలీ

- **రూ.2,000 కోట్ల అభివృద్ధి పనులకు స్వాగతం పలికిన కాంగ్రెస్ శ్రేణులు**

**కూకట్ పల్లి జూన్ 09 వెలుతురు:**



శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధి కోసం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సుమారు రూ.2,000 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసిన సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ అరికెపూడి గాంధీ పిలుపు మేరకు వివేకానంద నగర్ డివిజన్‌లో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. వివేకానంద నగర్ డివిజన్ కాంగ్రెస్ నాయకుడు ఎన్. చంద్రకాంతరావు ఆధ్వర్యంలో, రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జనంపల్లి పురేందర్ రెడ్డి నాయకత్వంలో కాలనీ జెండా స్థంభం వద్ద నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీలో సుమారు 50 ద్విచక్ర వాహనాలతో కాంగ్రెస్ కార్యకర్తలు, యువ నాయకులు పాల్గొన్నారు. ర్యాలీ వివేకానంద నగర్, రామకృష్ణ వీధి, వివేకానంద విగ్రహం, మెయిన్ రోడ్ మీదుగా మియాపూర్‌లో ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి బహిరంగ సభా వేదిక వరకు కొనసాగింది. ఈ సందర్భంగా పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జనంపల్లి పురేందర్ రెడ్డి మాట్లాడుతూ, సీఎం సభ విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి కార్యకర్తకు, అభిమానులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. శేరిలింగంపల్లి అభివృద్ధి కోసం ప్రభుత్వం, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ చేస్తున్న కృషికి ప్రజలు పూర్తి మద్దతు ఇస్తున్నారని ఆయన అన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు వి. తాండవ కృష్ణ, జి. ప్రసాద్, సూర్యనారాయణ, లక్ష్మీనారాయణ, జి. నర్సింగ్‌రావు, కిషోర్, సునీల్ పటేల్, గ్రానైట్ సూర్యనారాయణ, టైగర్ పురుషోత్తం తదితరులతో పాటు యువ నాయకులు నందు, భార్గవ్, రిత్విక్, శ్రీను, భాస్కర్, నాని, కళ్యాణ్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ ఇవ్వండి

- **మేడ్చల్ జిల్లా డీఈఓ కు టి యు డబ్ల్యూ జే నాయకుల విజ్ఞప్తి**

**కూకట్ పల్లి జూన్ 09 వెలుతురు:**



జర్నలిస్టుల పిల్లలకు పాఠశాలల్లో 50 శాతం రాయితీ కల్పించేలా ప్రభుత్వ యంత్రాంగం తగు చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం ( టి యు డబ్ల్యూ జే– ఐజేయు ) మేడ్చల్ జిల్లా శాఖ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు టీయూడబ్ల్యూజే మేడ్చల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జర్నలిస్టులు మంగళవారం జిల్లా విద్యాధికారి (డిఈఓ) రేణుకా దేవిని కలిసి వినతిపత్రం అందజేశారు. 2026–27 విద్యా సంవత్సరానికి గాను జిల్లా పరిధిలోని వివిధ పాఠశాలల్లో చదువుతున్న జర్నలిస్టుల పిల్లలకు రాయితీ ఇచ్చేలా తగు సూచనలతో ఆదేశాలు జారీ చేయాలని కోరారు . దీనిపై సానుకూలంగా స్పందించిన డిఇఓ వెంటనే తగు ఉత్తర్వులు జారీ చేయాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. అదేవిధంగా ఎవరైనా జర్నలిస్టులు తమ పిల్లలకు ఫీజు రాయితీ కోరుతూ ఆయా పాఠశాలల పేరుమీద వ్యక్తిగతంగా లెటర్ కావాలనుకునేవారు నేరుగా జిల్లా కలెక్టరేట్ కాంప్లెక్స్ లోని విద్యాశాఖ కార్యాలయాన్ని సంప్రదించాలని ఆమె తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టియుడబ్ల్యూజే( ఐజేయు ) రాష్ట్ర కోశాధికారి మోతె వెంకట్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు గడ్డమీది బాలరాజ్, జిల్లా కార్యదర్శి దొంతుల వెంకట్రాంరెడ్డి, జిల్లా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు రవిచంద్ర, జిల్లా జర్నలిస్టు నాయకులు రామారావు, ప్రసాద్, భూపాల్, నరోత్తం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.






## వర్షాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఆర్ అండ్ బి అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- **వాగులు వంకలు పొర్లి ప్రమాదాలకు ఆస్కారం ఉన్న రోడ్లను,బ్రిడ్జిలను గుర్తించి ప్రమాద హెచ్చరికలు పెట్టాలి**
- **ప్రతి రోజు అధికారులు ఫీల్డ్ విజిట్ చేయాల్సిందే.**
- **ఆర్ అండ్ బి అధికారుల సమీక్షలో మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి**
- **పురోగతిలో ఉన్న పలు రోడ్లు, ఆర్వోబి,ఆర్యుబి లపై ఆరా తీసిన మంత్రి**



**రీజినల్ రింగ్ రోడ్డు పనుల పురోగతిపై ఆరా తీసిన మంత్రి**

**హైదరాబాద్ వెలుతురు జూన్ 09:**

వర్షాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఆర్ అండ్ బి అధికారులు క్షేత్ర స్థాయిలో పూర్తి అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు.

వాగులు వంకలు పొర్లి ప్రమాదాలకు ఆస్కారం ఉన్న రోడ్లను,బ్రిడ్జిలను గుర్తించి ప్రమాద హెచ్చరికలు పెట్టాలనీ,అందుకు అన్ని శాఖలతో సమన్వయం చేసుకోవాలన్నారు. రోడ్లు, బ్రిడ్జిలు, కల్వర్టులు,లో కాజ్ వేలు వివరాలను మంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. గత ఏడాది వానకాలం సీజన్ లో క్షేత్ర స్థాయిలో మానిటరింగ్ చేస్తూ అప్రమత్తంగా ఉన్నట్లే..ఎర్రమంజిల్ ప్రధాన కార్యాలయంలో కంట్రోల్ రూమ్ సెంటర్ ఏర్పాటు చేసుకుని,జిల్లాల వారీగా రోజు వారి పరిస్థితులు పర్యవేక్షించాలని చెప్పారు. ఆర్ అండ్ బి డివిజన్ ల వారిగా క్షేత్ర స్థాయి రిపోర్ట్ రోజు తనకు తెలపాలని మంత్రి అధికారులకు స్పష్టం చేశారు.రాష్ట్ర స్థాయి అధికారులతో పాటు సి.ఈ,ఎస్.ఈ,ఈ.ఈ, డి.ఈ,ఏ.ఈ లు ఖచ్చితంగా ప్రతి రోజు ఫీల్డ్ విజిట్ చేయాల్సిందేనని తేల్చి చెప్పారు.పురోగతిలో ఉన్న పలు రోడ్లు, ఆర్వోబి,ఆర్యుబి లపై ఆరా తీసిన మంత్రి,తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. ఫినిషింగ్ స్టేజ్ లో ఉన్నవాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు.

### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి:

రాష్ట్రంలో రోడ్ నెట్వర్క్ అభివృద్ధి పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు ప్రత్యేక దృష్టి సారించినట్లు మంత్రి ఈ సందర్భంగా అధికారులతో పేర్కొన్నారు. హ్యామ్ పనులకు అతి త్వరలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా శంకుస్థాపన ఉంటుందని మంత్రి అన్నారు. 2047 రైసింగ్ తెలంగాణ నినాదంతో 3ట్రిలియన్ ఎకానమీ లక్ష్యంగా వెళ్తున్న సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా గ్లోబల్ సమ్మిట్ వేదికగా రాష్ట్ర రోడ్ సెక్టార్ పాలసీ తీసుకువచ్చామని గుర్తు చేశారు. గ్రామీణ స్థాయి నుండి రహదారులు అభివృద్ధి చేయడం వల్ల పరిశ్రమలు వచ్చి, పల్లెల్లో ఉపాధి అవకాశాలు పెరుగుతాయని చెప్పారు.

రీజినల్ రింగ్ రోడ్డు ప్రాజెక్టు రాష్ట్రానికి గేమ్ చేంజర్ గా మారనుందని,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,తాను కేంద్రమంత్రి నితిన్ గడ్కరీనీ కలిసి ప్రాజెక్ట్ వేగంగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని కోరిన విషయాన్ని గుర్తు చేశారు. ఇటీవల RRR సదరన్ పార్ట్ పై మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి గారికి కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ రాసిన లేఖపై సమీక్షలో ప్రస్తావనకు వచ్చింది. కేంద్రం నుండి వెంటనే సదరన్ పార్ట్ పై అప్రూవల్ వచ్చేలా ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నామని,ఇక్కడి కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి,బండి సంజయ్,రాష్ట్ర బీజేపీ ఎంపీలు ఈ విషయంలో చొరవ తీసుకోవాలని కోరారు. రాజకీయాలకు అతీతంగా రాష్ట్రాభివృద్ధికి సహకరించాలన్నారు.రీజినల్ రింగ్ రోడ్డు ఉత్తర భాగం భూసేకరణలో రాష్ట్ర వాటా కింద 626.87 కోట్లు ఇప్పటికే NHAI ఖాతాలో జమచేసినట్లు వెల్లడించారు.హై స్పీడ్ రైల్ కారిడాల్ (హైదరాబాద్ – పూణే – ముంబై,భారత్ ఫ్యూచర్ సిటీ – చెన్నై,ఫ్యూచర్ సిటీ – బెంగళూరు) పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారితో ప్రత్యేకంగా చర్చిస్తానని ఈ సందర్భంగా మంత్రి చెప్పారు.

### ఎయిర్పోర్ట్ ల పనుల పురోగతిపై ఆరా..

వరంగల్ ఎయిర్పోర్ట్, ఆదిలాబాద్ ఎయిర్పోర్ట్ పనులు వేగంగా జరుగుతున్నాయని రూరల్ ఎకానమీ గ్రోత్ కి ఎంతో ఉపయుక్తం కానున్నాయని మంత్రి అభిప్రాయ పడ్డారు. వరంగల్ ఎయిర్పోర్ట్ పనులు వేగంగా జరుగుతున్నాయని వచ్చే ఏడాది నాటికి కార్గో సేవలు అందుబాటులోకి వచ్చేలా పనులు చేస్తున్నట్లు తెలిపారు.

### నందిపాడ్ వెహికల్ అండర్ పాస్ నిర్మాణం పై...

న్యామ్ రోడ్డులో మిర్యాలగూడ నియోజకవర్గంలోని నందిపాడ్ వద్ద తరచూ యాక్సిడెంట్స్ జరుగుతున్నాయని,వెంటనే అక్కడ వెహికిల్ అండర్ పాస్ నిర్మించేందుకు ఏర్పాట్లు చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. పరిపాలన అనుమతులు మంజూరు చేసి, పనులు అతి త్వరగా ప్రారంభం అయ్యేలా చూడాలని చెప్పారు.

ఈ సమీక్ష సమావేశంలో స్పెషల్ సిఎస్ వికాస్ రాజ్, సెక్రెటరీ ప్రావిణ్య,సి.ఈ లు బి.వి రావు,ధర్మారెడ్డి, వనజ పలువురు ఆర్ అండ్ బి ఇంజనీర్లు ఉన్నారు.